మన సమగ్ర
# ప్రజావాణి
RNI NO:TGTEL/25/A5443
తెలుగు డైలీ
MANA SAMAGRA PRAJAVANI TELUGU DAILY

| రాజన్న సిరిసిల్ల | ఆదివారం | 03.05.2026 | సంపుటి : 01 | సంచిక : 117 | పేజీలు : 12 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| RAJANNA SIRICILLA | SUNDAY | 03.05.2026 | Volume : 01 | Issue : 117 | Pages : 12 | Cost : 2/- |


Wanted Reporters
తెలుగు రాష్ట్రాలలో దిగ్విజయంగా నడుపబడుతున్న
ప్రజావాణి దిన పత్రిక మరియు మన ప్రజావాణి NEWS TV చానల్
నందు పనిచేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా
విలేఖరులు కావలెను
( కొత్తవారికి అవకాశం, అనుభవం కల వారికి ప్రాధాన్యత )
Ph: 9440032006

## పవన్‌కు సిఎం చంద్రబాబు పరామర్శ



హైదరాబాద్,మే 2 : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను పరామర్శించారు. ఇటీవల పవన్ కళ్యాణ్‌కు సర్జరీ జరగడంతో ప్రస్తుతం ఆయన విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో శనివారం హైదరాబాద్‌లోని పవన్ కళ్యాణ్ నివాసానికి సీఎం చంద్రబాబు వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించిన సీఎం చంద్రబాబు, తగినంత విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. అలాగే వైద్యుల సలహాలను పాటించాలని కూడా చెప్పారు.తనను పలకరించడానికి వచ్చిన సిఎం చంద్రబాబుకు పవన్ కృతజ్ఞత తెలిపారు.

## అవును.. సముద్రపు దొంగలమే...

- ఇరాన్ నౌకల స్వాధీనంలో అమెరికన్ నేవీ పైరేట్స్ పాత్ర పోషిస్తుంది
- నౌకలలోని చమురంతా అమెరికాకే ఇది లాభసాటి వ్యాపారంలా ఉంది: ట్రంప్ ఆసక్తికర వ్యాఖ్యలు



ఫ్లోరిడా,మే 2 : ఇరాన్ పోర్టుల దిగ్బంధానికి అమెరికా నౌకలు ఎంతకైనా తెగిస్తాయని ట్రంప్ తెలిపారు. అవును అవసరం అయితే తమ బలీయమైన యు ఎస్ నేవీ పైరెట్స్ పాత్ర పోషిస్తుందని తెలిపారు. అమెరికాలోని ఫ్లోరిడాలో శుక్రవారం రాత్రి తరువాత ఆయన ఓ ర్యాలీలో ఉత్సాహంతో ప్రసంగించారు. ఇరాన్‌పై బ్లాకేడ్ సాగుతోంది. ఇరాన్ చమురుతో కూడిన నౌక లు, ట్యాంకరును అమెరికా నౌకాదళాలు స్వాధీనం చేసుకున్న విషయాన్ని బహిరంగంగా ప్రకటించారు.ఈ పని చాలా ఘనంగా జరిగిందని చెప్పా రు. సముద్ర జలాల్లో ఆ నౌకలపైకి చేరుకున్నామని, వాటిని స్వాధీనం చే సుకున్నామని, అందులోని మిగతా2లో...

## వారే.. ప్రభుత్వానికి కళ్లు, చెవులు: సిఎం రేవంత్

- విప్‌లు నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజా సమస్యలను పరిష్కరించాలి
- ప్రభుత్వ సంక్షేమ పథకాలను మరింత క్షేత్రస్థాయికి తీసుకెళ్లాలి
- సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరిస్తుందన్న నమ్మకం ప్రజలకు కల్పించాలి
- శాసనసభ, శాసనమండలి విప్‌లకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచన

హైదరాబాద్,మే 2 : ప్రభుత్వానికి కళ్లు, చెవులు విప్‌లేనని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. శాసనసభ, శాసనమండలి విప్‌లతో శనివారం సాయంత్రం ఎంసిఆర్‌హెచ్‌ఆర్‌డిలతో జరిగిన సమావేశంలో రాష్ట్రంలో ప్రజా సమస్యలను విప్‌లు సిఎం దృష్టికి తీసుకెళ్లారు. వేసవి నేపథ్యంలో నియోజవర్గాల్లో త్రాగునీరు, సాగునీటి అవసరాలకు తీసుకోవాల్సిన చర్యలు, ధాన్యం సేకరణలో పురోగతి వివరాలను ముఖ్యమంత్రికి వారు తెలియచేశారు. ధాన్యం సేకరణ ప్రక్రియను మరింత వేగవంతం చేయడంతో పాటు సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సిఎం ఆదేశించారు. విప్‌లు నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజా సమస్యలను పరిష్కరించాలని సిఎం దిశానిర్దేశం చేశారు.సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు స్థానిక జిల్లా మిగతా2లో...





## ఉద్యోగుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

- రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం 6వేల కోట్లు చెల్లింపు
- జూన్ 1లోగా ఆరోగ్య భద్రతా కార్డులను అందిస్తాం
- ఉద్యోగ సంఘాలతో భేటీలో సిఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్,మే 2 : వంద రోజుల్లో ప్రభుత్వ ఉద్యోగుల రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం రూ.6వేల కోట్లు చెల్లిస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ నిధుల ఖర్చు ప్రాధాన్యతలు ఉద్యోగులే నిర్ణయిస్తారని చెప్పారు. ఉద్యోగుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం మరోమారు భరోసా ఇచ్చారు. ఈ మేరకు సంఘాల నాయకులతోశనివారం సీఎం రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఉద్యోగులకు పలు హామీలు మిగతా2లో...

## బతుమ్మకుంట ముమ్మాటికీ చెరువే...

- అక్కడ చెరవు పదెకరాల్లో ఉన్నట్లు నాసా చిత్రాలు ఉన్నాయి
- ఎడ్ల సుధాకర్ హైకోర్టుకు వెళ్లడంపై హైడ్రా కమిషనర్ వివరణ



హైదరాబాద్,మే2 : హైదరాబాద్ బతుకమ్మ కుంట చెరువు భూమి తనదే అని, అక్కడ తాను వ్యవసాయం కూడా చేసినట్లు హైకోర్టును ఎడ్ల సుధాకర్ ఆశ్రయించిన క్రమంలో అందుకు ఆధారాలు లేవని, అయినా చెరువును ఆక్రమించి వ్యవసయాం చేయడం కూడా నేమేనని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అన్నారు. మిగతా2లో...

## గ్లోబల్ బిజినెస్ హబ్‌గా తెలంగాణ

ఎక్స్‌ప్లోర్ టు ఎక్స్‌పాండ్ లోగో ఆవిష్కరణలో శ్రీధర్ బాబు



2లో

## రైతు సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ విఫలం

- సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్ర ఆగ్రహం 2 లో

## సిరిసిల్ల వాసుల మృతిపై కెటిఆర్ సంతాపం

- ఉస్మానియా మార్చురీ వద్ద మృతులకు నివాళి



హైదరాబాద్,మే 2 : శంషాబాద్ వద్ద ఓఆర్ఆర్‌పై జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఆరుగురు సిరిసిల్ల వాసుల పార్థివ దేహాలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నివాళులర్పించారు. ఉస్మానియా జనరల్ హాస్పిటల్ మార్చురీ వద్ద ఆయన నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. వారికి ధైర్యం చెప్పారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని సర్దార్‌నగర్‌కు చెందిన బొల్లి శివకుమార్ (40), బొల్లి లాస్య (35) దంపతులకు కూతురు రిషిక (8) ఉన్నారు. వీరు హైదరాబాద్ సనత్‌నగర్‌లో నివాసం ఉంటున్నారు. శివకుమార్ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తుండగా, లాస్య సివిల్‌సప్లై శాఖలో ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేస్తున్నారు. వేసవి సెలవులు కావడంతో సిరిసిల్లలో ఉంటున్న శివకుమార్ సోదరి కోడం తేజశ్రీ (శ్వేత) (36), భర్త శ్రీనివాస్ (41), పిల్లలు కృష్ణచంద్ర (14), మాధవ్ (11)తో కలిసి మిగతా2లో...

## సర్వోదయ తెలంగాణ కోసం పాంచజన్యం పూరించాం

- అన్ని వర్గాల ప్రజల సంక్షేమం లక్ష్యంగా పోరాటం
- ప్రజలకు విద్య, వైద్యం కోసం ప్రత్యేక దృష్టి
- ప్రతి అంశంపైనా స్పష్టమైన విధానంతో సాగుతాం
- మీట్‌ద ప్రెస్ కార్యక్రమంలో కవిత



హైదరాబాద్,మే 2 : తెలంగాణ రక్షణ సేన ఐదు అంశాలను ప్రధాన అజెండాగా తీసుకుందని కల్వకుంట్ల కవిత అన్నారు. పాంచజన్యం పూరించామని, ఇక విజయపథంలోకి దూసుకు పోతామని అన్నారు. సర్వోదయ తెలంగాణ లక్ష్యంగా పోరాటం చేస్తామని అన్నారు. ఎంత పెద్ద ఆరోగ్య సమస్య వచ్చినా.. పేదలకు ఉచితంగా వైద్యం అందిస్తామన్నారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో కవిత మాట్లాడారు. పేదలకు నాణ్యమైన ఉచిత విద్య, వైద్యం అందాలన్నదే తమ లక్ష్యం అన్నారు. ధాన్యం కొనుగోళ్లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయి. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు రోజులతరబడి పడిగాపులు కాస్తున్నారు. ధాన్యం కుప్పల పైనే ప్రాణాలు విడుస్తున్నారు.ప్రభుత్వాలు ఇస్తున్న హామీల వల్ల ఉపాధి అంటే హాస్యాస్పదమైంది. మేం చెప్పే ఉపాధి కల్పన అంటే.. ప్రభుత్వ ఉద్యోగాలు మాత్రమే కాదు. మిగతా2లో...



## సిబ్బంది, ప్రయాణికులతో మర్యాదగా ఉండాలి

- వేధింపులకు గురిచేయడం సరికాదు
- ఆర్టీసీ అధికారులకు మంత్రి పొన్నం హితవు

హైదరాబాద్,మే 2 : కిందిస్థాయి ఆర్టీసీ సిబ్బంది, ప్రయాణికుల విషయంలో ఆర్టీసీ అధికారులు సానుకూలంగా ఉండాలని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. సిబ్బందిని వేధింపులకు గురిచేయకుండా ప్రేమతో, సానుకూల దృక్పథంతో పనులు చేయించాలని డివిజన్ స్థాయి అధికారులకు సూచించారు. ఆర్టీసీ ఉన్నతాధికారులతో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ జూమ్ సమావేశం నిర్వహించారు. శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఆర్టీసీ కార్మిక సంఘాల నేతలకు జరిగిన సమావేశంలో కార్మిక సంఘాలు లేవనెత్తిన అంశాలపై అధికారులకు మంత్రి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. ఆర్టీసీ అధికారులు కింది స్థాయి డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బంది పట్ల దురుసుగా మిగతా2లో...

ఆదివారం ,
మే 03, 2026
మన సమస్యల ప్రజావాణి తెలుగు డైలీ



# గ్లోబల్ బిజినెస్ హబ్‌గా తెలంగాణ

**హైదరాబాద్,మే 2 :** తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు 'ఎక్స్‌ప్లోర్ టు ఎక్స్‌పాండ్ ఇటూ ఇ ' అనే అంతర్జా తీయ వేదిక లోగోను అధికారికంగా ఆవిష్కరించారు. ఈ వేదిక ద్వారా తెలంగాణలోని వ్యాపారులు, ఎగుమ తిదారులు, విద్యార్థులు, స్టార్టప్‌లు, నిపుణులు అంతర్జా తీయ అవకాశాలను అన్వేషించి ప్రపంచ స్థాయిలో విస్తరించే అవకాశాలు కల్పించబడతాయి.మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. ఇలాంటి అంతర్జాతీయ వేదికలు వ్యాపారవేత్తలకు, ఎగుమతిదారులకు, యువతకు కొత్త అవకాశాలను తీసుకువస్తాయని అన్నారు. తెలంగాణను గ్లోబల్ బిజినెస్ హబ్‌గా నిలబెట్టడంలో ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. వ్యాపారులు, ఎగుమతిదారులు, విద్యార్థు లు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొని అవకాశా లను సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపుని చ్చారు. ఈ కార్యక్రమాన్ని రూపకల్పన చేసి ముందుకు తీసుకెళ్తున్న సందీప్ కుమార్‌ను ఈ సందర్భంగా మంత్రి అభినందిస్తూ, తెలంగాణ ప్రతిభను ప్రపంచా నికి చేర్చే మంచి ప్రయత్నమని ప్రశంసించారు. ఈ సిరీస్‌లో భాగంగా మొదటి అంతర్జాతీయ మిషన్ సింగపూర్‌లో మే 21 నుంచి 24 వరకు నిర్వహించనున్నారు. ఈ పర్యటనలో వ్యాపార అవకాశాలు, భాగస్వామ్యాలు, అంతర్జాతీయ నెట్‌వర్కింగ్, మార్కెట్ అవగాహనపై ప్రత్యేకంగా దృష్టి సారించనున్నారు. తదుపరి దశలో ఇతర దేశాల్లో కూడా ఇలాంటి మిషన్లు నిర్వహించి ఈ కార్యక్రమాన్ని గ్లోబల్ సిరీస్‌గా విస్తరించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఎక్స్‌ప్లోర్ టు ఎక్స్‌పాండ్ (ఇ2ఇ) అనేది అంతర్జాతీయ మార్కెట్లను పరిచయం చేసే ఒక సమగ్ర కార్యక్రమం. ఇందులో బిజినెస్ డెలిగేషన్లు, ఎగుమతి ప్రోత్సాహక పర్యటనలు, విద్యార్థుల గ్లోబల్ ఎక్స్‌పోజర్ ప్రోగ్రామ్‌లు, ఇంటర్న్‌షిప్ అవకాశాలు, వ్యూహాత్మక నెట్‌వర్కింగ్ కార్యక్రమాలు నిర్వహించబడతాయి. ఈ వేదిక స్థానిక ప్రతిభను అంతర్జాతీయ అవకాశాలతో అనుసంధానించే వంతెనగా పనిచేస్తుంది.

# సిరిసిల్ల వాసుల మృతిపై కెటిఆర్ సంతాపం

(మొదటి పేజీ తరువాయి)

గురువారం హైదరాబాద్‌కు వెళ్లారు. శుక్రవారం రెండు కుటుంబాలు యాదగిరిగుట్ట, స్వర్ణగిరిలో దైవదర్శనా నికి వెళ్లాయి. తిరుగు ప్రయాణంలో సాయంత్రం 4 గంటల ప్రాంతంలో శంషాబాద్ ఓఆర్ఆర్‌పై 16వ ఎగ్జిట్ వద్ద ఆగి ఉన్న లారీని వీరు ప్రయాణిస్తున్న కారు అతివేగంగా ఢీకొన్నది. దీంతో కారు లారీలో ఇరుక్కొని నుజ్జునుజ్జయింది. అక్కడి కక్కడే ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. కారులో నుంచి మృతదేహాలను అతికష్టం మీద వెలికితీశారు. ప్రమాదంలో శివకుమార్, లాస్య, శ్రీనివాస్, చిన్నారులు రిషిక, కృష్ణచంద్ర, మాధవ్ మృత్యువాతపడ్డారు. కోడం తేజశ్రీ(శ్వేత) చావు బతుకుల్లో ఉండగా హైదరాబాద్ ఉస్మానియా దవాఖా నకు తరలించారు. అనంతరం కిమ్స్‌కు తరలించారు. మృతుల్లో ముగ్గురు చిన్నారులు ఉన్నారు. సిరిసిల్లకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు బొల్లి రామ్మోహన్ సోదరుడు బొల్లి రాజు కొడుకు, కోడలు, అల్లుడి కుటుంబాలు మృత్యువాతపడటంతో తీవ్ర విషాదం నెలకొన్నది. విషయం తెలుసుకున్న శంషాబాద్ డీసీపీ యోగేశ్‌గౌతం ఘటనాస్థలానికి చేరుకున్నారు. డ్రైవింగ్ చేస్తున్న వ్యక్తి అలసిపోయి రెప్పవాల్చడంతో వేగంగా వెళ్లి కారు ఆగి ఉన్న లారీని ఢీకొట్టి ఉంటుందని డీసీపీ వెల్లడించారు. దర్యాప్తులో ప్రమాదానికి గల కారణాలు తెలుస్తాయని చెప్పారు. సూర్యాపేట నుంచి నూకల లోడ్‌తో నంద్యాలకు వెళ్తుండగా లారీపై ఉన్న తాడిపత్రి సరిగాలేకపోవడంతో, సరిచేసేందుకు పక్కకు ఆపుకొన్నట్టు డ్రైవర్ శ్రీనివాస్ తెలిపారు. తాను డ్రైవింగ్ సీట్‌లోనే ఉన్నానని, క్లీనర్ లారీపైకి ఎక్కి తాడిపత్రి సరిచేస్తుండగా వెనుక నుంచి వేగంగా వచ్చిన కారు.. లారీని ఢీకొట్టిందని వెల్లడించారు.

# బతుమ్మకుంట ముమ్మాటికీ చెరువే...

(మొదటి పేజీ తరువాయి)

ఈ అంశం ఇటీవల పెద్దఎత్తున చర్చకు తెరలేపింది. దీనిపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ తాజాగా స్పందించారు. బతుకమ్మ కుంటను హైడ్రా అభివృద్ధి చేయడంపై ఎడ్ల సుధాకర్ పిటిషన్ వేశారని తెలిపారు. 1986 నాటి అన్ రిజిస్టర్డ్ సేల్ అగ్రిమెంట్ మాత్రమే ఆయన వద్ద ఉందని.. రిజిస్టర్డ్ అగ్రిమెంట్ ఉంటేనే రూల్ ప్రకారం చెల్లుబాటు అవుతుందని రంగనాథ్ అన్నారు. బతుకమ్మ కుంట అభివృద్ధిపై డివిజన్ బెంచ్‌కు సుధాకర్ వెళ్లారని.. కంటెంప్ట్ ఆర్డర్‌లో కోర్టు తమను తప్పుపట్టిందని హైడ్రా కమిషనర్ చెప్పారు. డివిజన్ బెంచ్ ఆదేశాల ప్రకారం అక్కడ బోర్డులు, ఇతర నిర్మాణాలు తొలగించామని వెల్లడించారు. హైకోర్టు ఆదేశాలను తాము పాటిస్తామని స్పష్టం చేశారు. సుధాకర్ అసలు అక్కడ చెరువే లేదని అంటు న్నారని.. కానీ 1990 నాటి నాసా శాటిలైట్ ఫొటోల్లో బతుకమ్మ కుంట కనిపిస్తోందన్నారు. 1970లో భారతీయ సర్వే ఆఫ్ ఇండియా నీటి సర్వేల్లోనూ పూర్వం నుంచే చెరువు ఉన్నట్లు తేలిందన్నారు. ఎర్రకుంట పేరుతో 1975 పహనీలలో 563/-1తో బతుకమ్మ కుంట ఉందన్నారు. సుధాకర్ భూమిని చెరువుగా మార్చామనేది నిజం కాదని.. తమ వద్ద ఉన్న అన్ని ఆధారాలను కోర్టుకు సమర్పిస్తున్నట్లు పేర్కొన్నారు. మరోవైపు నార్సింగ్‌లోని ముష్కిమ్ చెరువు ఆక్రమణ కూల్చివేతలపై ముందుగానే సమాచారం ఇచ్చామని హైడ్రా కమిషనర్ తెలిపారు. సున్నం చెరువు బాధితులతో సమావేశం ఏర్పాటు చేశామని.. సీఎం ఆదేశాలతో వారికి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కూడా ఇస్తున్నట్లు వెల్లడించారు.

ఐలాపూర్‌లో ప్రభుత్వ భూమి ఆక్రమణలపైనా డ్రైవ్ చేసినట్లు చెప్పుకొచ్చారు. ఇప్పటివరకూ హైడ్రా 2,093 ఎకరాల భూమిని రికవరీ చేసిందన్నారు. ఇప్పుడున్న మార్కెట్ ధర ప్రకారం ఆ భూముల విలువ రూ.80 వేల కోట్ల వరకు ఉంటుందని రంగనాథ్ తెలిపారు.

హైడ్రా పరిధిలో 90 ఎఫ్ఐఆర్‌లు ఇప్పటివరకు నమోదయ్యాయని వెల్లడించారు. ఫాతిమా కాలేజ్ విషయంలో హైకోర్టు ఆదేశాలతో ఎఫ్‌టీఎల్ డిమార్కింగ్ చేయాలని రంగనాథ్ చెప్పుకొచ్చారు.

# ఉద్యోగుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

(మొదటి పేజీ తరువాయి)

ఇచ్చారు. పీఆర్సీపై తక్షణమే రిపోర్టు అందించాలని అధికారుల కమిటీని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. రిపోర్టు ఆధారంగా పీఆర్సీపై నిర్ణయం తీసుకుంటా మని రేవంత్ భరోసా ఇచ్చారు. జూన్ 1లోగా ఆరోగ్య భద్రతా కార్డులనూ ఉద్యోగులకు అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రతీ రెండు నెలలకోసారి గుర్తింపు సంఘాలు సమావేశమై సమస్యలపై ప్రభుత్వానికి రిపోర్టు అందించాలని పేర్కొన్నారు. ప్రభుత్వం ఏ పథకాన్ని ప్రకటించినా ఉద్యోగులు భుజాన వేసుకుని పని చేశారని ప్రశంసించారు. వారి సహకారంతోనే ప్రభుత్వ సంక్షేమ పథకాలను విజయవంతంగా అమలు చేయగలుగుతున్నామని కొనియాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగుల కోసమే మొదటి నిర్ణయం తీసుకున్నామని గుర్తు చేశారు. ఉద్యోగులకు ప్రతీ నెలా మొదటి తారీకునే జీతాలు అందేలా చర్యలు చేపట్టినట్లు రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు. ఉద్యోగ సంఘాలు స్వేచ్ఛగా ఎన్నికలు నిర్వహించుకునేలా అవకాశం కల్పించామన్నారు. ఉద్యోగుల బదిలీల విషయంలో గందరగోళం తలెత్త కుండా ప్రణాళిక ప్రకారం చేసినట్లు చెప్పుకొచ్చారు. ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న టీచర్ల బదిలీలనూ ఎలాంటి వివాదం లేకుండా పూర్తి చేశామన్నారు. ఉద్యోగుల ఆరోగ్య భద్రతా కార్డుల ప్రతిపాదనపైనా ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందన్నారు. ఈ రెండేళ్ల ప్రజా ప్రభుత్వంలో 67,760 ఉద్యోగ నియా మకాలు చేపట్టినట్లు ఆయన చెప్పుకొచ్చారు. 'ఇది ఫ్రెం డ్లీ ప్రభుత్వం.. మీ సమస్యలను పరిష్కరించే బాధ్యత మాది' అంటూ సీఎం భరోసా కల్పించారు.

# సర్వోదయ తెలంగాణ కోసం పాంచజన్యం పూరించాం

(మొదటి పేజీ తరువాయి)

యువత, మహిళలు ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలి. యువత, మహిళలను వ్యాపారులుగా తీర్చిదిద్దే ప్రణాళికలు రూపొందిస్తున్నాం. రూ.2 లక్షల నుంచి రూ.20 కోట్ల వరకు రుణాలు ఇచ్చేలా ప్రణాళికలు రూపొందిస్తున్నాం. ప్రభుత్వాలు భర్తీ చేయని బ్యాక్‌లాగ్ ఉద్యోగాలను భర్తీ చేస్తాం అని కవిత పేర్కొన్నారు. తెలంగాణలో కొత్త రాజకీయ శక్తిగా వస్తామని చెప్పాం.. వచ్చామని టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. . అన్ని అడ్డంకులను అధిగమించి తెలంగాణ రక్షణ సేన పేరుతో రాజకీయ వేదికను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 20 ఏళ్లుగా కొనసాగుతున్న తెలంగాణ జాగృతి స్వచ్ఛంద సంస్థ అలాగే కొనసాగుతుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల సమస్యలపై తెలంగాణ రక్షణ సేన పోరాటం చేస్తుందని, సర్వోదయ తెలంగాణ లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు వెల్లడించారు. పాంచజన్యం పేరుతో ఐదు ప్రాధాన్య అంశాలను తీసుకున్నట్లు కవిత తెలిపారు. ఇప్పుడు ప్రతిపక్షంగా ఉన్నా, భవిష్యత్తులో అధికారంలోకి వచ్చినా ప్రధాన ఫోకస్‌గా ఉంటాయని చెప్పారు. ప్రజల ఆదాయంలో 60 శాతం విద్య, వైద్యం కోసమే ఖర్చవుతోందని.. దీని వల్ల సేవింగ్స్ సాధ్యం కావడం లేదని తెలిపారు. ప్రభుత్వం ఉచిత విద్య ఇస్తున్నా 75 శాతం మంది ప్రైవేటు సంస్థల్లో చదువుతున్నారని, వారందరికీ కూడా ఉచిత విద్య అందించేందుకు అన్ని లెక్కలు వేసినట్లు తెలిపారు. వైద్యం విషయంలో క్యాన్సర్ వంటి వ్యాధులతో చికిత్సకు డబ్బుల్లేక చనిపోతున్న పరిస్థితి ఉందని కవిత అన్నారు. తెలంగాణ రక్షణ సేన ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎన్ని లక్షలు ఖర్చైనా ప్రజల వైద్యం కోసం తెలంగాణ రక్షణ సేన ప్రభుత్వం వెనుకడుగు వేయదని హామీ ఇచ్చారు. రైతన్నలకు ఆత్మగౌరవం కల్పించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని కవిత అన్నారు. ప్రస్తుతం కల్లాల దగ్గరే వడ్లు పడి ఉండటం, కొనుగోలు కేంద్రాలు తెరవాలని ధర్నాలు చేయాల్సిన పరిస్థితి ఉందని విమర్శించారు. రైస్ ఎగుమతి చేసే అవకాశాలున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఓ రైతు మక్కల కొనుగోలు కేంద్రంలోనే మరణించిన సంఘటనను ప్రస్తావించిన కవిత.. రైతు ప్రాణానికి విలువ లేకపోవడం బాధాకరమన్నారు. రైతన్నలకు మేలు చేసే విషయంలో తాము చాలా సీరియస్‌గా పనిచేస్తున్నామన్నారు. రాష్ట్రంలో ఉపాధి అంటే ఒక జోక్‌గా మారిందని.. యువత అవసరాలను ప్రభుత్వం అర్థం చేసుకోవడం లేదని కవిత విమర్శించారు. 18-25 ఏళ్ల జెన్ జీ యువతను నమ్ముతున్నట్లు చెప్పారు. మంచి ఆలోచనలతో వచ్చే 25-45 ఏళ్ల వారికి రూ.2 లక్షల నుంచి రూ.20 కోట్ల వరకు రుణాలు ఇచ్చి ఉపాధి కల్పిస్తామని ప్రకటించారు. యువత ఉద్యోగాలు వెతకకుండా ఉద్యోగాలు ఇచ్చేలా తయారవ్వాలని.. గూగుల్, వాట్సాప్ లాంటి సంస్థలు తెలంగాణ నుంచి రావాలని ఆకాంక్షించారు. సీనియర్ సిటిజన్స్ కోసం ప్రత్యేక శాఖ ఏర్పాటు చేసి వారి సమస్యలను పరిష్కరిస్తామని తెలిపా రు. 65 ఏళ్లు దాటి రిటైర్డ్ అయిన ఐఏఎస్, ఐపీఎస్‌ల కు కూడా బ్యాంకులు రుణాలు ఇవ్వటం లేదన్నారు. తమ ప్రభుత్వం వచ్చాక సీనియర్ సిటిజన్స్ కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటామని చెప్పారు. అగ్రవర్ణా ల్లోని పేదలు, దివ్యాంగులు, మాజీ మావోయిస్టులు, మాజీ సైనికులు, అందరికీ ఇళ్లు కట్టించడం సామాజిక న్యాయమేనని కవిత వివరించారు. అమ్మలా పాలన చేస్తేనే ప్రజలకు న్యాయం జరుగుతుందని, తమ పాలన అలాంటిదే అని కవిత పేర్కొన్నారు. ఇకపోతే తండ్రిగా కెసిఆర్‌ను విమర్శించలేదని, బిఆర్ఎస్ అధ్యక్షుడిపైనే విమర్శలు చేశామన్నారు. తాతు తలపెట్టిన ఐదు అంశాలపై పెద్ద కసరత్తు చేశామని, తమవద్ద ప్రణాళిక ఉందని అన్నారు.

# అవును.. సముద్రపు దొంగలమే...

(మొదటి పేజీ తరువాయి)

చమురును తీసుకున్నామని, ఇదంతా కూడా చాలా లాభసాటి వ్యాపారవ్యవహారం అన్పిస్తోందని ర్యాలీలో తెలిపారు. అమెరికా నౌకాదళాలు ఇప్పుడు ఏకంగా సముద్ర జలాల్లో సాయుధ దోపిడీలకు దిగుతున్నాయని ఇరాన్ మండిపడింది. ఇరాన్ ముడిచమురును తీసుకువస్తున్న రెండు ట్యాంకర్లను అమెరికా నౌకలు అటకాయించడంపై ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఆగ్రహం వ్యక్తం చేశారు.

# సిబ్బంది, ప్రయాణికులతో మర్యాదగా ఉండాలి

(మొదటి పేజీ తరువాయి)

కాకుండా ఫ్రెండ్లీగా స్నేహపూర్వకంగా పనులు చేయించుకోవాలని మంత్రి అన్నారు. డిపో మేనేజర్లు, ఆర్టీసీ సిబ్బంది.. ప్రయాణికులతో సత్సంబంధాలు కలిగి ఉండాలన్నారు. మే 17 లోగా డిపోలు, బస్ స్టేషన్లలో కార్మికులకు మౌలిక సదుపాయాలు మెరుగుపరచాలని ఆదేశించారు. టాయిలెట్స్, మంచి నీటి సౌకర్యం, ఎలాంటేషన్, పరిశుభ్రత పాటించాలన్నారు. 2023 డిసెంబర్ 9 నుంచి ఆర్టీసీలో మహాలక్ష్మి పథకాన్ని అమలులోకి తీసుకొచ్చామని మంత్రి తెలిపారు. ఖమ్మం, మెదక్, రంగారెడ్డి, నారాయణఖేడ్, బాన్సువాడ, ఇల్లందు లాంటి కొన్ని డిపోలు నష్టాల్లో ఎందుకు నడుస్తున్నాయో ఆర్ఎంలు, డిపో మేనేజర్లు సమీక్షించుకోవాలన్నారు. టికెట్‌కు సంబంధించి ఏదైనా ఇబ్బందులు జరిగితే చర్యలు తీసుకోవాలని.. సిబ్బంది గొడవలు పెట్టుకోవడం సరికాదన్నారు. సంస్థలో ఇంటర్నల్ ఎటాక్ అనేది ప్రమాదకరమైన విషయమని అన్నారు. ప్రతి రెండో మంగళవారం ఆర్టీసీ సిబ్బంది సమస్యలు వినడానికి అన్ని డిపోల్లో గ్రీవెన్స్ ఏర్పాటు చేయా లని.. డిపో మేనేజర్లు, ఇతర సిబ్బంది అందుబాటులో ఉండాలని మంత్రి ఆదేశాలు జారీ చేశారు. ఆర్టీసీ డిపో మేనేజర్లు.. గ్రామ సర్పంచ్ నుంచి మొదలు ప్రజా ప్రతినిధులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల తో మంచి ప్రజా సంబంధాలు కొనసాగించాలని సూచించారు. 'ఏదైనా సమస్య మీ స్థాయిలో పరిష్కారం కాకపోతే ఆర్టీసీ ఎండీ స్థాయిలో పరిష్కారం చేద్దాం. సిబ్బంది పట్ల సానుకూలంగా ఉండాలి. మంత్రి నుంచి సిబ్బంది వరకు అందరం కలిసి పని చేద్దాం. ఆర్టీసీ సమ్మెలో కార్మికులు డిమాండ్ చేసిన సమస్యలను పరిష్కారం చేస్తున్నామని.. భవిష్యత్తులో మంచి ఫలితాలను సాధించే దిశగా ముందుకు వెళ్దామని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. జూమ్ సమావేశంలోఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, ఈడీలు, ఆర్ఎంలు, వివిధ విభాగాల హెచ్ఓడీలు, డీఎంలు పాల్గొన్నారు.

# కాంట్రాక్టర్లను కెటిఆర్, హరీష్ బెదిరిస్తున్నారు

**హైదరాబాద్,మే 2 :** బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, మాజీ మంత్రి టి. హరీష్ రావు రాష్ట్రంలోని కొంత మంది కాంట్రాక్టర్లను బెదిరిస్తున్నారని ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ఆరోపించారు. టిఆర్ఎస్ వ్యవస్థాపిక అధ్యక్షురాలు కవిత చేసిన ఆరోపణలకు సమాధానం ఇవ్వకుండా తమ ప్రభుత్వంపై విమర్శలు చేస్తారా? అని వారు శనివారం విలేకరుల సమావేశంలో ప్రశ్నించారు. బావా బావమరిది పోటీ పడి మరీ బ్లాక్ మెయిల్ చేస్తున్నారని వారు విమర్శించారు. హరీష్ రావు బ్లాక్‌మెయిల్ రావుగా మారుతున్నారని వారు విమర్శించారు.నిబంధనల ప్రకారం టెండర్ ప్రక్రియ కొనసాగుతోందన్నారు. పదేళ్లు అవినీతికి పాల్పడ్డారని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్లు టెండర్లలో పాల్గొనేందుకు ముందుకు రాలేదని వారు చెప్పారు. హ్యామ్ రోడ్ల కాంట్రాక్టర్లకు ఫోన్ చేసి హరీష్ రావు బెదిరిస్తున్నారని ఆరోపించారు. హ్యామ్ రోడ్ల టెండర్ల పైన ఇంకా నిర్ణయం తీసుకోలేదని వారు చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుంటే, ప్రతిపక్షంలో కూడా సంపాదించాలన్నదే వాళ్ల ఆలోచన అని, సంపాదనే వాళ్ల పరమావధి అని వారు విమర్శించారు. హరీష్ రావుకు ధైర్యం ఉంటే తమతో చర్చకు రావాలని ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ డిమాండ్ చేశారు.

# వారే.. ప్రభుత్వానికి కళ్లు, చెవులు: సిఎం రేవంత్

(మొదటి పేజీ తరువాయి)

యంత్రాంగాన్ని అప్రమత్తం చేయాలని సిఎం సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను మరింత క్షేత్రస్థాయికి తీసుకెళ్లాలని, సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరిస్తుందన్న నమ్మకం ప్రజలకు కల్పించాలని సిఎం తెలిపారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడానికి ప్రసార మాధ్యమాలను ఉపయోగించుకోవాలన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంతో పాటు సమస్యలను ఎప్పటిక ప్పుడు తన దృష్టికి తీసుకురావాలని సిఎం సూచించారు. ప్రభుత్వ విప్‌లతో సమన్వయం చేసుకునేం దుకు, ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు వారంలో ఒక రోజు విప్‌లకు అందుబాటులో ఉంటానని సిఎం తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ ఎంపి వేం నరేందర్ రెడ్డి, శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, విప్‌లు ఆది శ్రీనివాస్, బీర్ల ఐలయ్య, యెన్నం శ్రీనివాస్ రెడ్డి, విజయరమణారావు, రామచంద్రు నాయక్, వేముల వీరేశం, అద్దంకి దయాకర్, బల్మూర్ వెంకట్‌లు పాల్గొన్నారు.

# రైతు సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ విఫలం

**● సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్ర ఆగ్రహం**




**సిద్దిపేట,మే 2 :** రైతన్నల సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ సర్కార్ విఫలమైందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ప్రభుత్వం రుణమాఫీ చారాణ చేసి.. బారాణ ఎగ్గొట్టిందని ఎద్దేవా చేశారు. శనివారం కుకునూర్‌పల్లి మండల కేంద్రంలోని బీరప్ప ఆలయ వార్షికోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో హరీశ్‌రావు, బీఆర్ఎస్ నేత వంటేరు ప్రతాప్ రెడ్డి పాల్గొన్నారు. హరీశ్‌రావు సమక్షంలో కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో పలువురు చేరారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడారు. మాజీ సీఎం కేసీఆర్ ఆశీస్సులతో సిద్దిపేట జిల్లాలో ఎక్కడలేని విధంగా బీరప్ప దేవాలయాన్ని అనాడు కేసీఆర్ చాలా చక్కగా నిర్మించారని తెలిపారు. ఒకప్పుడు గజ్వేల్‌లో మూగజీవాలకు నీరు, గ్రాసం దొరక్క జీవాలను మేపడానికి ఎక్కడికో వెళ్తుండేవారని.. కానీ కొండపోచమ్మ , మల్లన్నసాగర్ ప్రాజెక్టుతో నీరు, గ్రాసం కోసం వేరేవాళ్లు ఇప్పుడు మన దగ్గరకు వస్తున్నారని చెప్పుకొచ్చారు. జీవాలకు నట్టల మందు కూడా ఇవ్వడం రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి చేతకావట్లేదని సెటైర్లు గుప్పించారు. బీఆర్ఎస్ హయాంలో భూముల ధరలకు రెక్కలు రాగా.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక భూములను కోనేవారు, చూసేవారు లేరని హరీశ్‌రావు విమర్శించారు.

# మందుపాతర పేలి ముగ్గురు జవాన్ల మృతి

**కాంకేర్,మే 2 :** కాంకేర్ జిల్లాలో భూమిలో ఉన్న మందు పాతరలను తొలగించే క్రమంలో ఓ మందుపాతర (ఐఇడి) పేలి ముగ్గురు జవాన్లు మృతి చెందారు. ఈ ఘటన శనివారం కాంకేర్-నారాయణ్‌పూర్ సరిహద్దు సమీపంలో జరిగింది. ఛోటేబెతియా పోలీస్ స్టేషన్‌కు చెందిన పోలీసుల బృందం మావోయిస్టులు అమర్చిన మందుపాతరలను తొలగించే క్రమంలోనే ఈ ఘటన జరిగింది. మృతి చెందిన వారు జిల్లా రిజర్వ్ గార్డ్ (డిఆర్‌జి)లు. ఇన్‌స్పెక్టర్ సుక్రామ్ వట్టి, కానిస్టేబుల్ కృష్ణ కొర్రామ్, కానిస్టేబుల్ సంజయ్ గఢ్‌పాలేలు పోలీసులు ధృవీకరించారు. ఈ ఘటనలో మరొక కానిస్టేబుల్ పరమానంద్ కోర్రామ్ తీవ్ర గాయాలపాలయ్యారు. ఆయన ప్రస్తుతం చికిత్స తీసుకుంటున్నారు.

# పదో తరగతిలో 570 మార్కులతో ఉత్తమ ప్రతిభ కనబరిచిన తేజశ్రీకి సర్పంచ్ వరస మంగమ్మ ఆధ్వర్యంలో ఘన సన్మానం

- సర్పంచ్, వార్డు సభ్యులు మరియు గ్రామస్తుల సమక్షంలో సన్మాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.

**బూర్గంపాడు మండలం / మన ప్రజావాణి / మే 02.:** పదోతరగతి పరీక్ష ఫలితాలలో బూర్గంపాడు మండలం, ఉప్పుసాక ఎస్టి కాలనీ గ్రామానికి చెందిన ధరావత్. తేజశ్రీ . /. శ్రీను మార్చిలో జరిగిన పదో తరగతి పరీక్షల ఫలిత లలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి 570 మార్కులు సాధించారని సర్పంచ్ వర్స మంగమ్మ అభినందించారు. మునుముందు మరెన్నో విజయాలను సొంతం చేసుకోవాలని ఆకాంక్షించారు. ఆడపిల్లలు చదువుతోపాటు అన్నిట్లోనూ ముందుండాలని ఆకాంక్షించారు. తేజశ్రీకి 570 మార్కులు పబ్లిక్ పరీక్షలలో సాధించడం పట్ల ఊరికి ఎంతో గర్వకారణమని సర్పంచ్ కొనియాడారు . గ్రామస్తులందరూ కలిసి కేక్ కట్ చేసి విద్యార్థిని చదివిన ప్రతిభను గురించి అభినందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ తేజస్రికి సాల్వతో ఘనంగా సత్కరించరు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సర్పంచ్ వర్స మంగమ్మ , ఉప సర్పంచ్ పోదాం సుధాకర్ వార్డు సభ్యులు సోడే చంటి, మడకం అరుణ, బొల్లి రామకృష్ణ, అజ్మీర బాబురావు, ధరావత్ జానకి మరియు కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ





అధ్యక్షులు కందుల రాంబాబు , మాజీ సర్పంచ్ పాయం వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు వరుస లక్ష్మయ్య, సోడే తిరుపతిరావు, కొరస వెంకటేశ్వర్లు, ఎడమ రామారావు , ఇస్లావత్ గాంధీ, చిలకబత్తిని పట్టాభి రామయ్య , విద్యార్థిని యొక్క తల్లిదండ్రులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు

# మంచిరామి గ్రామంలో శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న

- మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి





**ప్రజావాణి జిల్లా ప్రతినిధి పెద్దపల్లి మే 02:**సుల్తానాబాద్ మండలంలోని మంచిరామి గ్రామంలో ఘనంగా నిర్వహించిన శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవంలో మాజీ శాసనసభ్యులు దాసరి మనోహర్ రెడ్డి పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు మరియు గ్రామ సర్పంచ్ ఆహ్వానం మేరకు కార్యక్రమానికి హాజరైన ఆయన స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు దాసరి మనోహర్ రెడ్డి ని శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం నిర్వహించిన కళ్యాణోత్సవంలో భక్తులతో కలిసి పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను, భక్తి భావాన్ని పెంపొందిస్తాయి. శ్రీ వెంకటేశ్వర స్వామివారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకుంటున్నాను. గ్రామాల్లో దేవాలయాల అభివృద్ధికి ప్రజలంతా కలిసి సహకరించడం అభినందనీయం" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఉప్పు లక్ష్మి--తిరుపతి, బోయిని రాజమల్లు, కర్రీ కవిత కుమార్, సందీప్ రావు, మళ్యారం నారాయణ, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, యువకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో పెద్దపల్లి జిల్లా ముందంజలో

- మే 6న మెగా జాబ్ మేళాను నిరుద్యోగ యువత వినియోగించుకోవాలి
- రాష్ట్రంలో అగ్రస్థానంలో పెద్దపల్లి జిల్లా ఆసుపత్రి

**ప్రజావాణి జిల్లా ప్రతినిధి పెద్దపల్లి మే 02:**రైతులు పంట మార్పుపై దృష్టి పెట్టాలి ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు పెద్దపల్లి పట్టణంలోని బందంపల్లి స్వరూప గార్డెన్స్‌లో నిర్వహించిన పెద్దపల్లి నియోజకవర్గ స్థాయి ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు శ్రీ చింతకుంట విజయరమణ రావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష,డీసీపీ రామ్ రెడ్డి తదితర ఉన్నతాధికారులు హాజరయ్యారు. అనంతరం ఓదెల మండలం పోతకపల్లి గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఎమ్మెల్యే అభినందించి సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు పెద్దపల్లి జిల్లాలో సమర్థవంతంగా అమలవుతున్నాయని తెలిపారు. పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రి రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలిచి నాలుగు అవార్డులు సాధించిందని చెప్పారు. ఆసుపత్రిలో ఓపీ సంఖ్య 280 నుండి 900కు, నెలవారీ ప్రసవాల సంఖ్య 40 నుండి 250కు పెరిగిందని వివరించారు. కొత్త ఆసుపత్రి భవనం నిర్మాణం వేగంగా కొనసాగుతోందని, ఎంఆర్ఐ, సీటీ స్కాన్ వంటి ఆధునిక వైద్య సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నట్లు



తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్ని సేవలు ఉచితంగా అందిస్తున్నామని, ప్రైవేట్ ఆసుపత్రుల్లో లక్షలు ఖర్చయ్యే చికిత్సను ఇక్కడ ఉచితంగా అందిస్తున్నామని చెప్పారు. ఇతర ప్రాంతాల ప్రజలు కూడా పెద్దపల్లి ఆసుపత్రిని ఆశ్రయిస్తున్నారని తెలిపారు. నవజాత శిశు సంరక్షణ కేంద్రం, డయాలసిస్, కార్డియాలజీ, 2డి ఎకో వంటి సేవలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. మహిళల సాధికారతకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, వడ్డీ రహిత రుణాలు, స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ధాన్యం కొనుగోలులో ఎలాంటి కోతలు లేకుండా 48 గంటల్లో రైతుల ఖాతాల్లో నేరుగా నగదు జమ చేస్తున్నామని చెప్పారు. రైతులు పంటల మార్పుపై దృష్టి పెట్టాలని, వరి,



మొక్కజొన్నతో పాటు ఇతర పంటలను కూడా సాగు చేయాలని సూచించారు. మార్క్‌ఫెడ్ ద్వారా మక్కజొన్న రైతులకు మద్దతు ధర అందిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ. 500కే గ్యాస్ సిలిండర్, ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్ కార్డులు, సన్న బియ్యం పంపిణీ, రైతు రుణమాఫీ, రైతు భరోసా, సన్న వడ్ల బోనస్ వంటి పథకాలను ప్రభుత్వం ఆర్థిక సవాళ్ల మధ్య కూడా అమలు చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, మార్కెట్ కమిటీ చైర్మన్లు, మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, ఆర్డీవో, ఇతర ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశైలం దేవస్థానంలోని చలివేంద్రాలు ఏర్పాటు



**నంద్యాల జిల్లా శ్రీశైలం మే 2 (ప్రజావాణి):**భక్తుల సౌకార్యార్థం దేవస్థానం పలుచోట్ల చలివేంద్రాలను ఏర్పాటు చేసింది. దేవస్థానశీ వైద్యశాల ఎదురుగా ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఈ రోజు (02.05.2026) కార్యనిర్వహణాధికారి యం. శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్యనిర్వహణాధికారి వారు మాట్లాడుతూ వేసవి తీవ్రత కారణంగా దేవస్థానం ఈ చలివేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ చలివేంద్రాలలో చల్లని మంచినీటితో పాటు మజ్జిగ కూడా భక్తులకు అందజేయడం జరుగుతోందన్నారు. అదేవిధంగా కరివేన సత్రం, ఆర్టీసి బస్టాండు, సిద్ధరామప్ప వాణిజ్య సముదాయం, మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మొదలైన చోట్ల కూడా ఈ చలివేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతోందన్నారు. ఈ చలివేంద్రాలలో శివసేవకుల స్వచ్ఛంద సేవలను వినియోగించుకోడం జరుగుతోందన్నారు. దేవస్థానం సూచనల మేరకు పలు సత్రాల వారు కూడా ఈ చలివేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. భక్తులందరికీ కూడా ఈ చలివేంద్రాలను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమములో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం. నరసింహారెడ్డి, శివ సేవకుల విభాగపు పర్యవేక్షకులు టి. హిమబిందు, అన్నప్రసాద వితరణ విభాగపు పర్యవేక్షకులు పి. దేవిక తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# సెయింట్ ఆంథోనిస్ విద్యానగర్ లో 10వ తరగతి విజేతలకు ఘనంగా సన్మానం





**మన సమగ్ర ప్రజావాణి మే 02 సంగారెడ్డి జిల్లా ప్రతినిధి:**స్థానిక సంగారెడ్డి విద్యానగర్లోని సెయింట్ ఆంథోనీస్ పాఠశాల ఆవరణలో పదవ తరగతి ఫలితాల్లో ఘన విజయం సాధించిన విద్యార్థుల కోసం అభినందన సభ అత్యంత వైభవంగా నిర్వహించారు ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ ఆంథోనీ రెడ్డి మాట్లాడుతూ పట్టుదలతో చదివి పాఠశాల కీర్తి ప్రతిష్టలను పెంచిన విద్యార్థులను, నిరంతరం విద్యార్థుల ను వెన్ను తట్టి ప్రోత్సహించిన ఉపాధ్యాయులను విద్యార్థుల ఎదుగుదలలో తల్లిదండ్రుల సహకారం మరువలేనిదని, వారి ప్రోత్సాహం వల్లే నేడు విద్యార్థులు ఈ స్థాయికి చేరుకున్నారని కొనియాడారు. పదవ తరగతి అనేది ఒక కీలకమైన మలుపు అని, భవిష్యత్తులో కూడా ఇదే ఉత్సాహంతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు మరియు వారి తల్లిదండ్రులకు చైర్మన్ ఆంథోనీ రెడ్డి శాలువాలతో సన్మానం చేసి, జ్ఞాపికలను అందజేశారు. అనంతరం పాఠశాల చైర్మన్ ఆంథోనీ రెడ్డి ని విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు శాలువాలతో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం మరియు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని విద్యార్థుల విజయోత్సవ కార్యక్రమశీ లో పాల్గొన్నారు.

# రైతులకు ప్రతి గింజకు భరోసా -- వడ్ల కొనుగోలు కేంద్రం ప్రారంభం

**ప్రజావాణి జిల్లా ప్రతినిధి పెద్దపల్లి మే 02**పెద్దపల్లి జిల్లా: సబ్బితం గ్రామంలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ఘనంగా ప్రారంభించారు. పెద్దపల్లి శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ విజ్జన్న ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ నూనె సరోజన రమేష్ మాట్లాడుతూ, రైతుల ధాన్యం కొనుగోలు విషయంలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు. గ్రామంలోని ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని భరోసా ఇచ్చారు. ధాన్యం సేకరణలో ఎలాంటి కట్టింగ్‌లు లేకుండా పారదర్శకంగా కొనుగోలు నిర్వహిస్తామని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన చెల్లింపులు వారం రోజుల్లోనే రైతుల ఖాతాల్లో జమ అయ్యేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అలాగే రైతు భరోసా నిధులు కూడా విడతల వారీగా విడుదల అవుతాయని, రైతులు ఆందోళన చెందవద్దని కోరారు. రైస్ మిల్లర్ల నుంచి



ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మహేందర్, పాలకవర్గ సభ్యులు, సొసైటీ బాధ్యులు సతీష్, సెంటర్ ఇన్‌చార్జ్ కిష్టయ్య,



మాజీ సర్పంచ్ సదయ్య, సామాజిక సేవకులు ఊదరి లక్ష్మణ్, పంచాయతీ సెక్రటరీ, ఫీల్డ్ అసిస్టెంట్లు, వీవోఏ లు, గ్రామ పెద్దలు, హమాలీలు, పార్టీ కార్యకర్తలు మరియు గ్రామ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# రైతులకు సాగు మెళకువలపై అవగాహన సదస్సు

- గుల్లకోటలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమం





**జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్, ఎండపల్లి మే 2(ప్రజావాణి):**రైతులు సాగులో ఆధునిక పద్ధతులు అవలంబించి, అధిక దిగుబడులు సాధించే దిశగా ప్రోత్సహించేందుకు జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం గుల్లకోటలోని రైతు వేదికలో శనివారం "రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు" అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పొలాస వ్యవసాయ పరిశోధనా కేంద్రానికి చెందిన సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ స్పందన, శాస్త్రవేత్త సుమలత ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఏ రకమైన విత్తనాలను ఎంపిక చేసుకోవాలి, సాగులో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులు, ఎరువుల వినియోగం వంటి అంశాలపై రైతులకు సమగ్ర అవగాహన కల్పించారు. శాస్త్రీయ పద్ధతులను పాటించడం ద్వారా పెట్టుబడిని తగ్గించుకుంటూ నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని వారు రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వ్యవసాయ శాఖ అధికారులు, పార్టీ నాయకులు పాల్గొని రైతుల సమస్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గొల్లపెల్లి మల్లేష్ గౌడ్, ఎండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తాటిపర్తి శైలేందర్ రెడ్డి, ఏవో మహేష్, ఉపసర్పంచ్ అరిగేల జయవ్వ రవి, చర్లపల్లి సర్పంచ్ పడిదం లావణ్య మొగిలి, ఏఈఓ లావణ్య, వార్డు సభ్యులు పాలకుర్తి తిరుపతి, బిసగోని అంజలి తిరుపతి, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు బిసగోని సత్యం గౌడ్, గొనె సంతోష్, జెల్లెల్ల కనకయ్య, ఇతర గ్రామ రైతులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం

**దమ్మపేట,ప్రజావాణి న్యూస్,మే 2:**అశ్వారావుపేట నియోజకవర్గం దమ్మపేట మండలం పట్వారి గూడెం గ్రామం శ్రీ చెలికాని ఆదెమ్మ ఫంక్షన్ హాల్ సమావేశమందిరం నందు శనివారం జరిగిన ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక సన్నాహక సమావేశానికి ఎమ్మెల్యే జారే ఆదినారాయణ,స్థానిక ప్రజాప్రతినిధులు, నియోజకవర్గ అధికారులతో కలిసి పాల్గొనడం జరిగింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజాప్రభుత్వం ప్రజలకు మరింత మేలైన పాలన అందించాలనే లక్ష్యంతో ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. దానిలో భాగంగా నిర్వహించిన ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక సన్నాహక సమావేశంలో ప్రజాప్రతినిధులకు, అధికారులకు దిశానిర్దేశం చేయడం జరిగింది. 99 రోజుల కార్యక్రమంలో భాగంగా నిర్వహించే ప్రతి కార్యక్రమాలను అధికారులు అంకిత భావంతో పని చేసి విజయవంతం చేయాలి. క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి అధికారులు చిత్తశుద్ధితో



పని చేయాలి. పారిశుధ్యం మరియు ఆరోగ్యం, అరైవ్ అలైవ్ (రోడ్డు భద్రత), సంక్షేమం, పిల్లల రక్షణ మరియు డ్రగ్స్ నిర్మూలన, రైతు సంక్షేమం మరియు వ్యవసాయం, విద్య, యువత మరియు క్రీడలు, మహిళా సాధికారత, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంది. నియోజకవర్గ అభివృద్ధి కోసం చేసే ఈ ప్రణాళికలో అధికార, ప్రతిపక్ష పార్టీలనే భేదం లేకుండా అందరు భాగస్వాములవ్వాలి. ప్రజాప్రతినిధుల



సహకారంతో స్థానికంగా చేయవలసిన అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతిపాదనలను అందజేస్తే, ప్రాధాన్యత ఆధారంగా ప్రభుత్వం నిధులను కేటాయించడానికి సిద్ధంగా ఉంది అని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు,అధికారులు,మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజలు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు

# సందేశాత్మక చిత్రాలు తీయాలి.



**కమాన్ పూర్ మన సమగ్ర ప్రజావాణి ఏప్రిల్ 2.** ప్రజలకు ఉపయోగపడే సందేశాత్మక చిత్రాలను తీయాలి అని కమాన్ పూర్ లైన్స్ క్లబ్ చైర్మన్ సాన రామకృష్ణారెడ్డి అన్నారు. శనివారం కమాన్ పూర్ మండలంలోని జూలపల్లి గ్రామపంచాయతీ పరిధిలో గల ఆదర్శనగర్ సానా గార్డెన్లో' ప్రతిఫలం లఘు చిత్రాన్ని ప్రారంభించారు.తెలంగాణ లైఫ్ సినిమా ఛానల్ లో కుమార్ పటేల్ నిర్మాణ రచన దర్శకత్వంలో నూతన చిత్రం ప్రతిఫలం ప్రారంభోత్సవ పూజా కార్యక్రమాలు సాన రామకృష్ణారెడ్డి గార్డెన్ లో వారి ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సాన రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రజలకు ఉపయోగకరమైన సినిమాలు తీయాలి అని పేర్కొన్నారు.గ్రామీణ ప్రాంతాల్లో కళాకారులను పోషించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాకారులు గజెల్లి రాజలింగు,జబ్బర్ ఖాన్,రమాకాంత్,స్వప్న, రజిత,స్వరూప రాణి, అమర్నాథ్,వెంకటేష్ , తిరుపతి పాల్గొని చిత్ర కళాకారులు పాల్గొన్నారు.

# సీనియర్ జర్నలిస్టుకు సన్మానం.



**కమాన్ పూర్ మన సమగ్ర ప్రజావాణి ఏప్రిల్ 02:**కమాన్ పూర్ మండల సీనియర్ జర్నలిస్ట్ జబ్బార్ ఖాన్ ను పలువురు ఘనంగా సన్మానించారు.ఇటీవల ఆయనకు ఘనంగా సన్మానించి చిత్రపటాన్ని బహుకరించారు.ఇటీవల గోదావరిఖనిలో తార ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు సంకే రాజేష్ ఆధ్వర్యంలో ఉగాది పురస్కారాన్ని అందజేశారు. దీంతో గుండారం గ్రామానికి చెందిన మాజీ ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆయనను శాలువతో సత్కరించి మెమొంటోను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు ఆకుల ఓదెలు, పిడుగు నరసయ్య,గుండారం కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు పిడుగు శంకర్, వార్డు సభ్యుడు దామెర దేవయ్య,కాంగ్రెస్ నాయకులు ముదాం కొమురయ్య ముకుంద శ్రావణ్,వడ్లకొండ శంకరి తదితరులు పాల్గొన్నారు.

# గ్రీన్ ఇండియా ఛాలెంజ్ లో కమాన్ పూర్ అట్లెట్



**కమాన్ పూర్ మన సమగ్ర ప్రజావాణి మే 02:**కమాన్ పూర్ మండల కేంద్రానికి చెందిన ప్రముఖ అథ్లెట్ నల్లవెల్లి ఆనందిని గ్రీన్ చాలెంజ్ లో పాల్గొన్నారు.గ్రీన్ ఇండియా ఛాలెంజ్ లో భాగంగా జూబ్లీహిల్స్ పెద్దపల్లి జిల్లా కమాన్ పూర్ వాస్తవ్యురాలు అథ్లెటిక్స్ గోల్డ్ మెడలిస్ట్,సౌత్ జోన్ జూనియర్ నేషనల్ అథ్లెటిక్స్ ఛాంపియన్ నల్లవెల్లి ఆనంది మొక్కలను నాటారు.ఆనంది మాట్లాడుతూ మొక్కలు నాటే కార్యక్రమం అనేది ఒక గొప్ప కార్యక్రమం అన్నారు. మాలాంటి యంగ్ జనరేషన్ కి మీరు ఇచ్చే పెద్ద ఆస్థి మంచి వాతావరణం అన్నారు.ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలాని కోరడం జరిగింది.క్రీడా రంగంలో రానించాలి అంటే మనసు ఉల్లాసంగా, ప్రశాంతంగా ఉండాలని అలా ఉండాలంటే మంచి వాతావరణం,ప్రకృతి ఉండాలే మనం పని చెయ్యాలి అన్నారు.ఇంతటి గొప్ప కార్యక్రమంలో భాగస్వామ్యం చేసినందుకు మాజీ రాజ్యసభ సభ్యుడు జోగినపల్లి సంతోష్ కుమార్ లకు కృతజ్ఞతలు తెలిపారు.

# ఆకలి తీర్చేందుకే అంబలి కేంద్రం.



**కమాన్ పూర్,మన సమగ్ర ప్రజావాణి మే 02** :ప్రజల ఆకలి తీర్చేందుకే నిత్య అంబలి కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని ఛత్రపతి శివాజీ యువసేన అధ్యక్షుడు మల్యాల శేఖర్ అన్నారు. శనివారం మాజీ ఎంపిటిసి పిల్లి శేఖర్ తమ తల్లిదండ్రులైన దివంగత పిల్లి నరసమ్మ రామయ్యల జ్ఞాపకార్థంగా అంబలిని అందించడం జరిగింది.ఈ సందర్భంగా బ్యాంకు వద్ద ప్రజల సౌకర్యార్థం వేసవిలో పూర్తిగా దాతల సహకారంతో అంబలి కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొన్నారు.చాలామంది దాతలు అంబలి ఏర్పాటు చేయడానికి ముందుకు వస్తున్నారని వారికి ధన్యవాదాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కొమ్ము శ్రీనివాస్,మల్లారపు అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# మిత్రుని కుటుంబానికి పూర్వ విద్యార్థుల ఆర్థిక సహాయం



**చిలుకూరు మే 02(ప్రజావాణి):** నారాయణపురం ప్రభుత్వ పాఠశాలలో 1999-2000వ సంవత్సర పూర్వ విద్యార్థులైన పనస గోవిందు, దేశబోయిన ఉపేందర్,కే,సతీష్ ప్రమాద వశాత్తు మరణించగా వారి తోటి పదవ తరగతి మిత్రులు మానవత్వం చాటుకున్నారు. బాధిత కుటుంబాలకు లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందజేసి అండగా నిలిచారు ఆపదలో ఉన్న స్నేహితుల కుటుంబాలను ఆదుకున్న వారిని గ్రామస్తులు అభినందించారు.

# పెంచలకోన లక్ష్మీనరసింహా స్వామివారికి పట్టువస్త్రాల సమర్పణ



**నంద్యాల జిల్లా శ్రీశైలం మే 2 (ప్రజావాణి)** శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని పెంచలకోన శ్రీ పెనుశిల లక్ష్మీ నరసింహా స్వామి వారి దేవస్థాన వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఈ రోజు (02.05.2026)ఈ దేవస్థానం తరపున శ్రీలక్ష్మీ నరసింహా స్వామి వారికి మరియు ఆదిలక్ష్మీ అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించబడ్డాయి.దేవస్థాన ధర్మకర్తల మండలి అధ్యక్షులు శ్రీ పోతుగుంట రమేష్ నాయుడు, ధర్మకర్తల మండలి సభ్యులు శ్రీమతి ఉప్పుటూరి సుబ్బలక్ష్మీ, ప్రత్యేక ఆహ్వానితులు శ్రీ వేమిరెడ్డి కోటారెడ్డి, శ్రీ ఆకుల శ్రీనివాసులు ఈ పట్టువస్త్రాలను సమర్పించడం జరిగింది. ఈ సమర్పణ కార్యక్రమములో ఆలయ విభాగపు సహాయ కార్యనిర్వహణాధికారి ఎం. హరిదాసు, అర్చక స్వాములు, వేదపండితులు తదితర సిబ్బంది పాల్గొన్నారు.కాగా ఏప్రియల్ 27వ తేదీ నుంచి మే 3వ తేదీవరకు ఆ క్షేత్రంలో బ్రహ్మోత్సవాలు నిర్వహించబడుతున్నాయి.కాగా ప్రతీ సంవత్సరము ఆయా ఉత్సవాల సందర్భంగా కాణిపాకం దేవస్థానం, విజయవాడ ఇంద్రకీలాద్రి, దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానం, కొలనుభారతి సరస్వతీ అమ్మవారికి ఈ దేవస్థానం తరపున పట్టువస్త్రాలు సమర్పించడం జరుగుచున్నది

# సిటీ సెంటర్ హాల్‌లో నిర్వహించిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 90 రోజుల కార్యక్రమంలో పాల్గొన్న

- ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి
- ప్రజా సమస్యలపై అధికారులను నేరుగా ఆదేశించిన
- అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు వెంటనే కేటాయించాలని
- 7 మంది అనాథ పిల్లలకు అనాథ సర్టిఫికెట్లు ఎమ్మెల్యే స్వయంగా అందించారు









**జమ్మికుంట మే 2 ( ప్రజావాణి):**హుజురాబాద్‌లోని సిటీ సెంటర్ హాల్‌లో నిర్వహించిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 90 రోజుల కార్యక్రమంలో పాల్గొని ప్రజా సమస్యలపై అధికారులను నేరుగా ఆదేశించిన ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పేదలకు అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు వెంటనే కేటాయించాలనిఇళ్ల ఎంపికలో ఎమ్మెల్యేను కూడా భాగస్వామ్యం చేయాలని అధికారులకు సూచించారుప్రభుత్వ ఆసుపత్రుల్లో కనీస వసతులు లేకపోవడం, మందుల కొరత తీవ్రంగా ఉండటంపై వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారుమిషన్ భగీరథ అమృత్ పథకం కింద ఉన్న రూ.33 కోట్ల నిధులతో పనులు ఆలస్యం చేయకుండా ఎమ్మెల్యే ప్రతినిధులతో సమన్వయం చేసుకుని వెంటనే ప్రారంభించాలని స్పష్టం చేశారుహుజురాబాద్ క్యాంప్ ఆర్ టి ఓ ఆఫీస్ ఎం జె పి స్కూల్‌లకు నీటి కనెక్షన్ మోరి సదుపాయం లేకపోవడం పై సంబంధిత అధికారులను ఆదేశించారు వీణవంక మండలంలోనిమామిడాలపల్లికోర్కల్, నాగంపేట్.బూజునూర్ రోడ్ల మరమ్మతులు తక్షణమే ప్రారంభించాలనిసూచించారుకమలాపూర్ బస్టాండ్ మిగిలిన పనులను వెంటనే పూర్తి చేయాలని అధికారులను హెచ్చరించారు ఇల్లంతకుంటలో మక్కల కొనుగోలు సెంటర్లు వెంటనే ప్రారంభించి రైతులను ఎలాంటి ఇబ్బందులకు గురి చేయకుండా చూడాలని అధికారులను స్పష్టంగా ఆదేశించారుఇల్లంతకుంటలో నిన్న ప్రారంభించిన రేణుక ఎల్లమ్మ దేవాలయం వద్ద శిలాఫలకం ఏర్పాటు చేయాలని దేవాదాయ శాఖఅధికారులకుసూచించార ుజమ్మికుంట హుజురాబాద్ మున్సిపాలిటీలకు మంజూరైన నిధులతో అభివృద్ధి పనులు ఆలస్యం చేయకుండా ప్రారంభించాలని స్పష్టం చేశారు కెసిఆర్ కిట్టు పథకాన్ని మళ్లీ ప్రారంభించాలని లేకుంటే పేరు మార్చి అయినా అమలు చేయాలనిసూచించారు హుజురాబాద్‌లో ప్రతిపాదిత డంపింగ్ యార్డ్‌ను రద్దు చేయాలని అధికారులకుతెలియజేశారునేతన్న భద్రత పథకం కింద 5 కుటుంబాలకు ఒక్కొక్కరికి ?5 లక్షల చొప్పున మొత్తం ?25 లక్షలు అందజేశారుఆర్థిక పునరావాస పథకం కింద 2 కుటుంబాలకు ఒక్కొక్కరికి ?75 వేల చొప్పున మొత్తం ?1.50 లక్షలు అందజేశారు 7 మంది అనాథ పిల్లలకు అనాథ సర్టిఫికెట్లు ఎమ్మెల్యే స్వయంగా అందించారు ఇదే సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీలు వెంటనే అమలు చేయాలని అధికారులను కోరుతూ వివరించారుమహాలక్ష్మి పథకం మహిళలకు నెలకు ?2500, గ్యాస్ సిలిండర్ ?500కిరైతు భరోసా రైతులకు సంవత్సరానికి ?15,000, వ్యవసాయ కూలీలకు ?12,000 సహాయంగృహ జ్యోతి ప్రతి కుటుంబానికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ఇందిరమ్మ ఇల్లు పేదలకు గృహ నిర్మాణానికి ?5 లక్షల వరకు సహాయంయువ వికాసం నిరుద్యోగ యువతకు నెలకు ?4,000 భృతిచేయూత పింఛన్లు వృద్ధులు వికలాంగులకు ?4,000 వరకు పెన్షన్ ఇవ్వాలని పేర్కొన్నారుప్రజలకు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలి ఆలస్యం అసలు సహించంఅని ఎమ్మెల్యే అధికారులను హెచ్చరించారుకార్యక్రమంలో భాగంగా పలు సంక్షేమ చర్యలు కూడా చేపట్టారుప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తూ ప్రతి సమస్యకు తక్షణ పరిష్కారం చూపించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారుఈ కార్యక్రమంలో ఆర్ డి ఓ ఎంపీడీవో లు ఇతర ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు సర్పంచ్‌లు పాల్గొన్నారు

# చెరువుల నుండి మట్టి రవాణాపై కట్టుదిట్టమైన నియంత్రణలు

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష.
- మూడు చెరువులకు మాత్రమే అనుమతులు.
- మార్గదర్శకాలకు అనుగుణంగా ఎన్ఓసీలు.
- ప్రతి వాహనానికి ఫోటోగ్రఫీ, రసీదు తప్పనిసరి.
- అధిక లోడుతో రవాణా నిషేధం.
- అక్రమ తవ్వకాలపై కఠిన చర్యలు.
- మానేరువాగు పరిధిలో ఇసుక తవ్వకాలకు అనుమతి లేదు.





**పెద్దపల్లి,మన సమగ్ర ప్రజావాణి మే 02:**జిల్లాలో ఇటుక బట్టీలకు చెరువుల నుండి మట్టి గ్రావెల్ రవాణాపై కట్టుదిట్టమైన నియంత్రణలతో చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు.జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ.. నీటి మట్టం తక్కువగా ఉన్న చెరువుల నుండి మట్టి తవ్వకాలకు గత సంవత్సరం సెస్ వసూలు చేసి ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు అనుమతులు ఇచ్చినట్లు తెలిపారు.ఇదే విధానాన్ని ఈ సంవత్సరం కూడా కొనసాగిస్తామని పేర్కొన్నారు.ప్రస్తుతం కొదురుపాక చెరువు, రాయకుంట చెరువు, ముత్తారం చెరువుల నుండి మట్టి రవాణా కోసం 15 ఇటుక బట్టీలు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. ప్రారంభ దశలో ఈ మూడు చెరువులకు మాత్రమే అనుమతులు ఇస్తామని స్పష్టం చేశారు.నీరు లేని చెరువులను మాత్రమే మట్టి తవ్వకాలకు పరిగణనలోకి తీసుకుని,సాగునీటి శాఖ అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి మార్గదర్శకాలకు అనుగుణంగా ఎన్ఓసీలు మంజూరు చేయాలని ఆదేశించారు.మట్టి రవాణాపై కట్టుదిట్టమైన పర్యవేక్షణ ఉండాలని కలెక్టర్ సూచించారు.ప్రతి వాహన రవాణాను ఫోటోగ్రఫీ చేయాలని,ప్రతి వాహనానికి రసీదు జారీ చేయాలని తెలిపారు.వాహనాలు అధిక లోడుతో రవాణా చేయకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఎట్టి పరిస్థితుల్లోనూ అక్రమ మట్టి, ఇసుక తవ్వకాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.
మానేరువాగు పరిధిలో పెద్దపల్లి వైపు ఎలాంటి ఇసుక తవ్వకాలకు అనుమతులు లేవని,కరీంనగర్ వైపు జరుగుతున్న తవ్వకాల నేపథ్యంలో అక్కడి జేసీబీలు పెద్దపల్లి వైపు రాకుండా కఠినంగా హెచ్చరించాలని తెలిపారు.నిబంధనలు ఉల్లంఘిస్తే జేసీబీలను స్వాధీనం చేసుకోవాలని ఆదేశించారు.ఈ అంశంపై జేసీబీ యజమానులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వాలని అధికారులకు సూచించారు.ఈ సమావేశంలో గనుల శాఖ అధికారి శ్రీనివాస్,ఆర్డీఓలు సురేష్,బి.గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ కోఆప్షన్ ఎన్నిక తాత్కాలికంగా వాయిదా

- పారదర్శకతతో ఎన్నిక నిర్వహణ
- హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తోపాటు సీనియర్ నాయకులతో చర్చించి
- మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్





**జమ్మికుంట మే 2 (ప్రజావాణి):**జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలో శనివారం నిర్వహించవలసిన కోఆప్షన్ ఎన్నికను తాత్కాలికంగా వాయిదా వేసినట్లు మున్సిపల్ చైర్మన్ మెలుగు ప్రశాంత్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ నుండి కో ఆప్షన్ పోటీకి వచ్చిన అభ్యర్థుల సంఖ్య ఎక్కువగా ఉండటం వల్ల ప్రజాసేవ పట్ల నిబద్ధత కలిగి ఉండడంతో పాటు వారి అనుభవాన్ని పరిగణలోనికి తీసుకొని సామాజిక సమతుల్యత పాటించవలసిన అవసరం ఉందన్నారు. అన్ని వర్గాల వారికి సముచిత స్థానం కల్పించే విధంగా విధంగా ఉండాలని ఈ నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. బిఆర్ఎస్ పార్టీ నుండి 19 మంది అభ్యర్థులు ఉండడం వల్ల ఎన్నిక ప్రక్రియలో కీలకమైన ఎ పిక్ ధ్రువీకరణను సక్రమంగా పారదర్శకంగా నిర్వహించడం కోసం సమయం తీసుకోవాల్సి వచ్చింది అన్నారు. ఎన్నిక ప్రక్రియ లో ఎలాంటి సందేహాలకు తావివ్వకుండా ముందుకు వెళ్తామని పేర్కొన్నారు. హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తోపాటు సీనియర్ నాయకులతో చర్చించి వారి సలహాలు సూచనలు తీసుకొని తుది నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. స్థానికంగా పార్టీని బలోపేతం చేయడంతో పాటు ప్రజలకు పాలకవర్గం మీద ఉన్న విశ్వాసాన్ని నిలబెట్టుకోవడం ప్రధాన లక్ష్యమన్నారు. పూర్తిస్థాయిలో పరిశీలన చేసి కో ఆప్షన్ ఎన్నికను పారదర్శకతతో నిర్వహిస్తామని చైర్మన్ ప్రశాంత్ కుమార్ తెలిపారు

# బచ్చోడు నేటి ప్రజా దర్బార్ విజయవంతం చేయండి

- మండల కాంగ్రెస్ నాయకులు కట్కూరి శ్రీనివాస్ రెడ్డి




**తిరుమలాయపాలెం,ప్రజావాణి,మే 2.:**ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించే లక్ష్యంతో రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల కాంగ్రెస్ నాయకులు కట్కూరి శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు. ప్రజల వద్దకే ప్రభుత్వ యంత్రాంగాన్ని తీసుకెళ్లి, వారి సమస్యలను అదే వేదికపై పరిష్కరించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలు సంవత్సరాలుగా పరిష్కారం కాని స్థితిలో ఉన్నాయని, అలాంటి సమస్యలకు త్వరితగతిన పరిష్కారం అందించేందుకు ప్రజా దర్బార్ వేదికగా మారుతుందని తెలిపారు. ప్రభుత్వ అధికారులు, సంబంధిత శాఖల ప్రతినిధులు ప్రత్యక్షంగా హాజరై ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి, వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని వివరించారు.తిరుమలయపాలెం మండలంలోని బచ్చోడు, బచ్చోడు తండా, బీరోలు, ఏలు వారి గూడెం, పైనం పెల్లి, రాజారం, సోలిపురం, మంగలి బండ తండా, జూపెడ, కాకరవాయి, సుద్ద వాగు తండా, ఏనెకుంట తండా గ్రామాలకు చెందిన ప్రజలు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన కోరారు. తమ గ్రామాలకు సంబంధించిన సమస్యలను సమగ్రంగా రాసిన దరఖాస్తులతో హాజరైతే అధికారుల ముందే వాటిని పరిశీలించి తగిన నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంటుందని చెప్పారు.భూ సమస్యలు, పత్తా పాస్‌బుక్స్, రికార్డుల సవరణ, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, కొత్త రేషన్ కార్డుల మంజూరు, పింఛన్ల మంజూరు, అర్హుల జాబితాలో పేర్లు చేర్చడం, వివిధ సంక్షేమ పథకాల లబ్ధి వంటి అంశాలపై ప్రజలు తమ వినతిపత్రాలను సమర్పించవచ్చని తెలిపారు. దీని ద్వారా ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం తగ్గి, ఒకే వేదికపై పరిష్కారం పొందే అవకాశాన్ని ప్రభుత్వం కల్పిస్తోందని ఆయన అన్నారు.ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, తమ సమస్యలను నిర్భయంగా అధికారుల దృష్టికి తీసుకురావాలని, ప్రతి ఒక్కరూ నేడు బచ్చోడు గ్రామంలో నిర్వహించే ప్రజా దర్బార్ కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని కట్కూరి శ్రీనివాస్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వంపై ప్రజల విశ్వాసాన్ని పెంపొందించే ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి గ్రామస్థులు, ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు అందరూ కలిసి సహకరించాలని ఆయన కోరారు.


# బీపీఎల్ కుటుంబానికే ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం గృహం మంజూరు

- హౌసింగ్ పీడీ శ్రీనివాస్
- పాలేరులో మంజూరైన ఇందిరమ్మ ఇంటిపై జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణ

**ఖమ్మం బ్యూరో ప్రతినిధి మన ప్రజావాణి :**బీపీఎల్ కుటుంబానికే ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం గృహం మంజూరు చేసినట్లు, అసత్య ప్రచారాలను నమ్మవద్దనీ హౌసింగ్ పీడీ శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.పాలేరు గ్రామ పంచాయతీ పరిధిలో ఏప్రిల్ 29న నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో ఇందిరమ్మ లబ్ధిదారు నీలమ్మ మాట్లాడిన అంశంపై వివిధ మాధ్యమాలలో వస్తున్న ప్రచారాలపై లబ్ధిదారుని అర్హతపై జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు సమగ్ర విచారణ నిర్వహించారని ఈ మేరకు కూసుమంచి మండల అభివృద్ధి అధికారి టి. జశ్వంత్ కుమార్ పంచాయతీ కార్యదర్శి, హౌసింగ్ ఏఈలతో కలిసి సంబంధిత లబ్ధిదారు పిల్లి నీలమ్మ ఇంటిని ప్రత్యక్షంగా సందర్శించి అర్హతలను పరిశీలించి జిల్లా కలెక్టర్ కు నివేదిక సమర్పించినట్లు తెలిపారు.విచారణలో లబ్ధిదారు కుటుంబం బీపీఎల్ వర్గానికి చెందినదిగా నిర్ధారించబడింది అని, వారి కుటుంబానికి ప్రస్తుతం ఎటువంటి భూమి యాజమాన్యం లేదని తేలిందన్నారు. ఫీల్డ్ విజిట్ సమయంలో గమనించిన నివాస గృహం గతంలో పాడు బడిన స్థితిలో ఉన్నట్లు గుర్తించారు. ఇందిరమ్మ కమిటీతో పాటు సంబంధిత అధికారుల సిఫార్సుల మేరకు గృహం మంజూరు చేపట్టినట్లు, కుటుంబ నేపథ్యం పరిశీలించగా, పిల్లి మల్లయ్య వృత్తిరీత్యా మత్స్యకారుడు కాగా, నీలమ్మ దినసరి కూలి కార్మికురాలిగా జీవనం సాగిస్తున్నారని తెలిసింది.గతంలో జీవనోపాధి అవసరాల కోసం కొంత భూమిని విక్రయించినట్లు, అలాగే ఒక సంతానాన్ని విదేశాలకు పంపేందుకు కొంత మొత్తం రుణం తీసుకున్నట్లు విచారణలో వెల్లడైందని కుటుంబంలోని కుమార్తె ఇంజినీరింగ్ పూర్తి చేసినప్పటికీ ప్రభుత్వ ఉద్యోగంలో లేరని తెలిపారు.పై అంశాలన్నింటిని సమగ్రంగా పరిశీలించిన అనంతరం, గృహ మంజూరు పూర్తిగా ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారమే జరిగిందని, అర్హత లేని వారికి ఇళ్లు మంజూరు చేశారనే ఆరోపణలు అసత్యమని హౌసింగ్ పీడీ స్పష్టం చేశారు.ఇంకా, కుటుంబంలోని కుమారుడు ఉన్నత విద్య కోసం లండన్‌కు వెళ్లిన సందర్భంలో, మొత్తం 16,560 పౌండ్ల ట్యూషన్ ఫీజులో 16,000 పౌండ్లు




యూనివర్సిటీ ఆఫ్ సాల్ఫోర్డ్ మాంచెస్టర్ నుండి గ్లోబల్ గోల్డ్ ఎక్సెన్స్ స్కాలర్‌షిప్ రూపంలో లభించినట్లు విచారణలో వెల్లడైందన్నారు. ఇది విద్యార్థి ప్రతిభను ప్రతిబింబించే అంశమని హౌసింగ్ పీడీ పేర్కొన్నారు.విచారణ సందర్భంగా పిల్లి నీలమ్మ మాట్లాడుతూ తాను మొదటిసారి వేదికపై మాట్లాడడంతో పొరపాటు పడ్డానని తెలిపారు. తమ కుమారుడు లిఇందిరమ్మ ఇల్లు మంజూరు అయిన తర్వాతే లండన్‌కు వెళ్లారని, కుమారుడిని విదేశాలకు పంపేందుకు రుణం, తమ అత్త మామలకు సంబంధించిన సుమారు 1.25 గుంటల భూమిని అమ్మి బంధువులు డబ్బులు సమకూర్చారని వివరించారు.తమ కుమార్తె ఇంజినీరింగ్( ఈ ఈ ఈ)పూర్తి చేసి ప్రైవేట్ రంగంలో పని చేస్తోందని, ప్రభుత్వ ఉద్యోగంలో లేదని స్పష్టం చేశారు. తమ కుటుంబం ఎన్నో కష్టాలు అనుభవించిందని, కొన్నిసార్లు ఆహారం కూడా లేక ఇబ్బందులు పడ్డామని, భర్త మత్స్యకారుడిగా పనిచేస్తుండగా తాను కూలి పనులు చేసి పిల్లలను చదివించామని, ఎవరినీ మోసం చేయలేదని, దయచేసి తమపై తప్పుడు







ప్రచారం చేయవద్దని ఆమె కోరారు.ఈ విషయంపై అసత్య ప్రచారాలను నమ్మవద్దని హౌసింగ్ పీడీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం అర్హులైన లబ్ధిదారులకు పారదర్శకంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు.

# అందరికీ నాణ్యమైన ఉచిత విద్య సమగ్ర వైద్యం అందించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యం మంత్రి దామోదర రాజనరసింహ

**మన సమగ్ర ప్రజావాణి మే 02 సంగారెడ్డి జిల్లా ప్రతినిధి:**ప్రజా పాలన – – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఆందోల్ నియోజకవర్గ స్థాయి సమావేశం శనివారం జోగిపేటలోని శ్రీరామ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతి పౌరుడికి నాణ్యమైన విద్యతో పాటు సమగ్ర వైద్య సేవలను అందించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజలు ఆరోగ్య సమస్యల వల్ల ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోకుండా ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్ని వైద్య సేవలను ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. జిల్లా స్థాయిలోనే 90 శాతం వైద్య సేవలు అందించే దిశగా ఆధునిక సదుపాయాలను విస్తరిస్తున్నామని చెప్పారు. అత్యవసర పరిస్థితుల్లో వేగవంతమైన సేవలందించేందుకు ట్రామా, ఎమర్జెన్సీ సేవలను మరింత బలోపేతం చేస్తున్నామని, అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందించేలా చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు.మహిళల సాధికారతకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి పేర్కొన్నారు. మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసే దిశగా గతంలో పావలా వడ్డీ పథకం, అనంతరం వడ్డీ లేని రుణాల పథకాలను అమలు చేసినట్లు గుర్తుచేశారు. ప్రస్తుతం ఇందిరమ్మ క్యాంటీన్లు, సోలార్ యూనిట్లు, పెట్రోల్ బంకులు వంటి వనరులను మహిళలకు కేటాయిస్తూ వారి ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం



తోడ్పడుతున్నదన్నారు.విద్యారంగ అభివృద్ధిలో భాగంగా ప్రతి పాఠశాల, కళాశాలలో ప్రమాణాలతో కూడిన విద్యతో పాటు పౌష్టికాహారం, మౌలిక వసతులను అందిస్తున్నామని తెలిపారు. అందోల్ ప్రాంతంలో త్వరలో ఫార్మసీ కళాశాల ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు.అందోల్ నియోజకవర్గాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా అభివృద్ధి చేసేందుకు సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని తెలిపారు.రూ. 200 కోట్ల వ్యయంతో సింగూర్ లైన్ పనులు చేపట్టామని మంత్రి తెలిపారు. సింగూర్ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నామని, పర్యాటక రంగ అభివృద్ధి ద్వారా స్థానికులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు.జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ జిల్లా విద్య,



వైద్య రంగాల్లో అన్ని విధాలుగా అభివృద్ధి సాధిస్తున్నదని తెలిపారు. మహిళలు, విద్యార్థులు, అంగన్వాడీ పిల్లలకు ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను వివరించారు. ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. జిల్లా ఎస్పీ పరతోష్ పంకజ్ మాట్లాడుతూ ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళికలో భాగంగా పోలీస్ శాఖ ద్వారా రోడ్డు భద్రత, సైబర్ క్రైమ్, మహిళల భద్రతపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ పాండు, స్థానిక ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, వివిధ శాఖల అధికారులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చెంచు గిరిజన కుటుంబాల్ని ఆదుకోవాలి వారి హక్కులను కాపాడాలి చెంచు గిరిజనుల ఆందోళన

**నంద్యాల జిల్లా శ్రీశైలం ప్రాజెక్టు మే2 ( ప్రజావాణి )** మార్కాపురం జిల్లా దోర్నాల మండలం నక్కంటి రేంజి పరిధిలో ఇష్టకామేశ్వరి దేవాలయం దగ్గర 32 కుటుంబాలు దాదాపు 5000 సంవత్సరాల క్రితం నుండి నివాసం ఉంటున్నారని వారి చెంచు గిరిజన్ల హక్కులను కాపాడాలని ఇష్టకామేశ్వరి దేవాలయం గుడిని మాకు ప్రాధాన్యత కల్పించాలని అడవిలో ఉన్న మాకు మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని చెంచు గిరిజనులు ఆందోళన చేశారు చేసిన ఇష్టకామేశ్వరి చెంచు గిరిజనులు వారికి మద్దతు తెలియజేసిన కొమరం భీం ఆదివాసి చెంచు గిరిజన సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు వై ఆశీర్వాదం వారు మాట్లాడుతూ జంగల్ రైడ్ అనే పేరుని ఇష్టకామేశ్వరి అమ్మవారి దర్శనం అని మార్చాలి. టికెట్స్ ఇచ్చే కౌంటర్లో చెంచువారికే ఉద్యోగ కల్పన ఇవ్వాలని కోరారు . చెంచులకి అమ్మవారి దర్శనం కొరకు ఎటువంటి నియమ నిబంధన లేకుండా అనుమతులు పూర్తిస్థాయిలో కల్పించాలి. అటవీ హక్కుల నిబంధనల ప్రకారం అడవిలో జరిగేటువంటి



అభివృద్ధి పనులు అన్నిటిని EDC ప్రెసిడెంట్ పేరు మీదనే జరగాలి.అడవి నిబంధనల ప్రకారం చట్టం ఏదైతే ఉందో గూడెంలో కొన్ని ఏళ్ల తరబడి నివాస ఉంటున్న వారికి ప్రాథమిక నిబంధనల ప్రకారం అటవీ హక్కుల చట్టం కింద వాళ్ళ నివాసం ఉంటున్న చోటనే ఇల్లు నిర్మించుకునేందుకు మరియు ఏళ్ల పట్టాలు ఇవ్వాలని కోరారు కనీసం మామిడికాయ వసతిలో భాగంగా మంచినీరు రైతు సదుపాయాన్ని కరెంటు సదుపాయాన్ని కల్పించాలి అని కోరారు. అమ్మవారి గుడి అభివృద్ధి చేసుకునేందుకు అనుమతులు ఇవ్వాలి.టైగర్ ట్రాకర్ ప్రొటెక్షన్ వాచర్స్ గా పనిచేసే చెంచు గిరిజనులకు పని భద్రత కల్పించాలి, అనారోగ్య సమస్యలకు వచ్చినప్పుడు అదనంగా ఇంకో నాలుగు రోజులు సెలవులు ప్రకటించాలి. కాలంలో జీతాలు చెల్లించాలి ఇష్టకామేశ్వరి గేటు నుంచి అడవి గుండా వెళ్లే నొక్కండి పాలుట్ల గుట్టలుచేను పన్నల బయలు నాడి తడకల పెద్దమ్మ శాంతినగర్ గోడలకు వెళ్లే వాళ్లకి ఎటువంటి ఆంక్షలు లేకుండా అడవిలోకి అనుమతించాలని గిరిజనులు కోరుతున్నారు.ఈ సమస్యలన్నిటిని పరిష్కరించాలని ఇష్టకామేశ్వరి అమ్మవారి దగ్గర నివసించే చెంచు గిరిజనులు ఇష్టకామేశ్వరి గేట్ దగ్గర చెంచు గిరిజనులు ధర్నా చేయడం జరిగింది. ఈ ధర్న లో జుణజ ప్రెసిడెంట్ చెవుల పోతయ్య, వైస్ ప్రెసిడెంట్ చిన్నోడు బసవయ్య చెవుల నాగయ్య. వీరమ్మ లక్ష్మీదేవి మల్లికార్జున వీరన్న. నాగమ్మ. చెంచు గిరిజన మహిళలు యువకులు తదితరులు పాల్గొన్నారు

# విద్యార్థుల కృషి అభినందనీయం.

- కన్నాల సర్పంచ్ గుడిసె గట్టయ్య యాదవ్.



**కన్నాల. మన ప్రజావాణి.** మంథని మండలం కన్నాల గ్రామ హై స్కూల్ విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించడం పట్ల గ్రామ సర్పంచ్ గుడిసె ఘట్టయ్య విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులను అభినందించారు రెండు సంవత్సరాల నుండి 100% ఉత్తీర్ణత సాధిస్తున్నందుకు పాఠశాల ఉపాధ్యాయులు చేస్తున్న కృషి చాలా గొప్పది అన్నారు ఈ సంవత్సరం మంతిని మండలంలో జిల్లా పరిషత్ పాఠశాలలో రెండో టాపర్గా నిలిచి 545 మార్కులు సాధించి కన్నాల జెడ్పిహెచ్ఎస్ మొదటి స్థానంలో నిలిచిన తస్మిరాను తల్లిదండ్రుల సమక్షంలో శాలువాతో ఘనంగా సన్మానించారు అలాగే శ్రీ వన్ రామ్ చరణ్ అభిరుదు వర్షిత్ అంజలి అలీషా తదితరులు 500 పైన మార్పులు సాధించడం పట్ల వారిని ప్రత్యేకంగా అభినందించారు ఈ కార్యక్రమంలో ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు కానుగంటి శ్రీనివాస్ వార్డ్ మెంబర్ కీర్తన విద్యార్థులు పేరెంట్స్ పాల్గొన్నారు

# నూతనంగా బాధ్యతలు స్వీకరించిన రూరల్ సీఐ పులి వెంకట్ కీ ఘన సన్మానం

- దేవస్థానం చైర్మెన్ ఇంగిలే రామారావు
- మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానం చేసి రాములవారి ముత్యాల తలంబ్రాలు అందజేసి స్వామి వారి మేమేంటోను బహుకరించడం జరిగింది





**జమ్మికుంట మే 2( ప్రజావాణి):**జమ్మికుంట రూరల్ పోలీస్ స్టేషన్ లో హుజురాబాద్ పోలీస్ స్టేషన్ నుండి బదిలీ పై జమ్మికుంట కు వచ్చి నూతనంగా బాధ్యతలు స్వీకరించిన పులి వెంకట్ ని శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం చైర్మెన్ ఇంగిలే రామారావు మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానం చేసి రాములవారి ముత్యాల తలంబ్రాలు అందజేసి స్వామి వారి మేమేంటోను బహుకరించడం జరిగిందిఈ సందర్భంగా రామారావు సిఐ ని దేవస్థానంకు రావాల్సింది గా ఆహ్వానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు పరమేష్, కిరణ్, గోపాల్ రెడ్డి ఫిషర్మెన్ రాష్ట్ర కార్యదర్శి రాకేష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సలీం,యూత్ కాంగ్రెస్ నాయకులు కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# బూరా నర్మదకి అభినందించిన అరోరా పీజీ కాలేజ్ యాజమాన్యం



**చిలుకూరు మే02(ప్రజావాణి):** నారాయణ పురం (పాలే అన్నారం) గ్రామానికి చెందిన బూరా నర్మద తండ్రి బూరా ఆంజనేయులు అరోరా పీజీ కాలేజ్ ఉప్పల్ పిర్జాదిగూడ ప్రాంతానికి చెందిన ప్రముఖ విద్యాసంస్థలో అధ్యాపకురాలిగా పనిచేస్తు ఇటీవల పీ.హెచ్.డీ విజయవంతంగా పూర్తి చేశారు.విరు ఐ సి ఈ(హిమాచల్‌ప్రదేశ్) విశ్వవిద్యాలయం నుండి " గ్రీన్ ఫైనాన్స్ అగ్రికల్చర్ సెక్టార్ అనే అంశంపై పరిశోధన చేసి ఈ ప్రతిష్టాత్మక డిగ్రీని పొందడం విశేషం.ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ తునికి వెంకట్ రామ్ రాజ్ , అధ్యాపకులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తూ బూర నర్మదని హృదయపూర్వక అభినందనలు తెలిపారు.నర్మద గారి ఈ విశిష్ట సాధన కళాశాలకు గర్వకారణమని, వారి మార్గదర్శకత్వంలో విద్యార్థులు మరింత ఉన్నత స్థాయికి ఎదుగుతారని డైరెక్టర్ తెలిపారు.ఈ విజయంతో కళాశాల ప్రతిష్ట మరింత పెరిగిందని, భవిష్యత్తులో కూడా ఇలాంటి విజయాలు కొనసాగాలని అందరూ ఆకాంక్షించారు.బూర నర్మద విద్యా ప్రస్థానం మరింత శిఖరాలకు చేరాలని అందరూ కోరుకుంటూ శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఇందిరమ్మ ఇల్లుకు శ్రీకారం చుట్టిన చిల్లపల్లి సర్పంచ్.

- గోపు సంతోష్ కుమార్.



**చిలపల్లి. మన ప్రజావాణి.** మంథని మండలం చి ల్లపల్లి గ్రామంలో సర్పంచ్ గోపు సంతోష్ కుమార్ ఈరోజు ఇందిరమ్మ పథకం కింద మంజూరైన అక్కపాక నిర్మల గారి ఇంటి స్థలంలో ఈరోజు పనులకు శ్రీకారం చుట్టినారు సర్పంచ్ గారు స్వయానా తవ్వి పనులు ప్రారంభించారు మిగతా లబ్ధిదారులకు తొందరగా ఇల్లు నిర్మాణం పూర్తయ్యాలా చర్యలు తీసుకుంటామని సర్పంచి గారు తెలిపారు ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి గృహ సౌకర్యం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు కంచు మల్లేష్ గ్రామస్తులు పాల్గొని పనుల ప్రారంభాన్ని అభినందించారు. ఇంటి లబ్ధిదారులు మాట్లాడుతూ మా ఇల్లు పాతబడింది కూలిపోయేలా ఉంది ఈరోజు ఇందిరమ్మ ఇల్లు మంజూరు అయినందుకు మేము చాలా ఆనందం వ్యక్తం చేస్తున్నాము ఎన్నో సంవత్సరాలనుండి మేము కాంగ్రెస్ కార్యకర్తగా పనిచేస్తున్నామని మా పేదరికం గుర్తించి మాకు ఇల్లు మంజూరు చేసినందుకు ఐటి శాఖ మంత్రి శ్రీధర్ బాబుకు రుణపడి ఉంటామని అక్కపాక నిర్మలమోహన్ అన్నారు

# సొంతింటి కలను నెరవేరుస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం..

- ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి



**ప్రజా వాణి,వికారాబాద్ జిల్లా,మే 02:**పరిగి మునిసిపాలిటీ పరిధిలోని నస్కల్ గ్రామంలో మొగిలిగిద్ద అంజయ్య నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమానికి పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి స్థానిక నాయకులతో కలిసి హాజరయ్యారు.ఈ సందర్భంగా లబ్ధిదారులు మొగిలిగిద్ద అంజయ్య తమ సొంతింటి కలను సాకారం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి,ఎమ్మెల్యే రామ్మోహన్ కి కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా ఇళ్లు లేని నిరుపేదల కలలు నిజమవుతాయని అన్నారు.ప్రజా ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఇళ్లు లేని కుటుంబాలకు సురక్షితమైన,గౌరవప్రదమైన ఇందిరమ్మ ఇళ్లను అందించడానికి కట్టుబడి ఉందని తెలిపారు.

# వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి..

**ప్రజా వాణి,వికారాబాద్ జిల్లా పరిగి,మే 02:** మునిసిపాలిటీ పరిధిలోని సుల్తాన్పూర్‌లో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల వరి కొనుగోలు విషయంలో ప్రభుత్వం ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తూ,ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు ప్రక్రియ కొనసాగించేలా చర్యలు తీసుకుంటోందని తెలిపారు.రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా తమ వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకోవచ్చని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రైతులకు మద్దతు ధర కల్పించడంతో పాటు కొనుగోలు ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని అన్నారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.



ఆదివారం, మే 03, 2026
ప్రజావాణి తెలుగు డైలీ



# కొండాపూర్‌లో జనగణన-2027 శిక్షణ ప్రారంభం.

● అధికారుల దిశానిర్దేశంతో మూడు రోజుల కార్యక్రమం ప్రారంభం.






**కొండాపూర్ మే 02 (ప్రజావాణి):** కొండాపూర్ మండలంలో నిర్వహించనున్న జనగణన-2027 కార్యక్రమానికి సంబంధించి సూపర్వైజర్లు, ఎన్యూమరేటర్లకు రెండో విడతగా మూడు రోజుల శిక్షణా కార్యక్రమం శనివారం ఘనంగా ప్రారంభమైంది. ఈ శిక్షణ కార్యక్రమం స్థానికంగా ఉన్న "సంయుక్త ఇంటర్నేషనల్ స్కూల్"లో జరుగుతోంది. ఈ శిక్షణ ప్రారంభ సమావేశానికి కొండాపూర్ తహశీల్దార్ మరియు ఛార్జ్ ఆఫీసర్ అశోక్, మండల విద్యాధికారి దశరథ్, అసోసియేషన్ ప్రతినిధి లావణ్య, ఫీల్డ్ ట్రైనర్లు ప్రవీణ్ కుమార్, ఎం. రవీందర్, కంప్యూటర్ ఆపరేటర్లు, సూపర్వైజర్లు మరియు ఎన్యూమరేటర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా తహశీల్దార్ అశోక్ మాట్లాడుతూ, శిక్షణలో అందిస్తున్న ప్రతి అంశాన్ని పూర్తిగా అర్థం చేసుకొని, తమకు ఉన్న సందేహాలను వెంటనే నివృత్తి చేసుకోవాలని సూచించారు. క్షేత్ర స్థాయిలో జనగణన నిర్వహణలో ఏ ఒక్క ఇల్లు కూడా మిస్ కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ప్రతి సూపర్వైజర్, ఎన్యూమరేటర్ తప్పనిసరిగా జనాభా లెక్కల స్వీయ గణన పూర్తి చేయాలని స్పష్టం చేశారు. మూడు రోజుల శిక్షణ అనంతరం ఫీల్డ్ స్థాయిలో ఖచ్చితమైన సమాచార సేకరణ జరిపి, కొండాపూర్ మండలంలో జనగణన-2027 కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని అధికారులు ఆకాంక్షించారు. ఈ శిక్షణ కార్యక్రమం ద్వారా సిబ్బంది సామర్థ్యం పెంపొందించి, పారదర్శకంగా మరియు సమగ్రంగా జనగణన నిర్వహణకు దోహదపడనుంది.

# ఎస్సీ కార్పొరేషన్ రుణాల ఎంపికకు మే 6న ధ్రువపత్రాల పరిశీలన

**ప్రజావాణి//గోదావరిఖని :** రామగుండం మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ఈ నెల 6వ తేదీ ఉదయం 11 గంటలకు రామగుండం మునిసిపల్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు కమిషనర్ తెలిపారు. దరఖాస్తుదారులు రేషన్ కార్డు, ఆధార్ కార్డు, ఆదాయ ధ్రువీకరణ పత్రం, కుల ధ్రువీకరణ పత్రం, నివాస ధ్రువీకరణ పత్రం, పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు, విద్యార్హత పత్రాలు, బ్యాంక్ పాస్‌బుక్ ఒరిజినల్స్‌తో హాజరుకావాలని సూచించారు .99 రోస్టర్ ప్రాతిపదికన అర్హుల ఎంపిక ప్రక్రియ చేపట్టనున్నట్లు అధికారులు వెల్లడించారు.

# బదిలీపై వెళుతున్న కమిషనర్ కు వీడ్కోలు సమావేశం

● మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్ ను మున్సిపల్ అధికారులు సిబ్బంది శాలువాలతో సత్కరించి వీడ్కోలు పలికారు





**జమ్మికుంట మే 2 (ప్రజావాణి):** గత రెండు సంవత్సరాలుగా జమ్మికుంట మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో నడిపిన మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్ ను మున్సిపల్ అధికారులు సిబ్బంది శాలువాలతో సత్కరించి వీడ్కోలు పలికారు. కమిషనర్ మహమ్మద్ అయాజ్ గత రెండు సంవత్సరాల కాలంలో జమ్మికుంట పట్టణాన్ని అన్ని రంగాలలో ముందుంచి జమ్మికుంట పట్టణ పేరును రాష్ట్రంలో పరిచయం చేసిన వ్యక్తి అని మున్సిపల్ అధికారులు కొనియాడారు పట్టణంలో ఇంటి పన్ను వసూళ్లలో రెండు పర్యాయాలు రాష్ట్ర స్థాయిలో మొదటి వరుసలో నిలిపిన వ్యక్తి అని వారు అన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ అధికారులు శాలువాలతో సత్కరించి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ జి రాజిరెడ్డి జె. ఏ. వో రాజశేఖర్ రెడ్డి టిపివో శ్రీధర్ టిపిఎస్ రాజ్ కుమార్ ఆర్ ఐ భాస్కర్ సీనియర్ అసిస్టెంట్ వాణి శ్రీనివాస్ లతో పాటు పలువురు మున్సిపల్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు

# పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలి!

● సామ్రాజ్యవాద యుద్దాలు నశించాలి.
● కర్నాకుల వీరాంజనేయులు.




**పలాస ప్రజావాణి ప్రతినిధి :** వంట గ్యాస్ సిలిండర్( కమర్షియల్ )ధరను మోదీ ప్రభుత్వం 993 రూపాయలు పెంచడాన్ని తక్షణం ఉపసంహరించుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు డిమాండ్ చేశారు. శనివారంనాడు జగ్గంపేట మండలం రామవరం శివారు రంగవల్లి నగర్ లో నిరసన కార్యక్రమం చేయడం జరిగింది. ఈ సందర్భంగా కర్నాకుల మాట్లాడుతూ... అమెరికా, ఇజ్రాయిల్ ఇరాన్ పై అక్రమంగా యుద్ధం చేసి వందలాది మంది అమాయకుల ప్రాణాలను బలితీసుకోవడమే కాకుండా ప్రపంచ దేశాలలో ఆర్థిక సంక్షోభంలోకి నెట్టి వేస్తున్నాయని ఆయన విమర్శించారు. ఇప్పటికే బ్లాక్లో గ్యాస్ ధర భరించలేక విపరీతంగా పెరిగి, ఇప్పుడు ప్రభుత్వం కూడా పెంచితే మరింత భారమై పేదా సాదా తినే ఆహారం మీద భారం పడుతుంది. ఈ పెంపుదలను తక్షణ ఉపసంహరించుకోవాలని వీరాంజనేయులు డిమాండ్ చేశారు. ఇరాన్ అమెరికా యుద్ధ వివాదంలో భారతదేశానికి ఉన్న భారతదేశ గౌరవాన్ని సంప్రదాయాన్ని పాటించి పటిష్టమైన పాత్ర పోషించడంలో మోదీ విఫలమై, కేవలం ట్రంపుకు తొత్తుగా వ్యవహరించి అమెరికా వివాదం సుదీర్ఘకాలం కొనసాగుతూ, యుద్ధ భారం భారతదేశ ప్రజల మీద, వంట గ్యాస్ పెంపు అలాగే ఇతర అనేక అంశాల్లో భారత ప్రజలు ఇబ్బందులకు గురవ్వడానికి మోదీ ప్రధాన కారణం అవుతున్నాడు. తక్షణం గ్యాస్ ధరల పెంపు ఉపసహరించుకోవాలని, ఇరాన్ మీద అమెరికా దాడిని మోడీ నిర్బంధంగా ఖండించి సమస్య పరిష్కారానికి దోహదం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు కర్నాకుల రామలింగేశ్వర రావు, కొండెపూడి మంగాయమ్మ, డాన్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# నాయకుడిగా కాదు సేవకుడిగా వస్తున్న: ఈఎల్వి భాస్కర్ ఫౌండేషన్ చైర్మన్ ఇరుగదిండ్ల భాస్కర్






**నల్లగొండ జిల్లా బ్యూరో (ప్రజావాణి )** మునుగోడు నియోజకవర్గం చండూరు మే 2: నాయకుడిగా కాకుండా సేవకుడిగా మీ ముందుకు వస్తున్నానని ఈ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్ చైర్మన్ ఇరుగదిండ్ల భాస్కర్ అన్నారు మే డే ని పురస్కరించుకొని చండూరు మున్సిపాలిటీ మునుగోడు నాంపల్లి మర్రిగూడెం గట్టుప్పల్ మండలాల గ్రామపంచాయతీ కార్మికులకు మండల పరిధిలోని తాస్కానిగూడెం గోకుల్ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడుతూ మే 1 న మే డే వేడుకలను ప్రపంచవ్యాప్తంగా నిర్వహించు కుంటారని 145 సంవత్సరాలకు పూర్వం చికాగో నగరంలో కార్మికులు 8 గంటలు పని చేయాలని కోరుతూ ఉద్యమించారని ఆ సందర్భంలో కార్మికులపై చేసిన దాడి లో రక్తం చిందిన సందర్భాలకు గుర్తుగా మే ఒకటో తేదీన కార్మిక దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నారని తెలిపారు మున్సిపల్ గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు ఈ సందర్భంగా కార్మికులు గత 7 నెలల నుండి జీతాలు రావడంలేదని మహిళా సంఘం కట్టడానికి ఇంట్లో తినడానికి సరుకులకు తెచ్చుకోవడానికి పైసలు లేకుండా ఇబ్బంది అవుతుందని వారి ఆవేదన భాస్కర్ ముందు వెల్లబుచ్చారు మా తల్లిదండ్రులు మేము మీలాగే అన్ని పనులు చేశామని ఎన్నో బాధలు కష్టాలు అనుభవించి పట్టుదలతో పేదరికం జయించి చిన్న చిన్న పనులు చేసుకుంటూ ఈ స్థాయికి వచ్చానని ఈ సందర్భంగా కార్మికులను చూసి ఆవేదన చెందారు. ప్రభుత్వానికి నెల రోజులు గడువు ఇచ్చి అప్పటికి జీతాలు చెల్లించకపోతే ప్రభుత్వం దిగివచ్చి జీతాలు చెల్లించేంతవరకు చండూరు మండల కేంద్రంగా నియోజకవర్గంలోని అన్ని మండలాల కార్మికులతో ధర్నా నిరాహార దీక్షలు నిర్వహిద్దామని దానికి నా మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని అన్నారు మునుగోడుకు సాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నారని మన తాతల తండ్రుల కాలం నుంచి నీళ్ల కోసం ఎప్పుడు పోరాడుతూనే ఉన్నామని పేర్కొన్నారు మన నీరు- మన హక్కు-మన పోరాటం పేరుతో దిండి ఎత్తిపోతల పథకం శివన్నగూడెం రిజర్వాయర్ పూర్తి చేయాలని ప్రజల రైతుల పక్షాన పోరాడుతున్నానని దీనికి మీరందరూ వెన్నుదన్నుగా నిలవాలని కోరారు ఈ సందర్భంగా మహిళా కార్మికులకు చీరలు పురుష కార్మికులకు ఒక జత బట్టలు పెట్టి సన్మానించడం జరిగింది అనంతరం కార్మికుల అందరితో కలిసి సహపంక్తి భోజనం చేశారు ఈ కార్యక్రమంలో ఈ ఎల్ వి ఫౌండేషన్ సభ్యులు ఇరగదిండ్ల అశోక్ చండూరు బిఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షులు బొమ్మరబోయిన వెంకన్న చండూరు మున్సిపల్ కౌన్సిలర్ కొండ్రెడ్డి మధు సర్పంచులు పడమటి తాళ్ల గాలింక రాంబాబు సహదేవులు రమేష్ యాదయ్య సాంబయ్యసిఐటియు నాయకులు వరికుప్పల ముత్యాలు పుట్టపాక ఉప సర్పంచ్ కిరణ్ కత్తుల లక్ష్మయ్య కావలి యాదగిరి వివిధ మండలాలకు చెందిన ప్రజాప్రతినిధులు మాజీ ప్రజా ప్రతినిధులుఈఎల్వి ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

# ఎవరెస్టు శిఖరంపై రాహుల్ ముద్ర ...!

● పీఓ పై గిరిజన యువకుడి అచంచల అభిమానం

**భద్రాచలం/మే 02 (మన ప్రజావాణి):** భద్రాచలం ఐటీడీఏ చరిత్రలో ఒక సరికొత్త అధ్యాయం. ఒక అధికారి పట్ల ప్రజలకు ఉండే కృతజ్ఞత సరిహద్దులు దాటి, సముద్ర మట్టానికి వేల మీటర్ల ఎత్తున ఉన్న ప్రపంచ శిఖరాగ్రానికి చేరుకుంది.

సాహస యాత్ర విశేషాలు

పెనుబల్లి మండలం వి.ఎం బంజర్ గ్రామానికి చెందిన బి.మోతీ కుమార్ అనే గిరిజన యువకుడు గతంలో మౌంట్ కిలి మంజరో పర్వతం 5895 మీటర్లు, మౌంట్ ఎల్బ్రస్ పర్వతం 5642 మీటర్లు అధిరోహించి రావడం జరిగిందని, ప్రస్తుతం ఎవరెస్ట్ శిఖరం సముద్ర మట్టానికి 5,364 మీటర్ల ఎత్తులో ఉన్న బేస్ క్యాంప్‌కు వరకు వెళ్ళి వచ్చాడు, త్వరలో ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించబోతున్నాడు. దీనికి అతను, దాతల సహకారం కోరుతున్నాడు.

హిమ శిఖరాల నుండి వీడియో సందేశం




మోతీ కుమార్ ఎవరెస్ట్ మంచు కొండల నుండి పంపిన సందేశం ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. "సార్, గిరిజనుల సంక్షేమం కోసం మీరు పడుతున్న కష్టానికి ప్రతిఫలంగా, మీపై ఉన్న అభిమానంతో ఈ ఫ్లెక్సీని తీసుకొని వచ్చాను ధన్యవాదాలు అని ఆ యువకుడు సందేశం పంపించడం జరిగింది. ఒక ఐఏఎస్ అధికారి పట్ల గిరిజన యువతకు ఉన్న ఈ అచంచలమైన ప్రేమాభిమానాలు, ప్రజా సేవకు పారదర్శకమైన పాలన తోడైతే ఎలాంటి ఫలితాలు ఉంటాయో అనడానికి నిదర్శనం,

ప్రజల నుండి ఏ అధికారికైనా అభిమానంతో కూడిన గౌరవం లభించడం మనం చూస్తుంటాం కానీ గిరిజనుల సంక్షేమం కోసం పాటుపడుతున్న ఐటీడీఏ పీవో బి. రాహుల్ కి దేశంలోనే మొట్టమొదటిసారి ఇంతటి అరుదైన గౌరవం దక్కడం విశేషం.

పీఓ రాహుల్ 'స్వర్ణ యుగంలో '

గిరిజన ప్రాంత అభివృద్ధిలో పీఓ రాహుల్ రెండేళ్ల లోపు పాలన ఒక అద్భుతమైన మార్పును తెచ్చింది. గిరిజన సంస్కృతిని భద్రపరిచేందుకు అత్యాధునిక గిరిజన మ్యూజియం ఏర్పాటు చేయటం, గిరిజన ఉత్పత్తుల కోసం 'భద్రగిరి మార్ట్ 'సృష్టించి, వారిని వ్యాపారులుగా మార్చడం, విద్య, వైద్యం, సాగు, తాగునీటి సౌకర్యాల కల్పనలో విప్లవాత్మక మార్పులు చేశారు. ఆదివాసీ జేఏసీ ద్వారా 'ఆదివాసి వికాస రత్న"బిరుదు పొందారు.

# ప్రజల వద్దకే పాలన -- ప్రతి వినతికి న్యాయం చేస్తాం

● రాష్ట్ర రెవెన్యూ,హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
● నేలకొండపల్లి మండలం బోదులబండ ప్రజాదర్బార్ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి పొంగులేటి










**ఖమ్మం బ్యూరో ప్రతినిధి, మన ప్రజావాణి :** ప్రజల వద్దకే పాలన అందించేందుకు ప్రజా దర్బార్ కార్యక్రమం చేపట్టామని, ఇక్కడ ప్రజలు ఇచ్చిన ప్రతి వినతికి న్యాయం చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శనివారం నేలకొండపల్లి మండలం బోదులబండ గ్రామంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ప్రజాదర్బార్ లో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ బోదులబండ క్లస్టర్‌లో 12 గ్రామాలు ఉన్నాయని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు బాగా లేకున్నా గత 2.4 సంవత్సరాలలో రేవంత్ రెడ్డి నాయకత్వం లో పలు అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని చెప్పారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రేషన్ కార్డు దారులకు సన్నబియ్యం, కొత్త రేషన్ కార్డులు వంటి పథకాలు ప్రారంభించామని తెలిపారు. గత ప్రభుత్వం 10 సంవత్సరాల్లో ఇళ్లులు ఇవ్వలేదని, తమ ప్రభుత్వం మొదటి ఏడాదిలోనే 4.5 లక్షల ఇళ్లు మంజూరు చేసిందని పేర్కొన్నారు. ప్రతి సోమవారం ఇళ్ల నిర్మాణానికి నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నిధులు జమ చేస్తున్నామని తెలిపారు. విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యత ఇస్తూ, డైట్ చార్జీలు 40 శాతం, కాస్మొటిక్ చార్జీలు 200 శాతం పెంచినట్లు తెలిపారు. ప్రభుత్వ పనితీరు వల్లే ప్రతి ఎన్నికల్లో ప్రజలు అధిక మెజారిటీతో గెలిపిస్తున్నారని అన్నారు. ఇప్పటి వరకు ఇది 5వ ప్రజాదర్బార్ సమావేశమని, ప్రతి సమావేశంలో ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తులే అధికంగా వస్తున్నాయని పేర్కొన్నారు. గత ప్రభుత్వం ఇళ్లు ఇవ్వకపోవడం వల్లే ఇందిరమ్మ ఇళ్లకు ఎక్కువ దరఖాస్తులు వస్తున్నాయని, తమ ప్రభుత్వం ఇళ్లు ఇవ్వడమే కాకుండా ప్రతి సోమవారం నిధులు విడుదల చేయడంతో ప్రజల్లో నమ్మకం పెరిగిందని తెలిపారు. మే నెలాఖరులో రెండవ దశ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని తెలిపారు. పార్టీలకు అతీతంగా ప్రతి అర్హుడికి ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని, మూడవ, నాలుగవ దశల్లో కూడా ఇళ్లు మంజూరు చేస్తామని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. భూమి సమస్యలపై ఎక్కువ దరఖాస్తులు వచ్చినట్లు పేర్కొంటూ, గత ప్రభుత్వ ధరణి విధానం వల్ల అనేక సమస్యలు ఏర్పడ్డాయని తెలిపారు. రాబోయే 2 నెలల్లో అన్ని సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. భూ భారతి ద్వారా అనేక సమస్యలు ఇప్పటికే పరిష్కరించామని, మిగిలిన వాటిని త్వరలో పరిష్కరిస్తామని తెలిపారు. సాదాబైనామా దరఖాస్తులను కూడా పరిష్కరిస్తామని, ప్రభుత్వ భూములను సాదాబైనామా ద్వారా ఆక్రమించే ప్రయత్నాలు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ప్రతిష్ఠాత్మకం గా ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని, నేలకొండపల్లి మండలంలో ఇది రెండో క్లస్టర్ కార్యక్రమమని తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించిందన్నారు. అందిన ప్రతి వినతిని ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం పరిష్కరిస్తామని పేర్కొన్నారు. మంత్రి సూచనల మేరకు కొన్ని సమస్యలను ఇక్కడే పరిష్కరిస్తామని, కొన్ని వినతులను 7 రోజుల్లో, మరికొన్నింటిని 3 నెలల్లో పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రతి వినతిని పారదర్శకంగా పరిష్కరించడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని అన్నారు. ఇందిరమ్మ గృహ లబ్ధిదారురాలు పి. శోభ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక తమకు ఇల్లు లభించిందని, తమకు స్వంత ఇల్లు ఉంటుందని ఎప్పుడూ ఊహించలేదని తెలిపారు. ఈ రోజు ఎంతో ఆనందంగా ఉందని చెప్పారు. తమకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ కూడా లభించిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్ రెడ్డి, పాలేరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి రమేష్, జిల్లా అధికారులు, ఆర్డీఓ శ్రీనివాస్, వివిధగ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ కమిషనర్ నూతనంగా బాధ్యతలు స్వీకరణ మల్లికార్జున స్వామి కి ఘనంగా సన్మానం

● మున్సిపల్ అధికారులు






**జమ్మికుంట మే 2 (ప్రజావాణి):** జమ్మికుంట మున్సిపాలిటీ కి నూతనంగా వచ్చిన మున్సిపల్ కమిషనర్ రాష్ట్ర ప్రభుత్వం గురువారం విడుదల చేసిన కమిషనర్ ల బదిలలో శనివారం నూతనంగా బదిలీపై వచ్చిన గుట్టల మల్లికార్జున స్వామి బాధ్యతలు చేపట్టారుఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జమ్మికుంట మున్సిపాలిటీ అభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తానని ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో మేనేజర్ జి రాజిరెడ్డి జె.ఏ.ఓ రాజశేఖర్ రెడ్డి టిపివో శ్రీధర్ టిపిఎస్ రాజ్ కుమార్ టిపిబివో దీపిక శానిటరీ ఇనస్పెక్టర్ మహేష్ ఆర్ ఐ భాస్కర్ సీనియర్ అసిస్టెంట్ వాణి శ్రీనివాస్ లతో పాటు పలువురు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు

# పేదల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది

● మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి.

**దుమ్ముగూడెం/మే 02 (మన ప్రజావాణి):** రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి శనివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం నియోజకవర్గంలోని దుమ్ముగూడెం మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు నిర్వహించారు. గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధి ఫలాలు ప్రతి కుటుంబానికి చేరేలా రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని ఈ సందర్భంగా మంత్రి స్పష్టం చేశారు. ముందుగా దుమ్ముగూడెం మండలం బండిరేవు గ్రామంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల భవన నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ, గిరిజన ప్రాంతాల విద్యార్థులకు నాణ్యమైన, సమగ్ర విద్యను అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తున్నదన్నారు. యంగ్ ఇండియా పథకం కింద నిర్మించనున్న ఈ రెసిడెన్షియల్ పాఠశాల ద్వారా విద్యార్థులకు విద్యతో పాటు వసతి, పోషకాహారం, క్రీడలు, నైపుణ్యాభివృద్ధి వంటి అన్ని సౌకర్యాలు ఒకే ప్రాంగణంలో అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఆధునిక తరగతి గదులు, సైన్స్, కంప్యూటర్ ల్యాబ్‌లు, గ్రంథాలయం, క్రీడా మైదానాలు, హాస్టల్ వసతులతో ఈ విద్యాసంస్థ నిర్మించబడుతుందని పేర్కొన్నారు. ఈ పాఠశాల నిర్మాణం పూర్తయిన అనంతరం స్థానికంగా వెనుకబడిన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుబాటులోకి వచ్చి వారి భవిష్యత్తుకు బలమైన పునాది ఏర్పడుతుందని తెలిపారు.

అనంతరం దుమ్ముగూడెం మండలంలోని చింతగుప్ప గ్రామం నుండి బురదమడుగు వరకు బీటీ రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గ్రామీణ ప్రాంతాల్లో రహదారి సదుపాయాలను విస్తృతంగా అభివృద్ధి చేయడం ద్వారా గ్రామాల మధ్య అనుసంధానాన్ని బలోపేతం చేయడమే కాకుండా ప్రజల రాకపోకలకు సౌలభ్యం కల్పించడం ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. ఈ రహదారి పూర్తయిన తర్వాత చింతగుప్ప, బురదమడుగు గ్రామాల మధ్య రాకపోకలు సులభతరం కావడంతో పాటు విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు గణనీయమైన ఉపయోగం ఉంటుందని పేర్కొన్నారు. ములకపాడు గ్రామంలోని మినీ స్టేడియంలో 400 మీటర్ల అథ్లెటిక్ ట్రాక్‌తో కూడిన మినీ ఇండోర్ స్టేడియం నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు."గ్రామీణ యువతలో క్రీడా చైతన్యాన్ని పెంపొందించేందుకు ప్రభుత్వం క్రీడా మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఈ సందర్భంగా మంత్రి మినీ ఇండోర్ స్టేడియంలో కల్పించిన సదుపాయాలను జిల్లా కలెక్టర్ అంకిత్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన బ్యాడ్మింటన్ కోర్టులో మంత్రి, కలెక్టర్ కలిసి షటిల్ ఆడి క్రీడాకారులను ప్రోత్సహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేదల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. ప్రతి అర్హులైన కుటుంబానికి సంక్షేమ పథకాల లబ్ధి అందేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మారుమూల గిరిజన ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు కూడా అభివృద్ధి ఫలాలు చేరేలా ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా పేదలకు గృహ సౌకర్యాలు కల్పిస్తూ వారి జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తున్నామని, మొదటి విడత విజయవంతంగా పూర్తయిందని, రెండో విడతను త్వరలో ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. రైతుల సంక్షేమంపై మాట్లాడుతూ ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లను పారదర్శకంగా నిర్వహిస్తూ, వారం రోజుల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నామని తెలిపారు. రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వం గ్రామీణాభివృద్ధిని సమగ్రంగా ముందుకు తీసుకెళ్లే దిశగా రహదారులు, విద్య, ఆరోగ్యం, క్రీడా రంగాలకు సమాన ప్రాధాన్యతనిస్తూ చర్యలు తీసుకుంటోందని మంత్రి స్పష్టం చేశారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను దశల వారీగా అందిస్తూ సమగ్ర అభివృద్ధి సాధనలో ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. భద్రాచలం శాసన సభ్యులు తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ దుమ్ముగూడెం మండ లంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు స్థానిక ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా నిలుస్తాయని తెలిపారు. యంగ్ ఇండియా పాఠశాల, రహదారి, క్రీడా వసతుల అభివృద్ధి ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో విద్య, రవాణా, క్రీడా రంగాల్లో పురోగతి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు నిజంగా పేదల జీవితాల్లో మార్పు తీసుకువస్తున్నాయని తెలిపారు. జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణం ద్వారా జిల్లాలో విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నదన్నారు. ఈ పాఠశాలలో సుమారు 2,000 నుండి 2,500 మంది విద్యార్థులు ఒకేచోట విద్యనభ్యసించే అవకాశం కల్పించబడుతుందని తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ జిల్లాలో వేగవంతంగా కొనసాగుతోందని, రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు జరిపేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నామని వివరించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా వివిధ అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాలలో ఎస్పి రోహిత్ రాజు, ఐటీడీఏ పీవో రాహుల్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణల్ శ్రేష్ఠ సంబంధిత శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.










## అశ్వారావుపేట నియోజకవర్గ యువత జాబ్ మేళా ను వినియోగించుకోండి : కాకా రమేష్



**దమ్మపేట,ప్రజావాణి న్యూస్,మే 2:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలో నిరుద్యోగ యువతి యువకులను దృష్టిలో ఉంచుకొని ఎన్నికలలో హామీ ఇచ్చిన విధంగా ఉపాధి కల్పించాలనే ఉద్దేశ్యంతో ఈ నెల 4 వ తేదీన ఖమ్మం ఎస్ఆర్ గార్డెన్స్ లో జాబ్ మేళా నిర్వహించడం జరుగుచున్నది. ఈ జాబ్ మేళా లో సుమారు 80 కంపెనీలు పాల్గొని,3200 పై చిలుకు ఉద్యోగాలను భర్తీ చేయనున్నారు. కావున అశ్వారావుపేట, దమ్మపేట మండలాల పరిధిలోని యువతీ యువకులు ఈ జాబ్ మేళాలో పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని దమ్మపేట మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కాక రమేష్ తెలిపారు. ఈ జాబ్ మేళాలో పాల్గొనే అభ్యర్థులు http://satg.telangana. gov.in వెబ్సైట్ లో వివరాలు నమోదు చేసుకుని ప్రభుత్వం కల్పించిన ఈ జాబ్ మేళాలో పాల్గొని ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందుకోవాలని అశ్వారావుపేట నియోజకవర్గ పరిధిలోని విద్యార్హత కలిగిన నిరుద్యోగ యువతి,యువకులు అందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పత్రిక ప్రకటన ద్వారా కాక రమేష్ తెలిపారు.

## నీట్ పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు

● జిల్లా ఎస్పీ రోహిత్ రాజు

● పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో 163 బిఎన్ఎస్ఎస్ అమలులో ఉంటుంది.




**భద్రాద్రి జిల్లా బ్యూరో/మే 02 (మన ప్రజావాణి):** ఆదివారం జరిగబోయే నీట్-2026 ప్రవేశ సజావుగా నిర్వహించేందుకు పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీసు బందోబస్తును ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు తెలిపారు. జిల్లా పరిధిలోని పరీక్ష కేంద్రాల వద్ద శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా సెక్షన్ 163 బిఎన్ఎస్ఎస్ అమలు చేయనున్నట్లు పేర్కొన్నారు. జిల్లా పరిధిలోని మొత్తం 03 పరీక్షా కేంద్రాల్లో మధ్యాహ్నం 2.00 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు పరీక్ష నిర్వహించబడుతుందని, పరీక్ష సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలుగా ఈ నిషేధాజ్ఞలు అమలులో ఉంటాయని ఎస్పీ తెలిపారు. సింగరేణి ఉమెన్స్ కళాశాల (కొత్తగూడెం), రామచంద్ర డిగ్రీ కళాశాల (లక్ష్మీదేవిపల్లి), సోషల్ వెల్ఫేర్ బాలికల జూనియర్ కళాశాల ( కలక్టరేట్ ఆపోజిట్) లలోని పరీక్షా కేంద్రాల్లో జరగబోయే ఈ పరీక్షకు జిల్లా నుండి 1048 అభ్యర్థులు హాజరు కానున్నట్లు వెల్లడించారు.

1. పరీక్ష కేంద్రాల పరిసరాల్లో ముగ్గురు లేదా అంతకంటే ఎక్కువ మంది వ్యక్తులు గుమికూడరాదు.
2. సభలు, సమావేశాలు, ర్యాలీ లు,ధర్నాలు నిషేధం.
3. పరీక్ష కేంద్రాల నుండి 500 మీటర్ల పరిధిలోని అన్ని జిరాక్స్ కేంద్రాలు తేది 03-05-26 ఉదయం 06:00 గంటల నుండి సాయంత్రం 06:00 గంటల వరకు మూసివేయాలని ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు.ఎవరైనా ఈ ఉత్తర్వులను అతిక్రమిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోబడుతాయని ఈ సందర్భంగా హెచ్చరించారు.

## రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక -- నియోజకవర్గ స్థాయి సమావేశం





**మన ప్రజావాణి । పినపాక నియోజకవర్గం । మే 02:** పినపాక నియోజకవర్గంలో 99 రోజుల ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక కార్యక్రమం భాగంగా శనివారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈ సమావేశానికి నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల అధికార యంత్రాంగం, విభాగాధిపతులు, ప్రజాప్రతి నిధులు, సిబ్బంది హాజరై ప్రభుత్వ లక్ష్యాల సాధనపై సమగ్రంగా చర్చించారు. సమావేశంలో భాగంగా 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కింద చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిని, గ్రామాల వారీగా అమలవుతున్న సంక్షేమ పథకాల స్థితిగతులను సమీక్షించారు. అలాగే పెండింగ్‌లో ఉన్న పనులు, ప్రజల నుంచి అందిన ఫిర్యాదులు, వినతులపై కూడా అధికారులతో సమగ్ర చర్చ జరిగింది. ముఖ్యంగా రైతు భరోసా, రైతు బీమా, ఇందిరమ్మ ఇళ్లు, గృహలక్ష్మి, మహాలక్ష్మి వంటి పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారునికి చేరేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ప్రతి శాఖ సమన్వయంతో పనిచేసి ప్రజలకు వేగవంతమైన, నాణ్యమైన సేవలు అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని పేర్కొన్నారు. చేపట్టిన పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని, ఆలస్యం లేకుండా ప్రజా సమస్యలను పరిష్కరించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. గ్రామ స్థాయి నుంచి మండల స్థాయి వరకు పరిపాలనలో పారదర్శకత ఉండాలని, ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రజా పాలన అంటే ప్రజల వద్దకే పరిపాలన చేరడం అని పేర్కొంటూ, 99 రోజుల ప్రగతి ప్రణాళికను సమర్థవంతంగా అమలు చేసి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు అందరూ కట్టుబడి పనిచేయాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అన్ని మండలాల అధికారులు, మండల అధ్యక్షులు, టౌన్ అధ్యక్షులు, గ్రామ పంచాయతీల సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# పలాస లో బంగారం షాపులో దొంగ తనము కేసులు నిందితులను అరెస్టు చేసిన జిల్లా ,పలాస పోలీసులు

- అంతర రాష్ట్ర దొంగలను మాటు కాసి పట్టుకున్న శ్రీకాకుళం,కాశీబుగ్గ పోలీసులు..
- 243 గ్రాములు బంగారము స్వాధీనము చేసుకున్న పోలీస్
- నాలుగు కార్లు, పిస్టల్ లు
- 12 మొబైల్ ఫోన్లు స్వాధీనము చేసుకున్న పోలీస్
- దొంగలను పట్టుకున్న బృందాలను అభినందించిన
- జిల్లా పోలీస్ ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి








**పలాస ప్రజావాణి ప్రతినిధి :** శ్రీకాకుళం జిల్లా పలాస.లో గత నెల లో జరిగిన బంగారము దొంగతనము జరిగింది. పక్కా ప్రణాళిక ప్రకారం అంతర రాస్తారని చెందిన ముఠా సభ్యులు పలాస లోని బంగారం షాపులో సినీ పక్కెలో దొంగతనము జరిగింది. ఈ దొంగ తనము కేసులు నమోదు చేసుకున్న కాశీబుగ్గ సీఐ వై రామకృష్ణ ఆధ్వర్యములో దర్యాప్తు జరిగింది. జరిగిన సంఘటన కు సంబంధించి జిల్లా పోలీసు ఇక్కడ సీఐ వై రామకృష్ణ తెలిపారు. దీంతో జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి తన దైన. పద్దతి లో దర్యాపి చేశారు.. జిల్లా పోలీస్ బాస్ ఆదేశాలు మేరకు నాలుగు ప్రత్యేక బృందాలు గా ఎర్పాటు చేసి దర్యాప్తు చేశారు. చాకచక్యముగా అంతర్ రాష్ట్ర దొంగలు మూటను అరెస్ట్ చేశారు. మూడు ఏళ్లుగా పలాస లోని బంగారం షాపులో చోరీ చేసేందుకు రెక్కీ చేశారు. బంగారము దొంగతనము చేసేందుకు వీలుగా జీఎస్టీ అధికారుమని చెప్పి షాపు యజమాని చేతులకు బేడీలు వేసి, సీసీ కెమెరాలు పని చేయకుండా చేశారు. అంతా దొంగలు. తమకు అనుకూలంగా దొంగ. తనము చేశారని పోలీస్ పెద్దలు చెప్పారు. పలాస లోని బంగారం దొంగలను పట్టుకున్న పోలీసులు కేసు నమోదు చేశారు..భారీ బంగార దొంగతనము కేసు ఛేదించిన కాశీబుగ్గ డీఎస్పీ పి భవానీ, సీఐ వై రామకృష్ణ, ఎస్ఐ నరసింహామూర్తి అలాగే ఇతర పోలీస్ స్టేషన్ కు చెందిన అధికారులులు ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి రెడ్డి అభిందించారు ..

## శ్రీశైలం దేవస్థానంలోని సాంస్కృతిక కార్యక్రమాలు



**నంద్యాల జిల్లా శ్రీశైలం మే2 (ప్రజావాణి):** దేవస్థానము నిర్వహిస్తున్న ధర్మపథంలో భాగంగా (నిత్యకళారాధన కార్యక్రమంలో భాగంగా) ఈ రోజు (02.05.2026) గౌరీ శంకర నృత్యాలయ, హైదరాబాద్ వారిచే సంప్రదాయ నృత్య ప్రదర్శన కార్యక్రమం ఏర్పాటు చేయబడింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద ఈ రోజు సాయంకాలం నుండి ఈ నృత్య ప్రదర్శన కార్యక్రమం నిర్వహించబడుతున్నది. ఈ కార్యక్రమములో వినాయకకౌత్వం, వందేశివం శంకరం, శివతాండవం, శంకర శివ శంకరా, అయిగిరినందిని, లింగాష్టకం, శివతాండవం తదితర గీతాలకు శ్రీలేఖ, హర్షిత, ఆద్య, మోక్షజ్ఞ, తన్వి తదితరులు నృత్యప్రదర్శన చేయనున్నారు. కాగా ఈ నిత్య కళారాధనలో ఆయా రోజులలో హరికథ, బుర్రకథ, సంప్రదాయ నృత్యం, వాయిద్య సంగీతం, భక్తిరంజని లాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయబడుతున్నాయి. శ్రీస్వామిఅమ్మవార్లకు ఆయా కైంకర్యాలన్నీ పరిపూర్ణంగా జరగాలని మరియు ప్రాచీన సంప్రదాయ కళల పరిరక్షణలో భాగంగా ఈ నిత్యకళారాధన కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయి.

## మే 4న ప్రజావాణి కార్యక్రమం రద్దు

● జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ వెల్లడి



**ఖమ్మం బ్యూరో ప్రతినిధి మన ప్రజావాణి :** జిల్లా కేంద్రంలో మే 4న నిర్వహించు మెగా జాబ్ మేళా సందర్భంగా కలెక్టరేట్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడం లేదని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని జిల్లా కలెక్టర్ తెలిపారు.

## ఘనంగా కళ్యాణ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం

- 21వ తిరు కళ్యాణ మహోత్సవాన్ని తిలకించేందుకు వేలాది మంది భక్తులు
- రామాపురం గ్రామంలో అంబరాన్నంటిన కళ్యాణ మహోత్సవ సంబరాలు
- గుడి చైర్మన్ నిగిడాల వీరయ్య





**చిలుకూరు మే02(ప్రజావాణి):** చిలుకూరు మండల పరిధిలోని రామాపురం (కట్టకొమ్ముగూడెం) గ్రామంలో కళ్యాణ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గుడి చైర్మన్ నిగిడాల వీరయ్య మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వైశాఖ పౌర్ణమి నాడు కళ్యాణ వెంకటేశ్వర స్వామి కళ్యాణాన్ని ఘనంగా నిర్వహిస్తామని చుట్టుపక్కల గ్రామాల నుండి వేలాది మంది భక్తులు భక్తిశ్రద్ధలతో కళ్యాణాన్ని తలకించేందుకు వస్తారని ప్రజలు ప్రతి సంవత్సరం వచ్చే ఈ కళ్యాణాన్ని ఎంతో గొప్పగా కొలుస్తారని అన్నారు దాతల సహకారంతో గుడిని వీధి దీపాలతో సుందరంగా అలంకరిస్తామని సుమారు 6 వేల మంది భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశామని తెలిపారు ప్రతి సంవత్సరం కళ్యాణాన్ని ఘనంగా నిర్వహిస్తామని ఈ సంవత్సరం 21వ తిరు కల్యాణంగా ఘనంగా నిర్వహించామని అదేవిధంగా వేద పండితులు గుడి ప్రధాన అర్చకులు ముడుంబై శేషా చార్యులు, సహాయ అర్చకులు లవకుశ చే వేదమంత్రాలతో స్వామివారి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారని అన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వేమూరి సతీష్ దేవాలయ కమిటీ సభ్యులు వైస్ చైర్మన్ వేమూరి కృష్ణయ్య,ప్రధాన కార్యదర్శి సాదె నాగేశ్వరరావు, సహాయ కార్యదర్శి వేమూరి వెంకటేశ్వర్లు, గ్రామ పెద్దలు తిపిరిశెట్టి కృష్ణ, వార్డు సభ్యులు గన్నా కోటేశ్వర వర్మ తిపిరిశెట్టి శ్రీనివాసరావు పాయలి వెంకటనారాయణ, వేమూరి వెంకటయ్య, నిగిడాల విరయ్య,పాయలి ధనమూర్తి గ్రామ పెద్దలు ప్రజలు తదితరులు పాల్గొన్నారు

## ఎస్ఎస్సి ఫలితాల్లో సత్తా చాటిన పాతగూడూరు విద్యార్థులు

- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అభినందన





**జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్, ఎండపల్లి మే 02 (ప్రజావాణి):** ధర్మపురి నియోజకవర్గ స్థాయి ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక సమీక్షా సమావేశం శనివారం రోజున ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా జరిగిన ప్రత్యేక కార్యక్రమం లో జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం పాతగూడూరు జడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థులు ఎస్ఎస్సి 2026 పరీక్షల్లో మండల స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను కైవసం చేసుకోవడం పట్ల అధికారులు, ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. ఈ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు టి సహర్షిత (ప్రథమ), చెల్పూరి సంజన (ద్వితీయ), ఎల్పుగొండ రేఖ (తృతీయ) లను రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్, జిల్లా విద్యాశాఖ అధికారి రాము అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.... పాతగూడూరు పాఠశాల విద్యార్థులు సాధించిన ఈ ఘనత నియోజకవర్గంలోని ఇతర విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని, మండల స్థాయిలో మొదటి మూడు స్థానాలను దక్కించుకోవడం ద్వారా పాఠశాలకు, గ్రామానికి గొప్ప పేరు తీసుకువచ్చారని కొనియాడారు. విద్యార్థులు ఇదే పట్టుదలతో ముందుకు సాగి ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. విజయానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ విజయం వెనుక విద్యార్థుల కృషి, ఉపాధ్యాయుల అంకితభావం, తల్లిదండ్రుల సహకారం మరువలేనివని వేదికపై ఉన్న ప్రముఖులు పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తు మరింత ఉజ్వలంగా ఉండాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాతగూడూరు గ్రామ సర్పంచ్ కొంగల జగదీశ్వర్ రెడ్డి, మండల విద్యాధికారి సముద్రాల హరికృష్ణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాధారాణి, ఎం సత్తయ్య, పాఠశాల ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సంఘంలో అవినీతిని విచారించిన సెర్ప్ అధికారులు





**చిలుకూరు మే02 (ప్రజావాణి):** సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలం కొండాపురం గ్రామంలో మహిళా సంఘంలో అవినీతి జరిగిందని వివోఏ పై గ్రామ మహిళలు సెర్ప్ అధికారులకు కంప్లైంట్ చేయగా ఈరోజు విచారణ నిమిత్తం సెర్ప్ హెడ్ ఆఫీస్ హైదరాబాద్ నుండి డైరెక్టర్ భారతి అండ్ టీం విచ్చేసి కొండాపురం గ్రామ పంచాయతీ కార్యాలయంలో విచారణ చేపట్టారు.విచారణలో భాగంగా మహిళలందరూ తమ దగ్గర లోన్ ఇప్పిస్తే లక్షకు వేయి రూపాయలు అక్రమంగా వసూలు చేస్తుందని,డబ్బులు ఇచ్చిన వారికి మాత్రమే లోన్ ఇప్పిస్తుందని ఇవ్వని వారికి లోన్ ఇప్పించడం లేదని తెలియజేశారు, ఇందిరా 2 గ్రూపులో సభ్యుల సంతకాలు ఫోర్జరీ చేసి పది లక్షలు లోన్ తీసుకొని నాలుగు లక్షలు మాత్రమే గ్రూప్ సభ్యులకి ఇచ్చి తిరిగి గ్రూప్ సభ్యులు అందరితో పది లక్షల రూపాయలు లోన్ కట్టించిందని వాపోయారు, మరొక సాయి గణేష్ సంఘం సభ్యురాలు శ్రీ నిధి లోను తీసుకుని పూర్తిగా కట్టినప్పటికీ సభ్యురాలికి తెలియకుండా లోన్ రాంగ్ అడ్జస్ట్మెంట్ జరిగిందని దానిని మార్చాలంటూ లీడర్లతో కుమ్మక్కై తీర్మానం చేసిందని దీనిపై చర్యలు తీసుకోవాలని భారతి గారికి తెలియజేశారు,మరొ కొన్ని సంఘం సభ్యులు శ్రీనిధి లోను డబ్బులు కట్టినప్పటికీ ఆన్లైన్లో పేమెంట్ చేయలేదని సభ్యులు ఆరోపించారు భారతి స్పందించి వీటిపై సమగ్ర విచారణ జరిపి సోమవారం రోజున సూర్యాపేట జిల్లా ఆడిటర్ అధికారి మల్లేష్ ఆధ్వర్యంలో కొండాపురం గ్రామపంచాయతీ కార్యాలయంలో ఆడిట్ నిర్వహించి,సభ్యుల ముందే రిపోర్ట్ తయారు చేసి వారికి చదివి వినిపించిన తర్వాతే అవినీతి జరిగిందని తేలితే చర్యలు చేపడతామని తెలియజేశారు, ఈ కార్యక్రమంలో మహిళా సమయాభావం సంఘం కార్యదర్శి చల్ల వెంకటమ్మ, సభ్యులు ,విజయనిర్మల,ఎర్రమల నాగమణి కంప్లైంట్ దారులు మేరిగ జయమ్మ , చిలుకూరు ఏపీఎం వీరబాబు, సిసి మేరీ,జిల్లా అధికారులు మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## లేబర్ కోడ్ లు రద్దు చేయాలి

- కార్మిక చట్టాల అమలు చేయాలి..
- ప్రగతి శీల కార్మిక సమాఖ్య పి కే ఎస్ ఆధ్వర్యంలో మేడే వారోత్సవాల్లో భాగంగా
- బొడ్డపాడులో బహిరంగ సభ







**పలాస ప్రజావాణి ప్రతినిధి :** శ్రీకాకుళం జిల్లా పలాస మండలం బొడ్డపాడు అమరుల స్మారక భవనం నందు మేడే వారోత్సవాల్లో భాగంగా ప్రగతిశీల కార్మిక సమాఖ్య జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బహిరంగ సభ నిర్వహించడం జరిగింది. ముందుగా మేడే పతకాన్ని నిర్మాణ రంగ మేస్త్రి రామ్ శాహు మరియు ప్రగతి శీల కార్మిక సమాఖ్య జిల్లా కార్యదర్శి పుచ్చ దుర్యోధన ఆవిష్కరించారు. అనంతరం పి కే ఎస్ జిల్లా అధ్యక్షులు మద్దిల ధర్మారావు అధ్యక్షతన ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు మాట్లాడుతూ 1886లో చికాగో కార్మికులు పనిగంటల కోసం పోరాటం చేసి 20 మంది వరకు కార్మిక హక్కుల కోసం అమరులయ్యారని వారి త్యాగాల స్ఫూర్తితో ప్రపంచవ్యాప్తంగా మేడే కార్యక్రమాలను అన్ని రంగాల కార్మికులు కర్షకులు జరుపుకుంటారని అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో 2014 తర్వాత కేంద్రంలో అధికారం చేపట్టిన ఎన్డీఏ కూటమి ప్రభుత్వం కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్ లను తీసుకువచ్చి కార్మిక హక్కులు కాలరాస్తుందని లేబర్ కోడ్ వల్ల కార్మికులు తమ హక్కులు కోల్పోయారని శ్రమకు తగ్గ ఫలితం కనీస వేతనం అడిగే హక్కు గాని కార్మిక సంఘాలు నిర్మించుకునే హక్కు గానీ ఉద్యోగ భద్రత లేకుండా పనిచేసే పరిస్థితి కార్మికులకు ఉత్పన్నమైందని ఎనిమిది గంటల పని విధానాన్ని 12 గంటలకు పెంచి కార్మికుల శ్రమను కోర్పరేట్లకు పెట్టుబడిదారులకు దోచుకునే అవకాశం కల్పించిందని ఈ దేశంలో ఉన్న కోట్లాదిమంది అసంఘటిత రంగ కార్మికులకు భద్రత లేకుండా చేసిందని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలు అమలు చేస్తున్నాయని నాలుగు లేబర్ కోడ్ లు రద్దు చెయ్యాలని కార్మిక చట్టాలు యథావిధిగా అమలు చేయాలని అసంఘటిత రంగ కార్మికులకు పిఎఫ్ ఈఎస్ఐ సౌకర్యంతో పాటు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కార్మిక చట్టాలు హక్కులు కోసం కార్మిక వర్గం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. మే నెల ఒకటో తేదీ నుండి మే 5వ తేదీ కారల్ మార్క్స్ జయంతి వరకు మేడే వారోత్సవాలు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించాలని ప్రగతిశీల కార్మిక సమాఖ్య రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఈ సభ నిర్వహించడం జరిగిందని అన్నారు. ఈ సభలో ప్రగతిశీల కార్మిక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఎస్కే మస్తాన్ శ్రీకాకుళం జిల్లా కార్యదర్శి దుర్యోధన పౌర హక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి పి దానేష్ అమరుల బంధుమిత్రుల సంఘం నాయకులు జోగి కోదండరావు తామాడ త్రిలోచన రావు దేశభక్తి ప్రజాతంత్ర ఉద్యమం పిడిఎం నాయకులు సాలిన విరాస్వామి రైతాంగ సమస్యల సాధన సమితి నాయకులు దాసరి శ్రీరాములు కార్గో ఎయిర్పోర్ట్ వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు కొమర వాసు దేవాడ నారాయణ రావు కారీ పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు. ప్రగతి శీల కార్మిక సమాఖ్య కళాకారుల బృందం సాలిన ఈశ్వరరావు రాపాక చిరంజీవిలు మురిపింటి గంగయ్య షణ్ముఖరావు లత తదితరులు విప్లవ గేయాలు ఆలపించారు.

## వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ తరలింపుపై మంత్రి శ్రీధర్ బాబు ను కలిసిన వొడితల ప్రణవ్,జేపసీ నాయకులు

- మంత్రికి వినతిపత్రం అందజేసిన నాయకులు
- సానుకూలంగా స్పందించిన మంత్రి,ముఖ్యమంత్రితో చర్చించి తరలింపునకు సహకరిస్తానని హామీ ఇచ్చిన మంత్రి





**జమ్మికుంట మే 2 (ప్రజావాణి):** హుజురాబాద్ పట్టణ పరిధిలోని సిర్సపల్లి శివారులో ఏర్పాటు చేసే వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ తరలింపునకు సహకరించాలని మంత్రి శ్రీధర్ బాబు ను కోరారు హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్,జేఏసీ నాయకులు, హుజురాబాద్ ప్రాంత నాయకులు.ఈ మేరకు శనివారం సచివాలయంలోని శ్రీధర్ బాబు కార్యాలయంలో అఖిలపక్ష నాయకులతో,హుజురాబాద్ ముఖ్య నాయకులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేపించారు ప్రణవ్.సమస్యపై పూర్తిగా వివరించిన నాయకులు వీలైనంత త్వరగా ఈ సమస్యకు పరిష్కారం చూపాలని కోరగా సానుకూలంగా స్పందించిన మంత్రి తరలింపునకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.అనంతరం మంత్రికి వినతిపత్రాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో హుజురాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ సుహాసిని,కౌన్సిలర్లు,హుజురాబాద్ సర్పంచుల ఫోరం అధ్యక్షులు పత్తి అనిత–కృష్ణారెడ్డి,వివిధ గ్రామాల సర్పంచులు,జేఏసీ నాయకులు,కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు,హుజురాబాద్ ముఖ్య నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## సేంద్రియ ఆర్గానిక్ ఉత్పత్తులపై గిరిజన మహిళలకు ఆర్థికంగా చేయూత

- అడవులలో దొరికే అటవీ వస్తువులు భద్రగిరి మార్ట్ లో అందుబాటులోకి
- ఐటీడీఏ పీవో వినూత్న ఆలోచన.. భద్రగిరి మార్ట్ ఒక అద్భుతం...
- సేంద్రియ, ఆర్గానిక్ వస్తువులకు కేరాఫ్ భద్రగిరి మార్ట్
- భద్రగిరి మార్ట్ ఆవరణలో "డ్రగ్స్ మహామారి నిర్మూలన" వాల్పోస్టర్ ఆవిష్కరణ
- ఐటీడీఏ భద్రాచలం పీవో బి. రాహుల్ పై వరాల జల్లులు..







**భద్రాచలం/మే 02 (మన ప్రజావాణి):** భద్రాచలం పట్టణ ప్రజలకు అడవులలో దొరికే అటవీ ఉత్పత్తులు, సేంద్రియ ఆర్గానిక్ ఉత్పత్తులు, ఎస్.హెచ్.జి, గిరిజన మహిళలకు ఆర్థికంగా చేయూత అందించడానికి ఎంతో దూర దృష్టితో భద్రాచలం ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ కృషితో ఏర్పాటు చేసిన భద్రగిరి మార్ట్ చాలా అద్భుతంగా ఉందని, ఈ సందర్భంగా ఐటీడీఏ భద్రాచలం పిఓను ప్రత్యేకంగా అభినందిస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మాత్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శనివారం రోజు భద్రాచలం పట్టణంలోని భద్రగిరి మార్ట్ ను మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్, ఇతర అధికారులతో కలిసి ఆయన సందర్శించి మార్ట్ లోని అటవీ ఉత్పత్తులను పరిశీ లించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఉపయోగకరమైన అనేక అటవీ వస్తువులను ఈ మార్ట్ లో అందుబాటులోకి తీసుకురావడం చాలా సంతోషకరమని, ఇవి ప్రజలకు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. ఎస్.హెచ్.జి గిరిజన మహిళలు, ఆర్గానిక్ పంటలు పండించే గిరిజన రైతుల ఉత్పత్తులకు విస్తృత మార్కెట్ ను కల్పించడంతోపాటు, స్థానిక గిరిజన కుటుంబాలకు ఆర్థిక బలాన్ని అందించే సదాశయంతో ఏర్పాటు చేసిన ఈ మార్టును స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని, భద్రగిరి మార్ట్ లో అందుబాటులో ఉంచిన గిరిజనుల సాంప్రదాయ ఉత్పత్తులు, వారి ప్రతిభకు సరైన గుర్తింపు ఇవ్వడం, అలాగే వారి జీవనోపాధిని మెరుగుపరచడం లక్ష్యంగా ఈ మార్ట్ ఏర్పాటు చేయడం జరిగిందని, భద్రాచలం ప్రజలు గిరిజన ఉత్పత్తులను కొనుగోలు చేసి, గిరిజన ఎస్.హెచ్.జి గ్రూప్ మహిళలు, గిరిజన రైతులకు ఆర్థికంగా చేయూత అందించాలని ఆయన అన్నారు. అనంతరం భద్రగిరి మార్ట్ ఆవరణలో మహిళ స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో డ్రగ్స్ మహామారి నిర్మూలన సంబంధించిన వాల్పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు, జిల్లా కలెక్టర్ అంకిత్, ఎస్పీ రోహిత్ రాజ్, సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ఠ, సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్, ఐటీడీఏ యూనిట్ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## పిట్టల ఎల్లయ్యపల్లెలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహణ

- డాక్టర్ మర్రి మహేష్ రెడ్డి





**ప్రజావాణి జిల్లా ప్రతినిధి పెద్దపల్లి మే 02:** ప్రజల ఆరోగ్యమే మా ప్రథమ బాధ్యత అని, గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నామని కరీంనగర్ వన్ హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ మర్రి మహేష్ రెడ్డి తెలిపారు.శనివారం (మే 2) పెద్దపల్లి జిల్లా, ఓదెల మండలం, పిట్టల ఎల్లయ్యపల్లె గ్రామంలో వన్ హాస్పిటల్ వైద్య బృందం, గ్రామ సర్పంచ్ పిట్టల రవికుమార్ మరియు గ్రామ పెద్దల సహకారంతో ఈ భారీ వైద్య శిబిరాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా డాక్టర్ మర్రి మహేష్ రెడ్డి మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో సరైన వైద్య సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్న ప్రజల కోసం ఈ కార్యక్రమాన్ని చేపట్టామని చెప్పారు. ప్రజలు తమ ఆరోగ్యంపై అవగాహన పెంచుకుని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.వైద్య శిబిరంలోని ముఖ్యాంశాలు:అనుభవజ్ఞులైన వైద్యులచే ఉచిత జనరల్ మరియు స్పెషలిస్ట్ వైద్య పరీక్షలు నిర్వహించడం రోగులకు అవసరమైన ప్రాథమిక మందులను ఉచితంగా అందించడం ఆరోగ్య సూత్రాలు మరియు సామాజిక అంశాలపై అవగాహన కల్పించడం ఈ శిబిరంలో వన్ హాస్పిటల్ వైద్య బృందం, గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో హాజరై వైద్య సేవలను పొందాలని డాక్టర్ మహేష్ రెడ్డి పిలుపునిచ్చారు.కార్యక్రమంలో రచయిత, గాయకుడు పొద్దుపొడుపు శంకర్, సర్పంచ్ రవికుమార్, ఉప సర్పంచ్ మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.


Printed, Published and Owned by RAYINIPATLA KUMARASWAMY, Printed at RAMANI WEB OFFSET PRINTERS, Auto Nagar, Bommakal, Karimnagar, Editor : RAYINIPATLA KUMARASWAMY, MANAPRAJAVAANI BROAD CASTING AND PUBLICATIONS, Ankireddypally, Thanggellapally, Rajanna Sircilla, TELANGANA-505405. RNI NO:TGTEL/25/A5443 Contact No : 9440032006. MAIL ID : Kumaraswamyrayinipatla@gmail.com

# నిఘా నిద్రపోతోంది.. దగా దండుకుంటుంది..!

- నకిలీ బిల్లులతో దర్జాగా ఇసుక తరలిస్తున్న అక్రమార్కులు
- పెద్ద మండవ నుండి నేలకొండపల్లికి తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి..?
- తనిఖీలు చేస్తామన్న నేలకొండపల్లి తాహసిల్దార్ రాంప్రసాద్











**ఖమ్మం బ్యూరో ప్రతినిధి, మన ప్రజావాణి :** ఖమ్మం జిల్లాలో పలు మండలాలలో అనుమతులు లేకుండా యదేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా జరుగుతోందని పలువురు బహిరంగంగా వ్యాఖ్యానిస్తున్న నేపథ్యంలో ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం పెద్ద మండవ మున్నేరు లో అక్రమ ఇసుక రవాణా కు నకిలీ బిల్లులు జోడించి సుమారు 100 నుండి 150 ట్రాక్టర్లతో నిత్యం ఇసుకను ముదిగొండ నేలకొండపల్లి మండలాలకు తరలిస్తూ లక్షలాది రూపాయలు కొల్లగొడుతున్నట్లు బహిరంగంగా తెలిసినప్పటికీ అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడం అధికారుల పనితీరును స్పష్టం చేస్తుందని పలువురు ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రధానంగా ముదిగొండ మండలం పెద్దమండవ నుండి కమలాపురం మీదుగా అనాసాగరం బౌద్ధ స్తూపం ద్వారా నేలకొండపల్లి మండలంలోనికి రవాణా అవుతున్నట్లు తెలిసింది. ఇదే ముదిగొండ మండలం నుండి కమలాపురం బాణాపురం నాచేపల్లి ద్వారా నిత్యం రవాణా అవుతున్నట్లు ఎటు వీలుంటే అటు తరలిస్తూ నిత్యం లక్షలాది రూపాయలు దండుకుంటున్నట్లు తెలిసింది. ముదిగొండ మండలానికి చెందిన ఓ డీలర్ ఏకంగా నకిలీ బిల్లుతో నేలకొండపల్లి మండలంలో ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న వ్యవహారం ప్రకంపనలు సృష్టిస్తోంది. ఇప్పటికే ముదిగొండ చింతకాని నేలకొండపల్లి ఖమ్మం రూరల్ మండలాలలో అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్నట్లు బహిరంగంగా ఆరోపణలు ఉన్నప్పటికీ పబ్లిక్ గా నకిలీ బిల్లులతో తరలించడం సంచలనంగా మారింది. ఈ విషయంపై ముదిగొండ తాహసిల్దార్ను మన ప్రజావాణి తెలుగు దినపత్రిక ఖమ్మం బ్యూరో ప్రతినిధి వివరణ కోరగా తెలుసుకుంటాం అంటూ బదులిచ్చారు. సంబంధిత రెవిన్యూ ఇన్స్పెక్టర్ను సంప్రదించండి అన్నారు. కాగా సదరు రెవెన్యూ ఇన్స్పెక్టర్ పలుమార్లు చరవాణిలో సంప్రదించినప్పటికీ స్పందించకపోవడం గమనార్హం. ముదిగొండ మండలం నుండి నేలకొండపల్లికి తరలిస్తున్న వ్యవహారంపై స్థానిక నేలకొండపల్లి తాహసిల్దార్ రాంప్రసాద్ ను ప్రతినిధి వివరణ కోరగా తనిఖీలు చేసి చర్యలు తీసుకుంటామంటూ అన్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ లక్షలాది రూపాయలు దండుకుంటున్న అక్రమార్కులపై ఉక్కు పాదం మోపాలని పలువురు జిల్లా ప్రజలు కోరుతున్నారు. మరికొన్ని సమగ్ర వివరాలతో రేపటి కథనం..2లో వేచి చూడండి...

# కాకరవాయిలో మానవత్వం చాటిన కాంగ్రెస్ నాయకులు.

- బాధిత కుటుంబానికి 15 వేల ఆర్థిక సహాయం.



**తిరుమలాయపాలెం, ప్రజావాణి, మే 2:** తిరుమలాయపాలెం మండలం కాకరవాయి గ్రామంలో మానవత్వానికి నిదర్శనంగా కాంగ్రెస్ నాయకులు ముందుకొచ్చారు. ఇటీవల మరణించిన వెంకటాద్రి కుటుంబానికి గ్రామ కాంగ్రెస్ నాయకులు రూ. 15,000 ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి అండగా నిలిచి తమ పరామర్శను వ్యక్తం చేశారు. అనంతరం వెంకటాద్రి కుటుంబ సభ్యులు మోరపాక నాగయ్య, మోరపాక సుధాకర్‌లను నాయకులు పరామర్శించి, వారి దుఃఖాన్ని పంచుకున్నారు. ఈ కష్టకాలంలో ధైర్యంగా ఉండాలని, భవిష్యత్తులో కాంగ్రెస్ పార్టీ తరపున అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. నాయకుల మాటలు కుటుంబ సభ్యులకు కొంతమేర మనోధైర్యాన్ని కల్పించాయి. ఈ కార్యక్రమంలో కాకరవాయి మాజీ ఎంపీటీసీ బుద్ధ వంశీకృష్ణ, మండల కాంగ్రెస్ నాయకులు కట్కూరి శ్రీనివాస్ రెడ్డి, తవడబోయిన కృష్ణ, గూడూరు వెంకటేశ్వర్లు, గుండాల లింగయ్య, ఇందుర్తి మధు, గంట్ల రవీందర్ రెడ్డి, గుండెబోయిన శ్రీశైలం, గుండాల మహేష్, దోనెపల్లి వెంకటేశ్వర్లు, కొత్తపల్లి రవి, చిన్న నాగన్న, కొత్తపల్లి చిన్న మల్లయ్య, కొత్తపెల్లి కృష్ణ, కొత్తపెల్లి గోపాల్, దామర్ల కృష్ణ తదితరులు పాల్గొన్నారు. గ్రామంలో ఈ చర్యపై స్థానికులు అభినందనలు వ్యక్తం చేస్తూ, కష్టసమయంలో అండగా నిలవడం నిజమైన సేవ అని పేర్కొన్నారు.

# శిథిలావస్థలో ఉన్న శ్రీ హనుమాన్ గ్రంథాలయం కు నిధులు కేటాయించండి..!

- మంత్రి పొంగులేటికి జర్నలిస్ట్ అవుట మధు వినతి..
- నిధుల కేటాయింపుపై కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేసిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



**నేలకొండపల్లి ప్రతినిధి మన ప్రజావాణి మే 2: శనివారం:** ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండల పరిధి లోని బోదులబండ ప్రభుత్వ పాఠశాలలో శనివారం మధ్యాహ్నం నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో చెన్నారం గ్రామానికి చెందిన జర్నలిస్ట్, అవుట మధు రెవెన్యూ, గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించారు. చెన్నారం గ్రామంలో సుమారు 38 సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన శ్రీ హనుమాన్ గ్రంథాలయం ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుందని, గ్రామ యువత మరియు విద్యార్థుల విద్యాభివృద్ధికి ఉపయోగపడే ఈ గ్రంథాలయాన్ని తిరిగి పునఃప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రంథాలయ ప్రస్తుత పరిస్థితిని మంత్రి దృష్టికి తీసుకెళ్లిన అవుట మధు, భవనం దెబ్బతిని ఉపయోగించలేని స్థితికి చేరుకుందని వివరించారు. దీనిపై స్పందించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, గ్రంథాలయ పునరుద్ధరణకు అవసరమైన నామినల్ ఫండ్స్ కేటాయింపుపై తగిన చర్యలు తీసుకోవాలని ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్‌కు ఆదేశాలు జారీ చేశారు. గ్రంథాలయం పునఃప్రారంభమైతే గ్రామంలో విద్యా, సాంస్కృతిక వాతావరణం మరింత బలోపేతం అవుతుందని గ్రామస్తులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా ప్రభుత్వ కార్యక్రమాలు

- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్
- ప్రజా పాలన ప్రగతి ప్రణాళికతో ప్రజలకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు
- ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక నియోజకవర్గ స్థాయి సమావేశంలో సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ తో కలిసి పాల్గొన్న జిల్లా కలెక్టర్





**సత్తుపల్లి ప్రతినిధి మన ప్రజావాణి:** సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా ప్రభుత్వం వివిధ పథకాలను ప్రవేశపెట్టిందని, ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాలతో ప్రజలకు పెద్ద ఎత్తున అవగాహన కల్పించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక 99రోజుల కార్యచరణ లో భాగంగా శనివారం సత్తుపల్లి లోని ఎమ్.ఆర్ గార్డెన్స్ నందు నిర్వహించిన నియోజకవర్గ స్థాయి సమావేశంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ తో కలిసి పాల్గొన్నారు. సత్తుపల్లి నియోజకవర్గ స్థాయి శాఖల అధికారులు పలు ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించారు. లబ్ధిదారుల వివరాలను వెల్లడించారు. అలాగే వివిధ గ్రామాల సర్పంచులు, ప్రజలు తమ ప్రాంత సమస్యలను గురించి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా పరిష్కారానికి కృషి చేస్తామని జిల్లా కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని 10 ముఖ్యాంశాలను అజెండాగా తీసుకొని 99 రోజులపాటు వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటికే జిల్లా స్థాయిలో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు అవగాహన కల్పించడం జరిగిందని, గ్రామసభలు కూడా పూర్తి చేశామన్నారు. మండల స్థాయి సమావేశాల అనంతరం నియోజకవర్గ స్థాయిలోనూ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని సంక్షేమ పథకాలు అర్హులందరికీ చేరేలా ప్రతి సంబంధిత శాఖాధికారి కట్టుదిట్టంగా పని చేయాలని సూచించారు. ముఖ్యంగా పింఛన్లు, రేషన్, విద్య, ఆరోగ్యం, తాగునీరు వంటి ప్రాథమిక అవసరాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. అభివృద్ధి కార్యక్రమాల అమలులో పారదర్శకత, నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని, పనులను నిర్దిష్ట కాలపరిమితిలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. గ్రామ స్థాయి సిబ్బంది నుంచి జిల్లా స్థాయి అధికారుల వరకు సమన్వయంతో పనిచేస్తేనే ఆశించిన ఫలితాలు సాధ్యమవుతాయని అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ ప్రణాళిక కార్యక్రమ సభల్లో ప్రజల నుంచి అందిన వినతులు, ఫిర్యాదులను ప్రాధాన్యతగా తీసుకుని, వాటిని త్వరితగతిన పరిష్కరించడం ద్వారా ప్రజల్లో ప్రభుత్వంపై నమ్మకం పెంపొందించవచ్చని పేర్కొన్నారు. ప్రభుత్వం రాబోయే పథకాల అమలుకు ప్రణాళికలు రూపొందిచారని, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అల్పాహారం ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఇంటర్ కళాశాలలలో మధ్యాహ్న భోజనం, ఇందిరమ్మ జీవిత బీమా, వికలాంగ విద్యార్థులకు వాహనాలు తదితర కొత్త పథకాల గురించి, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై పెద్ద ఎత్తున ప్రచారం చేయాల్సిన అవసరం ఉందన్నారు. రేషన్ కార్డులు కోసం అర్హులైన వారందరూ దరఖాస్తు చేసుకోవాలని, తొందరగానే మంజూరు చేయడం జరుగుతుందని ఇది నిరంతర ప్రక్రియ అని కలెక్టర్ పేర్కొన్నారు. సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గృహ జ్యోతి పథకం ద్వారా పేదలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, కొత్త రేషన్ కార్డులు, డైట్ చార్జీల పెంపు, ఇందిరమ్మ ఇళ్ళు, ఇందిరా మహిళా శక్తి వడ్డీరహిత రుణాలు, రేషన్‌లో సన్నబియ్యం, రైతు భరోసా, రైతు రుణమాఫీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలు అమలులో ఉన్నాయని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో వచ్చిన సమస్యలను పరిష్కరించామని తెలిపారు. ప్రతి సోమవారం పురోగతికి అనుగుణంగా చెల్లింపులు జరుగుతున్నాయని చెప్పారు. ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత సమీపంలోకి తీసుకువచ్చే ఒక ముఖ్యమైన వేదికగా నిలుస్తోందన్నారు. నియోజకవర్గ స్థాయిలో నిర్వహిస్తున్న ఈ సమావేశాల ద్వారా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి సమయపాలనతో చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఆధ్వర్యంలో సత్తుపల్లి నియోజక వర్గంలో అన్ని శాఖల ప్రభుత్వ అధికారులు మరియు ప్రజా ప్రతినిధుల సహకారంతో ఈ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం విజయవంతం అయ్యి, గ్రామాలు పట్టణాలు అభివృద్ధి చెందాయని, ఎన్నో సమస్యలకు పరిష్కారం లభించాయని తెలిపారు. నిజమైన పేద కుటుంబాలకు చెందిన లబ్ధిదారులకు ఈ కాంగ్రెస్ ప్రభుత్వంలో పథకాలు అందుతాయని మరెన్నో పథకాలు త్వరలో పేద ప్రజలకు అందుతాయని దీమా వ్యక్తం చేశారు. ప్రజలందరికీ అన్ని శాఖ ప్రభుత్వ అధికారులు అందుబాటులో ఉండాలని, ప్రజలు తెలియజేసిన సమస్యలను వెంటనే పరిశీలించి పరిష్కరించాలని, ప్రభుత్వానికి ఎటువంటి చెడ్డ పేరు తీసుకు రావద్దని, ప్రభుత్వ అభివృద్ధిలో మీ అందరి సహకారం ఉండాలని స్థానిక ఎమ్మెల్యేగా నా పూర్తి సహాయ సహకారాలు మీ అందరికీ ఉంటాయని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం లో కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, సత్తుపల్లి మున్సిపల్ చైర్మన్ రయానాబేగం, కల్లూరు మున్సిపల్ చైర్మన్ మెహన్‌నాయక్, సత్తుపల్లి, కల్లూరు మార్కెట్ కమిటి చైర్మన్లు ఆనంద్ బాబు, నీరజ, కౌన్సిలర్స్, పంచాయతీల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, అధికారులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# పాల్వంచ నెహ్రూ నగర్ లోని గిరిజన బాలికల డిగ్రీ కళాశాలలో భారీ ప్లేస్‌మెంట్ డ్రైవ్





**పాల్వంచ/మే 02 (మన ప్రజావాణి):** పాల్వంచ నెహ్రూ నగర్ లోని గిరిజన బాలికల డిగ్రీ కళాశాల కొత్తగూడెంలో ఐటీసీ ఎంఎస్‌కే, ప్రథమ్ స్కిల్లింగ్ ఎకోసిస్టమ్ సహకారంతో నిర్వహించిన ప్లేస్‌మెంట్ డ్రైవ్ ఘనవిజయం సాధించింది. ఈ కార్యక్రమంలో సుమారు 200 మంది విద్యార్థినులు పాల్గొనగా, అందులో 120 మంది వివిధ ప్రముఖ సంస్థల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఫాక్స్‌కాన్, టాటా ఎలక్ట్రానిక్స్, నమో ట్రేడర్స్ వంటి సంస్థలు ఈ డ్రైవ్‌లో పాల్గొని అభ్యర్థులను ఎంపిక చేశాయి. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ అనురాధ మాట్లాడుతూ విద్యార్థినుల భవిష్యత్ అభివృద్ధికి ఇటువంటి ప్లేస్‌మెంట్ కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని తెలిపారు. ఎంపికైన విద్యార్థినులను అభినందించి, వారు తమ వృత్తి జీవితంలో మరింత ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాన్ని ప్లేస్‌మెంట్ సెల్ కోఆర్డినేటర్ నాగేశ్వరరావు, సీజీసీ కోఆర్డినేటర్ భారతి, ఐటీసీ ఎంఎస్‌కే ప్రథమ్ కోఆర్డినేటర్ ఎన్.నరేష్, ఆర్.ఉప్పల్ కోఆర్డినేటర్ సమన్వయం చేశారు. కళాశాల సిబ్బంది, విద్యార్థినులు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో కీలక పాత్ర పోషించారు.

# పేదలకు వరం ఇందిరమ్మ ఇళ్ల పథకం


- టీపీసీసీ జనరల్ సెక్రటరీ నాగా సీతారాములు





**సుజాతనగర్/మే 02 (మన ప్రజావాణి):** సుజాతనగర్ మండలంలోని సింగభూపాలెంకు చెందిన మంచినీళ్ల జిన్ను, గణేష్ దంపతులు నిర్మించుకున్న నూతన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశానికి హాజరై, ఆ దంపతులకు నూతన పట్టు వస్త్రాలు పెట్టిన టీపీసీసీ జనరల్ సెక్రటరీ నాగా సీతారాములు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా సొంత ఇంటి నిర్మాణం కోసం కలలు కంటూ, తమ ఆర్థిక స్తోమత సరిగా లేక అద్దె ఇళ్లల్లో ఉంటూ, చాలీచాలని జీవనం గడుపుతు సొంత ఇంటి కల నెరవేరదు అనుకుని, నిరాశ చెందే వాళ్లకు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయించి, రూ. 5 లక్షల రూపాయలు అందజేసిందని, ఇలాంటి ప్రభుత్వానికి ప్రజలు మద్దతు ఇవ్వాలని, రాబోయే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో మరింత మెజారిటీ ఇవ్వాలన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఎల్లప్పుడు నిరుపేదల గురించి ఆలోచించే వ్యక్తులని, ఇందిరమ్మ ఇళ్ల విషయంలో ఏదైనా ఇబ్బంది అనిపిస్తే, మంత్రి పొంగులేటితో మాట్లాడి పరిష్కరిస్తానని సీతారాములు పేర్కొన్నారు. ఈ కార్యక్ర మంలో కొత్తగూడెం సొసైటీ మాజీ చైర్మన్ మండె వీరహనుమంతరావు, సింగభూపాలం గ్రామ సర్పంచ్ కిన్నెర వెంకన్న, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బైరు సాంబయ్య, రాసబంటి బాబు, నలగొర్ల మల్లయ్య, బత్తుల కేశవరావు, ముత్తిని. వెంకటేశ్వర్లు, చిమట నాగేశ్వరరావు, మెట్టెల సైదుబాబు, సాయిన్ని నర్సింహారావు, దామర్ల సర్వేశ్వరరావు, యువజన కాంగ్రెస్ నాయకులు కొమారి రవీందర్, గుగులోతు కోటేష్ బందుమిత్రులు పాల్గొన్నారు.

# ఎంబిబిఎస్ లో గడియారం అక్షయ కు గోల్డ్ మెడల్







**మందమర్రి (మన ప్రజావాణి) మే 02:** టిఎన్జీవో జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి - పల్లవి దంపతుల కుమార్తె డాక్టర్ గడియారం అక్షయ గోల్డ్ మెడల్ సాధించింది. శుక్రవారం హైదరాబాద్ గాంధీ మెడికల్ కళాశాలలో నిర్వహించిన స్నాతకోత్సవం కార్యక్రమంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ చేతుల మీదుగా అక్షయ ఎంబిబిఎస్ పట్టాను, గోల్డ్ మెడల్ ను అందుకుంది. ఈసందర్భంగా ఆమె తండ్రి టిఎన్జీవో జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి మాట్లాడుతూ, ఎంబిబిఎస్ లో తన కుమార్తె అక్షయ గోల్డ్ మెడల్ సాధించడం చాలా సంతోషం ఉందని ఆనందం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో మరిన్ని పురస్కారాలు అందుకుంటూ, వైద్యురాలుగా బీద ప్రజలకు ఉచిత సేవలు అందించేందుకు ముందుండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా గడియారం అక్షయ ను ఆమె కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, సన్నిహితులు, టీఎన్జీవో జిల్లా కార్యవర్గ సభ్యులు, జిల్లాలోని అన్ని యూనిట్ల అధ్యక్ష కార్యదర్శులు, సభ్యులు అభినందిస్తూ, శుభాకాంక్షలు తెలియజేశారు.

# రైతు కష్టాల్లో పెద్ది రాజకీయం..

● మాజీ పీఏసీఎస్ వైస్ చైర్మన్ తొగరు చెన్నారెడ్డి ధ్వజం



చెన్నారావుపేట మే 02 ప్రజావాణి :నర్సంపేట నియోజకవర్గ మొక్కజొన్న రైతుల సంక్షేమం పట్ల ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి చిత్తశుద్ధితో పనిచేస్తుంటే, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి మాత్రం రైతుల కష్టాల్లో రాజకీయ లబ్ధి వెతుక్కోవడం సిగ్గుచేటని మాజీ పీఏసీఎస్ వైస్ చైర్మన్ తొగరు చెన్నారెడ్డి విమర్శించారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ మాజీ ఎమ్మెల్యే తీరుపై ఘాటుగా స్పందించారు.మొక్కజొన్న రైతులకు అండగా నిలుస్తూ, కొనుగోలు చేసిన పంటను మార్కెట్ల నుండి త్వరితగతిన తరలించేలా ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అధికారులపై ఎప్పటికప్పుడు ఒత్తిడి తెస్తున్నారని చెన్నారెడ్డి కొనియాడారు. అకాల వర్షాల వల్ల రైతులకు నష్టం వాటిల్లకూడదనే ఉద్దేశంతో ఆయన స్వయంగా రవాణా వ్యవస్థను పర్యవేక్షిస్తున్నారని, రైతుల మేలు కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. మరోవైపు మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి తీరు అత్యంత దారుణంగా ఉందని చెన్నారెడ్డి మండిపడ్డారు. ఎప్పుడు వర్షాలు పడతాయా.. ఎప్పుడు రైతుల ధాన్యం తడిసి ముద్దవుతుందా.. ఆ కష్టాన్ని చూసి ఎప్పుడు దొంగ ఏడుపు ఏడుస్తూ ప్రభుత్వంపై విమర్శలు చేద్దామా? అని పెద్ది ఎదురుచూస్తున్నట్లు కనిపిస్తోందని ఆయన ఎద్దేవా చేశారు. రైతులు నష్టపోవాలని కోరుకుంటూ, ఆ నష్టంపై రాజకీయ పబ్బం గడుపుకోవాలని చూడటం దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని ధ్వజమెత్తారు.రైతులు గమనిస్తున్నారు. .నిజమైన రైతు పక్షపాతి ఎవరో, కేవలం రాజకీయ విమర్శల కోసమే వేచి చూసే నాయకుడు ఎవరో నియోజకవర్గ ప్రజలు గమనిస్తున్నారని ఆయన అన్నారు. ఇప్పటికైనా పెద్ది సుదర్శన్ రెడ్డి తన కుటిల రాజకీయాలను మానుకోవాలని, రైతుల శ్రేయస్సు కోరేలా ప్రవర్తించాలని తొగరు చెన్నారెడ్డి హితవు పలికారు.

# రెండు వారాల పాటు మైదాను తినడం మానేస్తే శరీరంలో జరిగే మార్పులు ఇవే



మనకు తెలియకుండానే రోజువారీ ఆహారంలో భాగమైపోయిన పదార్థం. బ్రెడ్, బిస్కెట్లు, నూడుల్స్, కేకులు, పేస్ట్రీలు వంటి అనేక వంటకాలలో దీన్ని విస్తృతంగా ఉపయోగిస్తున్నారు. రుచిగా ఉన్నప్పటికీ, ఇందులో పోషకాలు తక్కువగా ఉండటం, జీర్ణక్రియపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉండడంతో, ఆరోగ్య నిపుణులు దీనిని పరిమితం చేయాలని సూచిస్తున్నారు. అందుకే కొందరు కొంతకాలం మైదాను పూర్తిగా మానేసి శరీరంలో వచ్చే మార్పులను గమనిస్తున్నారు. కేవలం రెండు వారాల పాటు మైదా తీసుకోకుండా ఉంటే కొన్ని స్పష్టమైన మార్పులు కనిపిస్తాయని నిపుణులు చెబుతున్నారు.జీర్ణ వ్యవస్థకు..మైదాను ఆహారం నుంచి తొలగించడంతో జీర్ణక్రియలో మెరుగుదల కనిపిస్తుంది. ఫైబర్ లేని మైదా జీర్ణక్రియను మందగింపజేస్తుంది. దానికి బదులుగా సంపూర్ణ ధాన్యాలు, పండ్లు, కూరగాయలు తీసుకుంటే ఉబ్బరం తగ్గి, పొట్ట తేలికగా అనిపిస్తుంది. అలాగే శక్తి స్థాయిలు స్థిరంగా మారుతాయి. మైదాతో తయారైన పదార్థాలు రక్తంలో చక్కెరను వేగంగా పెంచి, వెంటనే తగ్గిస్తాయి. దీంతో అలసట, నీరసం వస్తాయి. మైదా మానేయడం వల్ల ఈ మార్పులు తగ్గి, శక్తి స్థాయి సంతులితంగా ఉంటుంది. ఆకలి కూడా నియంత్రణలోకి వస్తుంది. మైదా ఎక్కువసేపు తృప్తిని ఇవ్వదు కాబట్టి తరచూ తినాలనిపిస్తుంది. కానీ ఫైబర్, ప్రోటీన్ ఉన్న ఆహారం తీసుకుంటే ఎక్కువసేపు నిండుగా అనిపించి అనవసరంగా తినడం తగ్గుతుంది. బరువు నియంత్రణలో కూడా ఇది సహాయపడుతుంది.చర్మ సంరక్షణకు..మైదా పదార్థాల్లో ఎక్కువగా ఖాళీ క్యాలరీలు, చక్కెరలు, కొవ్వు ఉంటాయి. వీటిని తగ్గించడం వల్ల అదనపు క్యాలరీలు తగ్గి, కొంతవరకు బరువు నియంత్రణలోకి వస్తుంది. ఉబ్బరం కూడా తగ్గినట్లు అనిపిస్తుంది. చర్మంపై కూడా స్వల్ప మార్పులు కనిపిస్తాయి. ప్రాసెస్డ్ ఆహారం తగ్గించడంతో శరీరంలో ఇన్‌ఫ్లమేషన్ తగ్గి, మొటిమలు లేదా చర్మ సమస్యలు తగ్గే అవకాశం ఉంటుంది. మైదా మానేసిన మొదటి రోజుల్లో తినాలనే కోరికలు పెరగవచ్చు. ముఖ్యంగా బ్రెడ్, బేకరీ పదార్థాలు ఎక్కువగా తీసుకునే వారికి ఇది సహజమే. అయితే కొద్ది రోజుల్లోనే శరీరం అలవాటు పడడంతో ఈ కోరికలు తగ్గిపోతాయి. మైదా పిండిని మానేయడం వల్ల ఈ విధంగా మన శరీరంలో అనేక మార్పులు కనిపిస్తాయని నిపుణులు చెబుతున్నారు.వీటిని తీసుకోవాలి..మైదాను మానేటప్పుడు దానికి బదులుగా సంపూర్ణ గోధుమలు, జొన్నలు, రాగులు, ఓట్స్, పప్పులు వంటి పోషకాహారం తీసుకోవడం అవసరం. కేవలం మైదాను మానేయడం సరిపోదు, మొత్తం ఆహార నాణ్యతను మెరుగుపరచడం ముఖ్యమని నిపుణులు చెబుతున్నారు. రెండు వారాల పాటు మైదాను దూరం పెట్టడం ద్వారా శరీరంలో వచ్చే చిన్న మార్పులను గమనించవచ్చు. ఇది కఠిన నియమం కాదు, కానీ మన ఆహారం శరీరంపై ఎలా ప్రభావం చూపుతుందో అర్థం చేసుకునేందుకు మంచి అవకాశమని నిపుణులు సూచిస్తున్నారు.


# రోజుకు ఎన్ని కప్పుల కాఫీ తాగుతున్నారు.. వీరికి మోతాదు మించితే..!?





కాఫీ ప్రేమికులు ప్రత్యేకంగా ఉంటారు. ఉదయం నిద్ర లేవగానే చాలా మంది కాఫీ లేదా టీ సేవిస్తుంటారు. కాఫీని రోజూ పరిమిత మోతాదులో తాగితే ఆరోగ్యకరమైన ప్రయోజనాలే కలుగు తాయి. రోజూ కాఫీని తాగడం వల్ల పలు వ్యాధులను నయం చేసుకోవచ్చని, మన శరీరానికి పలు రోజుకు ఒకటి లేదా రెండు కప్పుల కాఫీని రెండు వారాల పాటు నియమితంగా తీసుకుంటే శరీరంపై పలు సానుకూల ప్రభావాలు కనిపిస్తాయని నిపుణులు పేర్కొంటున్నారు. కాఫీ వలన ఆరోగ్య పరమైన ప్రయోజనాల పైన పలు నివేదికలు ఉన్నాయి.కాఫీ తీసుకొనే వారి ఒక సారికే పరిమితం అవ్వరు. చాలా మంది రోజు మొత్తంలో ఎక్కువ సార్లు కాఫీ తీసుకోవటం అలవాటుగా మార్చుకుంటున్నారు. కాఫీ కాలేయ ఆరోగ్యానికి మేలు చేస్తుంది. నియమితంగా కాఫీ తాగడం వల్ల ఫ్యాటీ లివర్, ఫైబ్రోసిస్, సిర్రోసిస్ వంటి సమస్యల ప్రమాదం తగ్గుతుంది. దీని వల్ల లివర్ ఆరోగ్యం మెరుగు పడుతుంది. అదే విధంగా కాఫీ మెటబాలిజాన్ని మెరుగు పరుస్తుంది. ఇందులో ఉండే క్లోరోజెనిక్ ఆమ్లాలు ఇన్సులిన్ సెన్సిటివిటీని పెంచి శరీరంలోని మెటబాలిక్ ప్రక్రియలను సమర్థవంతంగా అమలు చేయడంలో సహాయపడతాయి. మెదడు పనితీరును ఉత్తేజపరుస్తుంది. కాఫీలోని కెఫిన్ అలర్ట్‌నెస్,దృష్టి,మానసిక పనితీరును పెంచి మెదడు సామర్థ్యాన్ని మెరుగు పరుస్తుంది. జీర్ణక్రియను మెరుగుపరచడంలో కాఫీ సహాయపడుతుంది.నిపుణుల సూచనలు.. పరిమితి మేరకు తీసుకుంటే కాఫీ తీసుకోవటం ద్వారా ఇది పెద్దపేగును ఉత్తేజపరచి గట్ మొటిలిటీని పెంచడం ద్వారా జీర్ణ ప్రక్రియను సులభతరం చేస్తుంది. అయితే కాఫీ వినియోగంలో కొన్ని జాగ్రత్తలు పాటించాలని నిపుణులు సూచిస్తున్నారు. IBS లాంటి సమస్యలు ఉన్నవారు కాఫీ విషయంలో జాగ్రత్తగా ఉండాలి. సాధారణంగా పెద్దలకు రోజుకు ఒకటి నుంచి రెండు కప్పుల బ్లాక్ కాఫీ సరిపోతుంది. కానీ గుండె దడ, ఆందోళన, ఆమ్లత్వం లేదా నిద్ర సమస్యలు ఉంటే కాఫీని తగ్గించడం లేదా మానేయడం మంచిది. కాఫీలో అధికంగా చక్కెర లేదా ప్రాసెస్ చేసిన క్రీమ్‌లను కలపడం ఆరోగ్యానికి హానికరం. వీటిని తగ్గించడం అవసరం. సరైన పరిమాణంలో, సరైన విధంగా తీసుకుంటే కాఫీ శరీరానికి పలు ప్రయోజనాలు అందుతాయని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

# డంపింగ్ యార్డ్ రద్దు చేయాలని సీఎం రేవంత్ రెడ్డికి రక్తంతో రాసిన లేక

■ హుజురాబాద్ డంపింగ్ యార్డును వెంటనే రద్దు చేయండి
■ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తెలంగాణ ముస్లిం ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు తన రక్తముతో రాసిన లేక










జమ్మికుంట హుజురాబాద్ మే 2 (ప్రజావాణి):అన్ని రాజకీయ పార్టీ నాయకులు కలిసి వచ్చి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి హుజురాబాద్ డంపింగ్ యాడ్ సమస్యను తీసుకొని వెళ్లి ఈ సమస్య పరిష్కారం అయ్యేవరకు హుజురాబాద్ ప్రజల వెంట నాయకులు ఉండాలి హుజురాబాద్ ప్రజలు పత్తి నాయకునికి దగ్గర తీసుకొని ఆ నాయకులకు రాష్ట్రస్థాయిలో వారిని గుర్తింపు వచ్చినట్లు చేసిన ప్రజల వెంట నాయకులు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ భారత రాష్ట్ర సమితి హుజురాబాద్ శాసన సభ్యులు పాడి కౌశిక్ రెడ్డి మాజీ పార్లమెంట్ సభ్యులు ఇప్పటి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ బీసీ మరియు రవాణా శాఖ మంత్రులు పొన్నం ప్రభాకర్ మాజీ పార్లమెంట్ సభ్యులు బోయిన్పల్లి వినోద్ కుమార్ మాజీ రాజ్యసభ సభ్యులు కెప్టెన్ లక్ష్మీకాంతరావు మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి హుజురాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ వి ప్రణవ్ బాబు లాంటి నాయకులందరూ కలిసి డంపింగ్ యార్డ్ రద్దు కొరకు తమ వంతు ప్రయత్నం చేయాలని తెలంగాణ ముస్లిం ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు మొహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ వీరందరికీ విజ్ఞప్తి చేస్తూ ఈరోజు తన రక్తముతో లేఖ రాసి వారందరికీ ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు ఈ సందర్భంగా మహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ రక్తముతో రాసిన లేఖలో ప్రజల ఆరోగ్యానికి ముప్పు ఉంటుందని చెత్త నిలువ చేయటం వలన దుర్వాసన గాలి కాలుష్యం పెరిగి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ పేర్కొన్నారు డంపింగ్ యార్డ్ కారణముగా భూగర్భ జలాలు కాలు శాతం అయ్యి త్రాగు నీటి సమస్యలు తలెత్తుతాయని తెలిపారు అంతేకాకుండా దోమలు ఈగలు వృద్ధి చెంది అంటూ వ్యాధులు వ్యాప్తి చెందుతాయి ముఖ్యంగా చిన్నపిల్లలు గర్భిణీలు, వృద్ధులపై తీవ్ర ప్రభావం ఉంటుందని మహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ ఆవేదన వ్యక్తం చేశారు హుజురాబాద్ ప్రజల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం వెంటనే డంపింగ్ యార్డ్ ఏర్పాటు నిర్ణయాన్ని వెంటనే విరమించుకోవాలని తన లేఖలో ముజాహిద్ హుస్సేన్ కోరారు

# ప్రహరీ గోడను తొలగించిన సింగరేణి సెక్యూరిటీ సిబ్బంది

■ లంచం ఇవ్వలేదని ప్రహరీ గోడ కూల్చివేత
■ క్యాన్సర్ వ్యాధితో తమ్ముడు, ఆడపిల్లలతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు
■ బాధితుల ఆవేదన...







మందమర్రి, (మన ప్రజావాణి) మే 02:పట్టణంలోని మూడవ జోన్ కు చెందిన బొద్దిరెడ్డి రవీందర్ రెడ్డి ఇంటి ప్రహరీ గోడను శనివారం సింగరేణి ఏరియా ఎస్ అండ్ పీసీ సిబ్బంది కూల్చివేశారు. సెక్యూరిటీ సిబ్బంది తమను 20 వేల రూపాయలు లంచం అడగగా, నిరాకరించడంతో తన ప్రహరీ గోడను తొలగించారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశాడు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం, తాను, తన కుటుంబ సభ్యులు అదే ప్రాంతంలో గత 50 సంవత్సరాలుగా నివాసం ఉంటున్నామని, తమకు వివాహాలు అయ్యి, కుటుంబం పెద్దది కావడం, ఇల్లు శిథిలావస్థకు చేరడంతో రాష్ట్ర మంత్రి స్థానిక ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి తో పాటు ఏరియా జీఎం కు సమస్యను వివరించగా, వారు ఇంటిని బాగు చేసేందుకు అనుమతులు సైతం ఇచ్చారని తెలిపారు. వారి అనుమతులతో ఇంటి బాగు చేసుకోగా, ప్రహరీ గోడ మాత్రం కాలువకు కొద్దిగా ముందుకు వచ్చిందని, అయితే ఇదే ప్రాంతంలో అదే కాలువపై అనేక ఇళ్లు, షాపులు నిర్మాణం జరిగాయని, వాటిని తొలగించకుండా కేవలం తమను, తమ ఇంటి నిర్మాణం మాత్రమే లక్ష్యంగా చేసుకుని సెక్యూరిటీ సిబ్బంది వేధింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఇంటి ప్రహరీ కూడా నిర్మాణం చేస్తున్న సమయంలోనే ఏరియా సింగరేణి ఎస్ అండ్ పీసీ విభాగానికి చెందిన జంగా శ్రీనివాస్, గుజ్జు కోమురయ్య లు వచ్చి నిర్మాణాన్ని పరిశీలించారని, అప్పుడు నిర్మాణాన్ని అడ్డుకోకుండా, నిర్మాణం పూర్తయిన అనంతరం తమకు ఫోన్ లో, ఇంటికి వచ్చి మరి 20 వేల రూపాయలు లంచం ఇవ్వాలని డిమాండ్ చేశారని, తాము లంచం ఇవ్వడానికి నిరాకరించడంతో ప్రహరి గోడ తోపాటు ఇంటిని సైతం తొలగిస్తామని బెదిరింపులకు పాల్పడ్డారని ఆరోపించారు. సరిగ్గా వారం తర్వాత శనివారం వారు ఏరియా సెక్యూరిటీ సిబ్బంది స్థానిక పోలీసులతో కలిసి వచ్చి, తమ ఇంటి ప్రహరీ గోడను కూల్చివేశారని ఆవేదన వ్యక్తంచేశారు. నిర్మాణాన్ని మొదట్లోనే ఆపితే తమకు లంచం రాదనే కారణంగానే నిర్మాణం పూర్తయిన అనంతరం లంచం అడుగగా, తమ నిరాకరించడంతోనే ఇంటి ప్రహరీ గోడను తొలగించి, తమను భయభ్రాంతులకు గురి చేశారని తెలిపారు. నిర్మాణం పూర్తైన తర్వాత కట్టడాన్ని తొలగించడంతో తీవ్ర అన్యాయం జరిగిందని, లంచం అడిగి, వేధింపులకు పాల్పడిన సెక్యూరిటీ సిబ్బంది పై తక్షణమే విచారణ జరిపి, తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. తన తమ్ముడు క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ ఇప్పటికీ చికిత్స పొందుతున్నాడని, తమకు ఆడపిల్లలు కలరని, ఇల్లు లేకపోవడం, తమ్ముని చికిత్స తో తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతూ, అప్పు చేసి ఇంటి నిర్మాణాన్ని చేస్తుండగా, కనీసం మానవత్వం లేకుండా లంచం కొరకు తమను వేధింపులకు గురి చేయడం సరైనది కాదన్నారు. ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశంగా కాగా, అధికారులు స్పందించి, పూర్తి స్థాయిలో విచారణ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

# కాల్ నాయక్ తండాలో బీటీ రోడ్డు పనులకు శ్రీకారం

■ ముఖ్య అతిథిగా పాల్గొన్న కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి ఆవుల రాములు
■ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సహకారంతో తీరనున్న తండావాసుల కష్టాలు
■ పనులను ప్రారంభించిన సర్పంచ్ లావుడ్య తిరుపతి





చెన్నారావుపేట మే 2 (ప్రజావాణి):మండలంలోని కాల్ నాయక్ తండా గ్రామ పంచాయతీ పరిధిలో గల బాల్ నాయక్ తండా ప్రజల కల నెరవేరబోతోంది. తండాకు వెళ్లే ప్రధాన రహదారి బీటీ రోడ్డు పనులను శనివారం సర్పంచ్ లావుడ్య తిరుపతి ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి చెన్నారావుపేట మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఆవుల రాములు ముఖ్య అతిథిగా హాజరై, ప్రత్యేక పూజలు నిర్వహించి టెంకాయ కొట్టి పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ తిరుపతి మాట్లాడుతూ.. కాల్ నాయక్ తండాకు సరైన రోడ్డు సౌకర్యం లేక అత్యవసర సమయాల్లో గ్రామస్తులు, గర్భిణులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతమని ఆవేదన వ్యక్తం చేశారు. నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ప్రత్యేక చొరవ చూపి నిధులు మంజూరు చేయించడంతో నేడు ఈ పనులు సాధ్యమయ్యాయని హర్షం వ్యక్తం చేశారు. నాణ్యతతో కూడిన పనులను యుద్ధప్రతిపాదికన పూర్తి చేసి తండావాసులకు రవాణా కష్టాలు తీరుస్తామని ఆయన హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కాల్ నాయక్ తండా ఉపసర్పంచ్ లావుడ్య స్వామి, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు అంగోత్ గోవిందు, వార్డు సభ్యులు గూగులోతు స్వామి, కోనాపురం ఉపసర్పంచ్ మండల నరసింహారావు, వార్డు సభ్యులు పోతరాజు లిట్టు, ఉప్పునుతుల లింగమూర్తిచారి,ఎడ్ల నారాయణరెడ్డి, పురం మల్లయ్య, కళ్లెపు రవీందర్, గ్రామస్తులు అజ్మీరా ప్రశాంత్, లావుడ్య రాములు, బాధవత్ సీత, లావుడ్య విజేందర్, లావుడ్య దేవరాజు, లావుడ్య వెంకన్న, బాధవత్ జాన, లావుడ్య శ్రీను, లావుడ్య నర్సింహ, అంగోత్ రవి, గూగులోతు లచ్చిరామ్, లావుడ్య వాగ్యా, బానోతు నాగన్న, రైతులు దొంతి మధు, పరికి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# రిటైర్మెంట్ ఆలోచన లేదు: స్టార్క్

ఐపీఎల్ 2026లో భాగంగా ఢిల్లీ క్యాపిటల్స్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న క్షణం రానే వచ్చింది. సుదీర్ఘ విరామం, గాయాల తర్వాత ఆస్ట్రేలియా స్టార్ పేసర్ మిచెల్ స్టార్క్ స్టేడియంలో అడుగుపెట్టాడు. జైపూర్‌లోని సవాయ్ మాన్‌సింగ్ స్టేడియంలో రాజస్థాన్ రాయల్స్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో మిచెల్ స్టార్క్ తన రీ-ఎంట్రీని ఘనంగా చాటుకున్నాడు. రాజస్థాన్ బ్యాటర్లను వణికించి 3 కీలక వికెట్లు పడగొట్టి ఢిల్లీ విజయంలో కీలక పాత్ర పోషించాడు.అయితే మ్యాచ్ సమయంలో స్టార్క్ బౌలింగ్ చేతికి భారీగా కట్లు ఉండటం చూసి అతని ఫిట్ నెస్ ఇంకా పూర్తిస్థాయిలో లేదని.. త్వరలోనే ఆయన ఆటకు స్వస్తి పలుకుతాడని సోషల్ మీడియాలో వార్తలు గుప్పుమన్నాయి.ఈ పుకార్లకు మిచెల్ స్టార్క్ మ్యాచ్ అనంతరం ముగింపు పలికాడు. తన రిటైర్మెంట్ గురించి వస్తున్న వార్తలపై స్పందిస్తూ.. "ప్రస్తుతానికి నాకు అలాంటి ఆలోచనే లేదు. చేతికి కట్లు ఉండటం చూసి రిటైర్మెంట్ గురించి మాట్లాడటం కాస్త వింతగా ఉంది. నేను ఇంకా ఆ దశకు చేరుకోలేదని భావిస్తున్నాను" అని మిచెల్ స్టార్క్ స్పష్టం చేశాడు. గత కొన్ని నెలలుగా క్రికెట్‌కు దూరంగా ఉండి.. కేవలం ఫిట్‌నెస్, గాయాల నుంచి కోలుకోవడంపైనే దృష్టి సారించానని, ఇప్పుడు మైదానంలోకి తిరిగి రావడం తనలో ఎంతో ఉత్సాహాన్ని నింపిందని స్టార్క్ కుండబద్దలు కొట్టాడు. 35 ఏళ్ల వయసులో కూడా తనలో ఇంకా చాలా క్రికెట్ మిగిలి ఉందని ఈ సందర్భంగా స్టార్క్ చాటిచెప్పాడు.రాజస్థాన్ ఇన్నింగ్స్ ప్రారంభమైన మొదటి ఓవర్‌లోనే మిచెల్ స్టార్క్ తన సత్తా ఏంటో చూపించాడు. యువ సంచలనం యశస్వి జైస్వాల్ మొదటి రెండు బంతుల్లోనే భారీ సిక్సర్‌తో స్టార్క్‌ను స్వాగతించినప్పటికీ.. స్టార్క్ మాత్రం తడబడలేదు. మూడో బంతికే అద్భుతమైన డెలివరీతో జైస్వాల్‌ను ఔట్ చేసి ప్రతీకారం తీర్చుకున్నాడు. ఆ తర్వాత సెంచరీకి




చేరువవుతున్న రాజస్థాన్ కెప్టెన్ రియాన్ పరాగ్‌తో పాటు రవీంద్ర జడేజా వికెట్లను కూడా తీసి రాజస్థాన్ స్కోరు వేగానికి బ్రేకులు వేశాడు. 4 ఓవర్లలో 40 పరుగులు ఇచ్చి 3 వికెట్లు పడగొట్టి తన రాకను ఘనంగా చాటాడు.దాదాపు 3 నెలల పాటు ఏ బ్యాటర్‌కు బౌలింగ్ చేయకుండా నేరుగా ఐపీఎల్ లాంటి హై-వోల్టేజ్ టోర్నీలో ఆడటం అంత సులభం కాదని స్టార్క్ అంగీకరించాడు. "బౌలింగ్ స్పీడ్ అందుకోవడానికి, మ్యాచ్ రిథమ్‌లోకి రావడానికి ఈ మ్యాచ్ నాకు బాగా ఉపయోగపడింది. నా మోచేయి గాయం కారణంగా కొన్ని పరిమితులు ఉన్నప్పటికీ.. దానికి తగ్గట్టుగా బౌలింగ్ శైలిని మార్చుకుంటున్నాను. ఈ విజయం జట్టుకు ఎంత ముఖ్యమో, నా ఆత్మవిశ్వాసానికి కూడా అంతే ముఖ్యం. రాబోయే మ్యాచ్‌ల్లో నా బౌలింగ్ ప్రదర్శన మరింత మెరుగుపడుతుందని నమ్ముతున్నాను" అని స్టార్క్ ఆశాభావం వ్యక్తం చేశాడు.

# వైభవ్ సూర్యవంశీని చూసి భయపడ్డాను

## వైభవ్ సూర్యవంశీ భయం లేని ఆటగాడు

## ఢిల్లీ స్టార్ పేసర్ కైల్ జేమీసన్ ప్రశంసా

వైభవ్ సూర్యవంశీ ఆటతీరును ప్రశంసించాడు. "నా జీవితంలో 15 ఏళ్ల పిల్లాడిని చూసి ఇంతలా భయపడతానని ఎప్పుడూ అనుకోలేదు. కానీ వైభవ్ భయం లేని ఆటగాడు. అతని కోసం మేము ప్రత్యేక ప్రణాళికలు రచించాం. రాజస్థాన్ జట్టుకు ఓపెనర్లు వైభవ్, జైస్వాల్ ఇచ్చే ఆరంభం చాలా కీలకం. అందుకే వారిని త్వరగా ఔట్ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఆ ప్లాన్ వర్కౌట్ అయినందుకు చాలా సంతోషంగా ఉంది. అందుకే అలా సెలబ్రేషన్ చేశాను." అని కైల్ జేమీసన్ పేర్కొన్నాడు.రాజస్థాన్ రాయల్స్ జట్టు టాపార్డర్‌ను దెబ్బతీయడమే తమ ప్రధాన ఉద్దేశమని జేమీసన్ వివరించాడు. పవర్‌ప్లేలో పరుగుల వేగాన్ని అడ్డుకోవడానికి మిచెల్ స్టార్క్, తాను కలిసి చేసిన ప్రయత్నం ఫలించిందని చెప్పాడు. స్టార్క్ హై ఫుల్ టాస్‌తో ఒక వికెట్ తీయగా.. తాను అద్భుతమైన యార్కర్‌తో వైభవ్ వికెట్ తీయడం వల్ల రాజస్థాన్ భారీ స్కోరు చేసే అవకాశాన్ని అడ్డుకోగలిగామని తెలిపాడు. జేమీసన్ మాటలు ఎలా ఉన్నా.. మైదానంలో అతను ప్రదర్శించిన దూకుడును బీసీసీఐ తీవ్రంగా పరిగణించింది.




ఐపీఎల్ ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినందుకు అతనికి ఓ డెమెరిట్ పాయింట్‌తో పాటు జరిమానా కూడా విధించింది. జేమీసన్ కూడా తన తప్పును అంగీకరించడంతో మ్యాచ్ రిఫరీ శిక్షను ఖరారు చేశారు. ఢిల్లీ మ్యాచ్ గెలిచినప్పటికీ, జేమీసన్ ప్రవర్తన మాత్రం ఈ మ్యాచ్‌లో ఓ మాయని మచ్చలా మిగిలిపోయింది.



# రఫ్ఫాడించిన రాహుల్, నిస్సంక

రాజస్థాన్ రాయల్స్?పై దిల్లీ క్యాపిటల్స్ రఫ్ఫాడించింది. గత మ్యాచ్‌లో ఆర్సీబీపై 75 పరుగులకే కుప్పకూలిన దిల్లీ రాజస్థాన్‌పై పంజా విసిరింది. 226 పరుగుల భారీ టార్గెట్‌ను సైతం అలవోకగా ఛేదించింది. ఫలితంగా హ్యాట్రిక్ ఓటముల తర్వాత గెలుపు బాట పట్టింది. ఓపెనర్లు కేఎల్ రాహుల్ (75 పరుగులు), పాథుమ్ నిస్సంక (62 పరుగులు) మెరుపు హాఫ్ సెంచరీలతో రాణించడంతో భారీ ఛేదనను దిల్లీ 19.1 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి ఛేదించింది. రాజస్థాన్ బౌలర్లలో రవీంద్ర జడేజా, తుషార్ దేశ్‌పాండే, జోఫ్రా ఆర్చర్ తలో 1 వికెట్ పడగొట్టారు. అంతకుముందు బ్యాటింగ్ చేసిన రాజస్థాన్ 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 225 పరుగులు చేసింది. కెప్టెన్ రియాన్ పరాగ్ (90 పరుగులు) సత్తా చాటాడు. ధ్రువ్ జురెల్ (42 పరుగులు) రాణించాడు. చివర్లో డోనొవన్ ఫరీర్ (47 పరుగులు, 14 బంతుల్లో) రెచ్చిపోయాడు. దీంతో రాజస్థాన్‌కు భారీ స్కోర్ దక్కింది. దిల్లీ బౌలర్లలో మిచెల్ స్టార్క్ 3, కైల్ జెమీసన్, అక్షర్ పటేల్, నటరాజన్ తలో 1 వికెట్ దక్కించుకున్నారు. తాజా విజయంతో దిల్లీ ప్లేఆఫ్స్ అవకాశాలను సజీవంగా ఉంచుకుంది. ఆ జట్టు ఇప్పటిదాకా 9 మ్యాచ్‌లు ఆడగా నాలుగింట్లో నెగ్గింది. ఐదు మ్యాచ్‌ల్లో ఓడింది. 8 పాయింట్లతో ప్రస్తుతం ఆరో స్థానానికి దూసుకెళ్లింది. మరోవైపు, రాజస్థాన్ 10 మ్యాచ్‌ల్లో నాలుగో ఓటమితో నాలుగో ప్లేస్‌లో కొనసాగుతోంది.

# బ్యాట్‌తో కుల్దీప్ ముఖంపై కొట్టబోయిన జడేజా..




ఐపీఎల్ 2026లో భాగంగా నిన్న రాజస్థాన్ రాయల్స్, ఢిల్లీ క్యాపిటల్స్ మధ్య జరిగిన మ్యాచ్‌లో ఆసక్తికర సంఘటన జరిగింది. రాజస్థాన్ టీమ్‌కు చెందిన రవీంద్ర జడేజా, ఢిల్లీ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ మధ్య ఈ ఘటన జరిగింది. అయితే వీరిద్దరూ కొట్టుకునే స్థాయికి వెళ్లారని చూపరులకు కనిపిస్తుంది. కానీ, అక్కడ జరిగింది అందుకు పూర్తి విరుద్ధం. రాజస్థాన్ రాయల్స్ జట్టు బ్యాటింగ్ చేస్తున్న క్రమంలో ధ్రువ్ జూరెల్ అవుటైన తర్వాత 12వ ఓవర్‌లో జడేజా బ్యాటింగ్‌కు వచ్చాడు. అదే సమయంలో ఈ విచిత్ర సంఘటన జరిగింది. రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్‌లు ఒకరినొకరు సరదాగా ఆటపట్టించుకోవడం కనిపించింది. ఇప్పుడు అందుకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది. కుల్దీప్ తన వైపు రావడం గమనించిన జడేజా, తన టీమ్‌ఇండియా పార్ట్‌నర్‌ను భయపెట్టాలనే ఉద్దేశంతో వ్యూహాత్మకంగా బ్యాట్ ఝుళిపించాడు. అయితే, కుల్దీప్ ఏమాత్రం చలించకుండా, జడేజా భుజాలపై చేతులు వేసి తేలికగా నెట్టాడు. జడేజా తన బ్యాట్‌ను అంపైర్‌తో తనిఖీ చేయించుకోబోతుండగా, కుల్దీప్ అతడిని పట్టుకుని మళ్లీ నెట్టాడు. వారి మధ్య జరిగిన ఈ సరదా వాగ్వాదం సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఇదిలా ఉండగా.. ఈ మ్యాచ్ ద్వారా ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు వరుసగా మూడు ఓటముల పరంపరకు ముగింపు పలికి, ఐపీఎల్‌లో తమ అత్యధిక విజయవంతమైన ఛేజింగ్‌ను పూర్తి చేసింది. జైపూర్‌లో 226 పరుగుల లక్ష్యాన్ని ఛేదిస్తున్న క్రమంలో, ఓపెనర్లు కేఎల్ రాహుల్, పతుమ్ నిస్సంకల అర్ధశతకాల చెలరేగిన వేళ రాజస్థాన్ రాయల్స్ జట్టుపై ఢిల్లీ ఘనవిజయం సాధించింది. పతుమ్ నిస్సంక 33 బంతుల్లో 62 పరుగులతో ఛేజింగ్‌లో రాజస్థాన్ జట్టుపై అద్భుతమైన ఆరంభాన్ని అందించగా, కేఎల్ రాహుల్ 40 బంతుల్లో 75 పరుగులు చేసి ఢిల్లీని విజయానికి చేరువ చేశాడు. నిస్సంకతో కలిసి 110 పరుగుల ఓపెనింగ్ భాగస్వామ్యం నెలకొల్పిన సమయంలో రాహుల్ అతనికి సహకరించినప్పటికీ, నిస్సంక అవుటైన తర్వాత డీసీ ఇన్నింగ్స్‌కు ఎంతో అవసరమైన ఊపునిచ్చాడు. చివరికి, నితీష్ రాణా (33), అశుతోష్ శర్మ (25లి), ట్రిస్టన్ స్టబ్స్ (18లి) అందించిన విలువైన ఇన్నింగ్స్‌తో రాణించారు. అంతకుముందు బ్యాటింగ్ చేసిన రాజస్థాన్ రాయల్స్ జట్టు కెప్టెన్ రియాన్ పరాగ్ 50 బంతుల్లో 90 పరుగులు చేసి ఫామ్‌లోకి తిరిగి వచ్చాడు. ఇది ఈ సీజన్‌లో అతని మొదటి యాభైకి పైగా స్కోరు. అదే సమయంలో, డోనోవన్ ఫెరీరా 14 బంతుల్లో 47 నాటౌట్ పరుగులతో మెరుపు ఇన్నింగ్స్ ఆడటంతో, బ్యాటింగ్ ఎంచుకున్న == జట్టు 225/6 అనే బలమైన స్కోరును నమోదు చేసింది. పంజాబ్ కింగ్స్‌తో జరిగిన గత మ్యాచ్‌లో 'వేపింగ్' చేస్తూ పట్టుబడి జరిమానాకు గురైన పరాగ్, తొలి రెండు ఓవర్లలోనే యశస్వి జైస్వాల్ (6), వైభవ్ సూర్యవంశీ (4) అవుటైన తర్వాత, ధృవ్ జురెల్ (42)తో కలిసి ఇన్నింగ్స్‌ను పటిష్టం చేశాడు.

# మీరు చదివే ప్రతిదానిని నమ్మకండి

**- క్రీడా వ్యాఖ్యాత యెషా సాగర్**

గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో ఒక యువ క్రికెటర్ మరియు మహిళా యాంకర్ మధ్య ప్రేమ వ్యవహారం నడుస్తోందని, అందులో ఆ క్రికెటర్ ఆమెను తీవ్రంగా నియంత్రిస్తున్నాడని వార్తలు గుప్పుమన్నాయి. జర్నలిస్ట్ అభిషేక్ త్రిపాఠి చేసిన కొన్ని పరోక్ష వ్యాఖ్యలు ఈ వివాదానికి ఆజ్యం పోశాయి. అధికారికంగా పేర్లు వెల్లడించనప్పటికీ, నెటిజన్లు మాత్రం ఆ జంట సమీర్ రిజ్వీ, యెషా సాగర్ అని ఒక నిర్ణయానికి వచ్చేశారు.సమీర్ రిజ్వీ తనపై మత మార్పిడి కోసం ఒత్తిడి చేస్తున్నాడని, క్రీడా వ్యాఖ్యాతగా పని చేస్తున్న సమయంలో ఇతర క్రికెటర్లతో షేక్ హ్యాండ్ చేయకుండా కేవలం నమస్కారం మాత్రమే చేయాలని షరతులు విధించాడని వార్తలు వచ్చాయి. అంతేకాకుండా, ఆమె సామాజిక మాధ్యమ ఖాతాల నుంచి కొన్ని రకాల ఫొటోలను తొలగించాలని కూడా ఒత్తిడి తెచ్చినట్లు ప్రచారం జరిగింది. ఇవి అత్యంత సున్నితమైన అంశాలు కావడంతో ఈ వివాదం పెద్ద ఎత్తున చర్చనీయాంశమైంది.ఈ వివాదం మరింత ముదురుతుండటంతో యెషా సాగర్ తన సోషల్ మీడియా వేదికగా ఒక రహస్య సందేశాన్ని పంచుకున్నారు. "సోషల్ మీడియాలో మీరు చూసే లేదా చదివే ప్రతిదానిని నమ్మకండి" అని ఆమె పేర్కొన్నారు. దీని ద్వారా సమీర్ రిజ్వీతో తనపై వస్తున్న ఆరోపణలను ఆమె పరోక్షంగా ఖండించారు. అయితే, సమీర్ రిజ్వీ ఇప్పటివరకు ఈ విషయంపై ఎలాంటి ప్రకటన చేయలేదు. ఇరు పక్షాలు ప్రస్తుతం ఈ సున్నితమైన అంశంపై మౌనాన్ని పాటిస్తున్నాయి. యెషా సాగర్ ప్రముఖ క్రీడా వ్యాఖ్యాత, మోడల్. పంజాబ్‌లోని లూథియానాలో జన్మించిన ఆమె, ఉన్నత చదువుల కోసం కెనడా వెళ్లారు. తొలుత పంజాబీ మ్యూజిక్ వీడియోల ద్వారా గుర్తింపు పొందిన ఆమె, తర్వాత క్రీడా రంగంపై ఆసక్తితో వ్యాఖ్యాతగా మారారు. గ్లోబల్ టీ20 కెనడా, యూపీ టీ20 లీగ్, మహిళా ప్రీమియర్ లీగ్ వంటి వేదికలపై ఆమె పనిచేశారు. నివేదికల ప్రకారం, యూపీ టీ20 లీగ్ సమయంలో సమీర్ రిజ్వీతో ఆమెకు పరిచయం ఏర్పడింది. ప్రస్తుత ఐపీఎల్ 2026 సీజన్‌లో సమీర్ రిజ్వీ ఢిల్లీ క్యాపిటల్స్



తరపున అద్భుతంగా రాణిస్తున్నారు. ఇప్పటివరకు ఆడిన 7 ఇన్నింగ్స్‌ల్లో 149.28 స్ట్రైక్ రేట్‌తో 209 పరుగులు చేశారు. గతంలో చెన్నై సూపర్ కింగ్స్ తరపున ఆడినప్పటికీ, ఈ ఏడాది ఢిల్లీ జట్టులో ఆయన కీలక ఆటగాడిగా మారారు.




# జూన్ 26న లెనిన్ విడుదల

'ఏజెంట్'వంటి డిజాస్టర్ తర్వాత 'లెనిన్'తో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమయ్యాడు అఖిల్ అక్కినేని. ఇటీవల ఈ చిత్రం గురించి కింగ్ నాగార్జున పాజిటివ్‌గా స్పందించడంతో.. అక్కినేని అభిమానుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది. మురళి కిషోర్ అబ్బురు దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాపై టాలీవుడ్ వర్గాల్లో ఇప్పటికే మంచి అంచనాలు ఉన్నాయి. ఇది అఖిల్ కెరీర్‌ను మలుపు తిప్పే చిత్రమవుతుందని అభిమానులు గట్టిగా నమ్ముతున్నారు. అయితే లెనిన్ సినిమా విడుదల తేదీపై గత కొన్ని రోజులుగా నెలకొన్న సందిగ్ధతకు ఇప్పుడు తెరపడింది. లెనిన్ వాయిదా పడుతందనే వార్తలు వచ్చినప్పటికీ.. తాజాగా పరిస్థితులు అనుకూలించాయి. రామ్ చరణ్ 'పెద్ది' సినిమాను జూన్ 4న విడుదల చేస్తున్నట్లు అధికారికంగా ప్రకటించడంతో ఎలాంటి పోటీ లేకుండా జూన్ 26న 'లెనిన్' సోలోగా బాక్సాఫీస్ వద్ద సందడి చేసేందుకు మార్గం సుగమమైంది. ఇతర పెద్ద సినిమాల పోటీ లేకపోవడం లెనిన్‌కు పెద్ద ప్లస్ పాయింట్‌గా మారుతుందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు.

-----

# ఆస్కార్ అవార్డుల్లో సరికొత్త నిబంధనలు

## టాలెంట్‌ను ప్రోత్సహించే విధంగా మార్పులు

ద

ప్రపంచ సినిమా రంగంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన ఆస్కార్ అవార్డుల 99వ ఎడిషన్ కోసం అకాడమీ సరికొత్త నిబంధనలను తీసుకువచ్చింది. 2027 ఆస్కార్ అవార్డులకు సంబంధించి అకాడమీ ఆఫ్ మోషన్ పిక్చర్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్ యాక్టింగ్, అంతర్జాతీయ సినిమాలు, సాంకేతిక విభాగాల్లో కీలక మార్పులు చేసింది. కొత్త నిబంధనల ప్రకారం.. ఒకే నటుడు ఒకే జాబితాలో రెండు వేరువేరు సినిమాలకు నామినేట్ అయ్యే అవకాశం ఉంది. ఇప్పటివరకూ నటీనటులు ఒక విభాగంలో ఒక సినిమాకు మాత్రమే నామినేట్ అయ్యే అవకాశం ఉండేది. దీనివల్ల టాలెంట్ ఉన్న నటులు ఒకే ఏడాది ఎన్ని చిత్రాల్లో గొప్ప ప్రదర్శనలు ఇచ్చినా, ఏదో ఒకదానితోనే సరిపెట్టుకోవాల్సి వచ్చేది. ఇకపై ఈ నిబంధనను తొలగించి ఎన్ని సినిమాలకు అయినా నామినేట్ చేసుకునే అవకాశాన్ని అకాడమీ కల్పించింది. అంతర్జాతీయ ఫీచర్ ఫిల్మ్ విభాగంలో కూడా అకాడమీ కీలక మార్పులు చేసింది. ఒక దేశం నుంచి ఇప్పుడు ఒకటి కంటే ఎక్కువ సినిమాలు నామినేషన్లకు అర్హత సాధించొచ్చు. అలాగే, కేన్స్ లాంటి ప్రముఖ అంతర్జాతీయ చలనచిత్ర వేడుకల్లో అగ్ర పురస్కారాలు అందుకున్న సినిమాలు నేరుగా ఆస్కార్ బరిలో పోటీపడే అవకాశాన్ని కూడా అకాడమీ కల్పించింది. మరోవైపు అంతర్జాతీయ సినిమా కేటగిరీలో ట్రోఫీపై దేశం పేరుతో పాటు దర్శకుడి పేరును కూడా ముద్రించనున్నారు. సినిమా రంగంలో పెరుగుతున్న కృత్రిమ మేధ వినియోగంపై అకాడమీ కఠిన నిర్ణయం తీసుకుంది. రైటింగ్ (స్క్రీన్‌ప్లే) విభాగంలో రచయితలు రాసిన కథలను మాత్రమే పరిగణనలోకి తీసుకోనున్నట్లు తెలిపింది. ఏఐ సహాయంతో రాసిన వాటిని అనుమతించబోమని వెల్లడించింది. యాక్టింగ్‌లో కూడా కృత్రిమ మేధతో సృష్టించిన సీన్స్, మార్పులు చేసిన ప్రదర్శనలను అంగీకరించబోమని స్పష్టం చేసింది (ంఇజీటి।పా ఃజీనిబ ంఎ). నటీనటులు నేరుగా చేసిన ప్రదర్శనలకే అవార్డులు ఇవ్వనున్నట్లు తెలిపింది. వచ్చే ఏడాది ఆస్కార్ అవార్డుల వేడుకలో ఈ నిబంధనలు అమలుకానున్నాయి. 99వ ఆస్కార్ అవార్డుల వేడుక మార్చి 14న లాస్ ఏంజెలెస్‌లో ఘనంగా జరగనుంది.



# వారణాసి కోసం జర్మనీలో మహేశ్‌బాబు


రాజమౌళి – మహేశ్ బాబు కాంబినేషన్‌లో రానున్న 'వారణాసి' కోసం ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీప్రియులు ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం మహేశ్ బాబు జర్మనీలోని బ్లాక్ ఫారెస్ట్ లో ఉన్నారు. అక్కడ ఆయన ఫిట్‌నెస్, వెల్‌నెస్ నిపుణులు డాక్టర్ హ్యారీ కోనిగ్ పర్యవేక్షణలో కఠినమైన శిక్షణ పొందుతున్నారు. దీనికి సంబంధించిన ఫోటోలను మహేశ్ స్వయంగా తన సోషల్ మీడియాలో పంచుకున్నారు. ట్రెక్కింగ్‌లో ట్రైనింగ్ తీసుకుంటూ వారణాసి కోసం సిద్ధమవుతున్నట్లు క్యాప్షన్ పెట్టారు. ప్రస్తుతం ఈ ఫొటోలు వైరల్ అవుతున్నాయి. గ్లోబల్ ప్రేక్షకులను ఆకర్షించడమే లక్ష్యంగా రాజమౌళి ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. 'వారణాసి' సినిమాతో మరిన్ని కొత్త మార్కెట్లనీ కొల్లగొట్టాలనే ప్రణాళికల్ని చిత్రబృందం సిద్ధం చేసింది. ముఖ్యంగా దక్షిణ అమెరికాతోపాటు, లాటిన్ అమెరికా దేశాల మార్కెట్‌పైన గురిపెట్టినట్టు తెలుస్తోంది. 'వారణాసి' కథ కూడా పలు దేశాలతో ముడిపడినది కావడం, కథానాయకుడు ప్రపంచాన్ని చుట్టే సాహసికుడు కావడంతో... మరిన్ని కొత్త దేశాలకు, కొత్త మార్కెట్లకీ ఈ సినిమాని తీసుకెళ్లాలనే ప్రణాళికలు రచిస్తున్నారు. వచ్చే ఏడాది ఏప్రిల్ 7న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకురానుంది.



# బోల్డ్ సీన్స్‌పై కియారా యూ టర్న్

కన్నడ స్టార్ యష్ హీరోగా, బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కియారా అద్వానీ కలిసి నటిస్తున్న టాక్సిక్ సినిమా తాజాగా సోషల్ మీడియాలో భారీ చర్చకు దారి తీసింది. ముఖ్యంగా సినిమాలోని బోల్డ్ కంటెంట్, దాని చుట్టూ తిరుగుతున్న గాసిప్‌లు, మరియు హీరోయిన్ కెరీర్‌పై దీని ప్రభావం.. ఇవన్నీ కలిపి ఈ ప్రాజెక్ట్‌ను మరింత హాట్ టాపిక్‌గా మార్చాయి. రీసెంట్ టైమ్స్ లో ఇండియన్ సినిమాల్లో బోల్డ్ కంటెంట్ పెరుగుతుందనేది స్పష్టమైన ట్రెండ్. ఓటీటీ ప్లాట్‌ఫామ్‌ల ప్రభావం, గ్లోబల్ కంటెంట్ ఎక్స్‌పోజర్ కారణంగా డైరెక్టర్లు మరింత రియలిస్టిక్, ఎమోషనల్ మరియు బోల్డ్ ట్రీట్‌మెంట్ వైపు మళ్లుతున్నారు. అయితే ఈ విషయంలో ఆడియన్స్ యాక్సెప్టెన్స్ మాత్రం ఇంకా మిక్స్‌ గానే కనిపిస్తోంది. అర్బన్ ఆడియన్స్ ఈ మార్పులను స్వాగతిస్తున్నా, ఫ్యామిలీ ఆడియన్స్‌లో మాత్రం ఇంకా కొంత రిజర్వేషన్ ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో టాక్సిక్ లాంటి బోల్డ్ యాక్షన్ డ్రామా ఎంతవరకు కనెక్ట్ అవుతుందో అనేది ఆసక్తికర ప్రశ్నగా మారింది. ఇదే సమయంలో, కియారా అద్వానీ కెరీర్ లో ఈ సినిమా కీలక మలుపుగా భావించవచ్చు. ఇప్పటి వరకు గ్లామరస్, రొమాంటిక్, కమర్షియల్ రోల్స్‌తో గుర్తింపు తెచ్చుకున్న ఆమె, ఈసారి మరింత బోల్డ్, ఇంటెన్స్ పాత్రను ఎంచుకోవడం ఒక రిస్కీ స్టెప్‌గా కనిపిస్తోంది. ఇది ఆమెను కొత్త రేంజ్‌కి తీసుకెళ్లే అవకాశం ఉన్నప్పటికీ, అదే సమయంలో ఇమేజ్‌పై ప్రభావం చూపే అవకాశాన్ని కూడా విస్మరించలేం. ముఖ్యంగా సీన్ లెంగ్త్ లేదా ప్రెజెంటేషన్‌పై వచ్చిన తాజా గాసిప్‌లు, ఆమె కెరీర్ స్ట్రాటజీపై కొత్త చర్చలకు దారితీశాయి. ఈ సినిమాలో తాను నటించిన బోల్డ్ సీన్స్ ను ట్రిమ్ చేయాలని కృతి మేకర్స్ ను కోరినట్టు తెలుస్తోంది. షూటింగ్ టైమ్ లో ఈ సీన్స్ తన అనుమతితోనే జరిగినప్పటికీ, ఇప్పుడు ఫైనల్ అవుట్‌పుట్ చూశాక కృతికి ఇబ్బందిగా అనిపించి, తన డెసిషన్ ను మార్చుకున్నారని, అందుకే ఆ సీన్స్ ను సినిమాలో నుంచి తొలగించాలని డైరెక్టర్ ను సంప్రదించినట్టు తెలుస్తోంది. సాధారణంగా సినిమా షూట్ సమయంలో నటీనటులకు స్క్రిప్ట్, సీన్ బ్లాకింగ్, కెమెరా ట్రీట్‌మెంట్ గురించి ముందుగానే అవగాహన ఉంటుంది.






# పృథ్వీరాజన్ సుకుమారన్...ఐ నోబడీ

మలయాళ స్టార్ హీరో పృథ్వీరాజ్ సుకుమారన్, టాలెంటెడ్ నటి పార్వతి తిరువోతు ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం ఐ, నోబడీ.. 'రోషాక్' వంటి ప్రయోగాత్మక చిత్రంతో మెప్పించిన దర్శకుడు నిసామ్ బషీర్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నాడు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన అఫీషియల్ టీజర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ టీజర్ చూస్తుంటే, సినిమా కథాంశం ఒక వ్యక్తి తన అస్తిత్వం కోసం చేసే పోరాటం లేదా రహస్యం చుట్టూ తిరుగుతుందని అర్థమవుతోంది. ఒక సాధారణ ఉద్యోగి అనుకోకుండా కొన్ని క్లిష్ట పరిస్థితుల్లో చిక్కుకుంటాడు. ఆ ప్రమాదం నుండి తనను తాను కాపాడుకుంటూనే, తన కుటుంబాన్ని ఎలా రక్షించుకున్నాడు అనేదే ఈ చిత్ర ప్రధాన కథాంశంగా కనిపిస్తోంది. ఇందులో పృథ్వీరాజ్ సరికొత్త లుక్, పార్వతి నటన సినిమాపై భారీ అంచనాలను పెంచుతున్నాయి. వీరిద్దరి కాంబినేషన్ ఈ చిత్రానికి ప్రధాన బలంగా నిలవనుంది. జేక్స్ బిజోయ్ అందించిన నేపథ్య సంగీతం టీజర్‌కు ప్రాణం పోసింది. ప్రతి సన్నివేశాన్ని తన మ్యూజిక్‌తో ఆయన ఎంతో ఉత్కంఠభరితంగా మలిచారు.

# ఆధ్యాత్మిక రహస్యాల చుట్టూ తిరిగే 'అగధ'

ఆధ్యాత్మిక రహస్యాలు ఎప్పుడూ ఆసక్తిని కలిగిస్తూనే ఉంటాయి .. ఆశ్చర్యాన్ని రేకెత్తిస్తూనే ఉంటాయి. దైవిక శక్తులు .. అవి చూపించే ప్రభావం చుట్టూ ఈ తరహా కథలు నడుస్తూ ఉంటాయి. ఇలాంటి కథలు గతంలో ఎమ్మెస్ రాజు బ్యానర్లో రూపొందాయి. కథాకథనాల పరంగా అలరిస్తూ, బాక్సాఫీస్ దగ్గర భారీ విజయాలను నమోదు చేశాయి. అలాంటి ఎమ్మెస్ రాజు దర్శకత్వంలో రూపొందుతున్న సినిమానే 'అగధ'. టైటిల్ తో .. ఆ టైటిల్ ను డిజైన్ చేసిన తీరుతో అందరి దృష్టిని ఆకర్షించిన సినిమా ఇది. సీనియర్ నటి మంజుల మనవరాలు .. వనిత విజయ్ కుమార్ కూతురు 'జోవిక' ఈ సినిమాలో ప్రధానమైన పాత్రను పోషించింది. రీసెంటుగా వదిలిన ఆమె పోస్టర్ కి మంచి రెస్పాన్స్ వచ్చింది. ఉల్కా గుప్తా .. కామాక్షి భాస్కర్ల పోస్టర్లు కూడా ఈ సినిమాపై అంచనాలు పెంచాయని చెప్పాలి. ఆదివరహా బ్యానర్ పై నిర్మితమైన ఈ సినిమా, ప్రస్తుతం పోస్టు ప్రొడక్షన్ పనులు జరుపుకుంటోంది. ఆధ్యాత్మిక రహస్యాలు .. దైవిక శక్తుల చుట్టూ తిరిగే కథ ఇది. అందువలన గ్రాఫిక్స్ కి ఎక్కువ అవకాశం ఉన్న కంటెంట్ ఇది. సినిమా నిడివిలో 45 నిమిషాల పాటు గ్రాఫిక్స్ ఉంటాయని చెబుతుండటం ఆడియన్స్ లో మరింత ఉత్కంఠను పెంచుతోంది. 85 రోజుల పాటు షూటింగు జరుపుకున్న ఈ సినిమా, త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. తెలుగు .. తమిళ .. మలయాళ .. కన్నడ .. హిందీ భాషల్లో రూపొందుతున్న ఈ సినిమా, సంచలనాన్ని సృష్టించడం ఖాయమనే టాక్ వినిపిస్తోంది.




Printed, Published and Owned by RAYINIPATLA KUMARASWAMY, Printed at RAMANI WEB OFFSET PRINTERS, Auto Nagar, Bommakal, Karimnagar, Editor : RAYINIPATLA KUMARASWAMY, MANAPRAJAVAANI BROAD CASTING AND PUBLICATIONS, Ankireddypally, Thanggellapally, Rajanna Sircilla, TELANGANA-505405. RNI NO:TGTEL/25/A5443 Contact No : 9440032006. MAIL ID : Kumaraswamyrayinipatla@gmail.com